Published from
Telangana and Andhra Pradesh

PRGI NO.TELTEL/2010/33275

ఎడిటర్- కలకొండ రామకృష్ణ

ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily జాతీయ దినపత్రిక

Digital Editions : www.prajakalam.in., epaper.prajakalam.in , www.magzter.com, www.paperboy.com

బుధవారం | 04-11- 2026 | సంపుటి: 17, సంచిక : 214, పేజీలు : 12, వెల : 3/-



రోడ్లు వేయమంటే అరెస్టులా..?

ప్రశ్నించే యువకుల అరెస్ట్ ప్రజాస్వామికమా??

వారి ఆవేదనలో ఆవేశం కనిపించింది కానీ ఆ ఆవేశానికి కారణమైన అసంపూర్తి రహదారి కనిపించలేదా.?

వాట్సాప్ లో వివాదాస్పద వ్యాఖ్యలు యువకుల బాధ్యతరాహిత్యం అయితే ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేని నాయకులది అధికార ధర్పమా??

యువకుల ప్రశ్న వ్యక్తిగత ప్రయోజనంకై కాదు ?

హామీలిచ్చి గాలికి వదిలిన నాయకుల కనువిప్పు కోసం వేగంగా కదిలిన చ(చు)ట్టం ఆయన మెప్పు కోసమేనా??

8



మెట్‌పల్లి మండలంలో ఇసుక దందాకు

వీడీసీల అండ?

రామలచ్చక్కపేటలో రూ.9.20 లక్షలు.. ఆత్మకూరులోనూ ముగిసిన పాట

అనుమతులపై అనుమానాలు.. అధికారుల నిఘా ఏదీ?

జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకోవాలని స్థానికుల డిమాండ్

మెట్‌పల్లిరూరల్,నవంబర్ 03:(ప్రజా కలం); మెట్ పల్లి మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ఇసుక వేలం పాటలు జోరుగా సాగుతున్నా యన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండల పరిధిలోని రామలచ్చక్కపేట గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ (వీడీసీ) ఆధ్వర్యంలో రహస్యంగా ఇసుక టెండర్ ప్రక్రియ నిర్వహించినట్లు సమాచారం. ఈ వేలంలో రూ. 9,20,000 (తొమ్మిది లక్షల ఇరవై వేల రూపాయలు) భారీ మొత్తానికి ఓ వ్యక్తి ఇసుక తవ్వకాల హక్కులను దక్కించుకున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది.

తరువాయి 2వ పేజీలో...

కేంద్ర పథకాల నిధులను సమర్థవంతంగా

వినియోగించుకోవాలి

కేంద్ర నిధులను పూర్తిస్థాయిలో రాబట్టేందుకు కృషి చేయాలి

కేంద్ర ప్రాయోజిత పథకాల లక్ష్యాలు నెరవేరాలి.. ప్రజలకు ఆశించిన ప్రయోజనాలు అందాలి

కేంద్ర శాఖలతో నిరంతర సమన్వయం చేసుకోవాలి: ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్, నవంబరు 3 (ప్రజాకలం) : తెలంగాణలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలుపై మరింత దృష్టి సారించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. కేంద్ర పథకాల కింద కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించుకోవడంతో పాటు, ఆయా పథకాల ద్వారా ఆశించిన ఫలితాలు సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో కేంద్ర ప్రభుత్వ సెక్టార్, సెంట్రల్ స్పాన్సర్డ్ స్కీమ్స్ అమలు, నిధుల కేటాయింపులు, ఖర్చులు, పెండింగ్ బిల్లులు, కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రం నుంచి నిధులు పొందేందుకు ఉన్న అన్ని అవకాశాలను శాఖలవారీగా గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలను సకాలంలో సమర్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాల మార్గదర్శకాలను పరిశీలించి, అర్హతలకు అనుగుణంగా ప్రతిపాదనలు రూపొందించాలని, కేంద్ర శాఖలతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ నిధుల సాధనకు కృషి చేయాలని అధికారులకు దిశ నిర్దేశం చేశారు. కేంద్ర ప్రాయోజిత పథకాల (సీఎస్ఎస్) ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రానికి

తరువాయి 2వ పేజీలో...



పేదల వైద్యం, విద్యకు

రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట

- రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

కూసుమంచి లో నిర్మాణంలో వున్న 100 పడకల ఆసుపత్రి పనులను తనిఖీ చేసిన మంత్రి

పాలేరు నవంబర్ 03(ప్రజాకలం న్యూస్) నంక్షేమ కార్యక్రమాలతో పాటు వైద్య, విద్య రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్ , సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మంత్రి, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి, పాలేరు నియోజకవర్గం కూసుమంచి మండలం గంగబండ తాండా వద్ద రూ. 45.50 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.

తరువాయి 2వ పేజీలో...



సర్ పేరుతో శాశ్వతంగా అధికారంలో ఉండాలని

బీజేపీ కుట్ర

అమిత్ షా వ్యాఖ్యలకు ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్

తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలి.. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలి

తెలంగాణ అభివృద్ధికి ఆర్ఆర్ఆర్, మెట్రో ఫేజ్-2 కీలకం

హైదరాబాద్, నవంబరు 3 (ప్రజాకలం) : బీజేపీ ఎప్పటికీ అధికారంలో ఉండాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతున్నారని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. SIR ప్రక్రియను అడ్డం పెట్టుకొని శాశ్వతంగా అధికారంలో కొనసాగాలని బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలకు ఘాటుగా కౌంటర్ ఇచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్ ఓట్ల బదిలీ కారణంగానే బీజేపీ ఎనిమిది ఎంపీ స్థానాలను గెలుచుకుందని చామల వ్యాఖ్యానించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌కు వచ్చిన అమిత్ షా మణిపూర్‌కు వెళ్లి ఉంటే బాగుండేదని, అక్కడ అల్లర్లతో పరిస్థితులు దారుణంగా ఉన్నాయని విమర్శించారు. దేశంలో తొలగించిన 13.30 కోట్ల ఓట్లలో మూడు కోట్ల మంది అక్రమ వలసదారుల ఓట్లు ఉన్నాయని అమిత్ షా చెబుతున్నారని, అదే నిజమైతే గత 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న మీరు హోంమంత్రిగా ఏం చేశారని ప్రశ్నించారు. బంగ్లాదేశ్, పాకిస్థాన్ నుంచి దేశంలోకి ఎంతమంది అక్రమంగా ప్రవేశించారు? దేశ అంతర్గత భద్రత పరిస్థితి ఏమిటి? అని నిలదీశారు. గుజరాత్ నుంచి ఢిల్లీకి వచ్చిన మోదీ, అమిత్ షాల వల్ల 2014 నుంచి దేశానికి దరిద్రం పట్టిందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే హోంమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు.

తరువాయి 2వ పేజీలో...





సమగ్ర సేద్యంతో రైతులకు

నిత్యాదాయం సాధ్యమే

మాజీ సైనిక మేజర్, ప్రకృతి వ్యవసాయ రైతు నవీన్ కుమార్ విజయగాథ స్ఫూర్తిదాయకం

ఎల్‌నినో పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని యాసంగిలో చిరుధాన్యాలు, పశుగ్రాస పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలి

మురుసు తుఫాను నేపథ్యంలో పంట కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలి: మంత్రి తుమ్మల

హైదరాబాద్, నవంబర్ 3: రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యంతో పాటు పాడి పరిశ్రమ, చేపల పెంపకం, కోళ్ల పెంపకం వంటి వ్యవసాయ అనుబంధ రంగాలను

2లో...


వచ్చే బోనాల నాటికి

ఇందిరమ్మ టవర్స్ పూర్తి

ఇందిరమ్మ ఇండ్లకు మరిన్ని భూములను గుర్తిస్తున్నాం

హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

ఈ-లాటరీ ద్వారా నాలుగు నియోజకవర్గాల్లో 1920 ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక



హైదరాబాద్, నవంబరు 3 (ప్రజాకలం) : హైదరాబాద్ లో సొంతంగా ఇండ్లు నిర్మించుకోడానికి భూములు కలిగి ఉండి అర్హులైన వారికి కూడా త్వరలోనే ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని జిల్లా ఇన్ ఛార్జి మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు ప్రకటించారు. పేదల సొంత ఇంటికలను నిజం చేయడానికి ప్రభుత్వం ప్రతి నియోజకవర్గానికి 5500 ఇండ్లను మంజూరు చేసిందని, అయితే హైదరాబాద్ వంటి మహానగరంలో స్థలాల లభ్యత తక్కువగా ఉన్నందున, ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు వందల కోట్ల రూపాయల విలువ చేసే భూములను పేదల నివాసాల కోసం వినియోగిస్తూ ఇందిరమ్మ

తరువాయి 2వ పేజీలో...

కేంద్ర పథకాల నిధులను సమర్థవంతంగా

వినియోగించుకోవాలి

మొదటి పేజీ తరువాయి...

గరిష్ఠ స్థాయిలో నిధులు రాబట్టుకోవాల్సిన అవసరాన్ని ఆయన ఈ సందర్భంగా నొక్కిచెప్పారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల నిధుల వినియోగం, పురోగతిని సమీక్షించిన ఉప ముఖ్యమంత్రి.. కేంద్రం కేటాయించిన నిధులను సమర్థవంతంగా ఖర్చు చేయడంతో పాటు, వాటి ద్వారా ప్రజలకు అందాల్సిన ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా పర్యవేక్షించాలని సూచించారు. ఈ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం కూడా 40 శాతం నిధులను సమకూరుస్తున్నందున, నిధుల ఖర్చుపైనే కాకుండా వాటి ద్వారా సాధిస్తున్న ఫలితాలు, ప్రజలకు కలుగుతున్న ప్రయోజనాలపైనా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రాష్ట్రానికి, ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూర్చే పథకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం కోసం న్యూఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో పనిచేస్తున్న లైజన్ అధికారుల సేవలను అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. కేంద్రం నుంచి నిధుల విడుదల సాధించడంతో పాటు, పెండింగ్ అంశాల పరిష్కారానికి వారితో నిరంతరం సమన్వయం చేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి వివిధ కేంద్ర మంత్రులకు రాసిన లేఖల్లో ప్రస్తావించిన అంశాలపై కూడా సకాలంలో తదుపరి చర్యలు తీసుకుంటూ, వాటి పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని ఆదేశించారు. మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు కేంద్రం అందించే ప్రత్యేక సహాయ పథకం (స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్) వంటి కేంద్ర కార్యక్రమాలను రాష్ట్రం గరిష్ఠంగా సద్వినియోగం చేసుకోవాలని భట్టి విక్రమార్క సూచించారు. పథకాల అమలుకు ఆటంకంగా ఉన్న పెండింగ్ సమస్యలు, సాంకేతికపరమైన ఇబ్బందులను త్వరితగతిన పరిష్కరించి ముందుకు తీసుకెళ్లాలన్నారు. ముఖ్యంగా నీటిపారుదల, పట్టణాభివృద్ధి, రవాణా, వ్యవసాయం, వైద్య ఆరోగ్య శాఖలు కేంద్ర పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. తద్వారా ఆయా పథకాల కొనసాగింపునకు, అదనపు నిధుల సాధనకు మార్గం సుగమం అవుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులను సకాలంలో విడుదల చేస్తున్నామని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను కూడా పరిష్కరించామని చెప్పారు. అన్ని బిల్లులను క్రమశిక్షణతో క్లియర్ చేస్తున్నామని వివరించారు. వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రాయోజిత పథకాల ప్రస్తుత పరిస్థితి, పురోగతి, నిధుల వినియోగంపై ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళికా శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ ఉప ముఖ్యమంత్రికి వివరించారు.

సమగ్ర సేద్యంతో రైతులకు నిత్యాదాయం సాధ్యమే

మొదటి పేజీ తరువాయి...

నమీకృతం చేసుకొని సాగు చేపట్టాలని, తద్వారా ప్రతిరోజూ ఆదాయం పొందేలా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. వాతావరణ మార్పులు, ఎల్‌నినో వంటి ప్రతికూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికతో సాగు చేపట్టడం ద్వారా రైతులు నష్టాలను అధిగమించవచ్చని అన్నారు. మంగళవారం నిర్వహించిన రైతు నేస్తం 113వ ఎపిసోడ్‌లో నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం వడ్డేపల్లికి చెందిన మాజీ సైనిక మేజర్, ప్రకృతి వ్యవసాయ రైతు శ్రీ సి.హెచ్. నవీన్ కుమార్ తన సమీకృత వ్యవసాయ విజయగాథను రైతులతో పంచుకున్నారు. భారత సైన్యంలో మేజర్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం తన కుటుంబ సభ్యులతో కలిసి 15 ఎకరాల్లో సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్నారు. వరి, కూరగాయల సాగుతో పాటు పాడి పశువులు, నాటు కోళ్ల పెంపకం, చేపల పెంపకం, మునగ, నేపియర్ గడ్డి, బంతిపూల సాగు చేపడుతున్నారు. వర్మీ కంపోస్టు, వర్మీవాష్, ప్రకృతి వ్యవసాయ కషాయాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. తన వ్యవసాయ క్షేత్రంలో బయో రిసోర్స్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేసి ఇతర రైతులకు సేంద్రియ ఎరువులు, జీవ ఉత్పత్తుల తయారీకి అవసరమైన సామగ్రిని అందిస్తున్నామని ఆయన వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల, నవీన్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. సైన్యంలో దేశానికి సేవలందించిన అనంతరం వ్యవసాయ రంగంలోనూ ఆదర్శంగా నిలుస్తున్న ఆయన ప్రయాణం అభినందనీయమని పేర్కొన్నారు. ఇలాంటి సమీకృత వ్యవసాయ విధానాలను ఇతర రైతులు కూడా అనుసరించాలని, తమ భూమి, నీటి లభ్యత, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా వంటలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. డ్రిప్, స్ప్రింక్లర్ల వంటి సూక్ష్మ సేద్య పద్ధతులను వినియోగించుకొని ప్రతి నీటి బొట్టును సమర్థంగా ఉపయోగించుకోవాలని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న యాసంగి సీజన్‌లో వర్షపాతం, నీటి లభ్యతలో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న వంటల విషయంలో పరిస్థితులను బట్టి నిర్ణయాలు తీసుకోవాలని, తక్కువ నీటితో సాగు చేసుకునే చిరుధాన్యాలు, వాణిజ్య పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రైతులకు ముందస్తు అవగాహన కల్పించడంతో పాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో అవసరమైన సలహాలు అందించాలని సూచించారు. మురసు తుఫాను ప్రభావం నేపథ్యంలో రైతులు పంటల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి కోరారు. తుఫాను ప్రభావంతో పంటలకు నష్టం వాటిల్లకుండా పంట కోతలను తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని, రైతులను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు నేస్తం కార్యక్రమంలో వాతావరణ, భూగర్భ జల, నీటిపారుదల శాఖల అధికారులు ఎల్‌నినో ప్రభావం, వర్షపాత పరిస్థితులు, భూగర్భ జలమట్టాలు, సాగునీటి ప్రాజెక్టులలో నీటి లభ్యతపై వివరించారు. అలాగే, వ్యవసాయ పరిశోధనా సంస్థలు, పశుగ్రాస పరిశోధనా కేంద్రం, ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు యాసంగిలో తక్కువ నీటితో సాగు చేసుకునే చిరుధాన్యాలు, పశుగ్రాస పంటల సాగు, మామిడి తోటల్లో పూత, పిందె దశల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రైతుల ఆరోగ్యం, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పేర్కొన్నారు. రసాయన పురుగుమందులను అవసరమైన మేరకు, శాస్త్రవేత్తలు సూచించిన మోతాదులోనే వినియోగించాలని, పిచికారీ సమయంలో తప్పనిసరిగా రక్షణ పరికరాలు ధరించాలని సూచించారు. పురుగుమందుల వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వ్యవసాయ శాఖ, పురుగుమందుల తయారీదారుల సంఘం రూపొందించిన 'ఇది చేయి-ఇది చేయవద్దు' భద్రతా చార్ట్‌ను రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా రైతు వేదికల్లో రైతులకు రక్షణ కిట్లను పంపిణీ చేశారు. అలాగే, యూపీఐ డిజిటల్ చెల్లింపుల వినియోగంపై ఎన్‌పీసీఐ ప్రతినిధులు రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మంత్రి మహబూబాబాద్ జిల్లాకు చెందిన రైతులతో ముఖాముఖి నిర్వహించి, రైతునేస్తం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో అందుతున్న ప్రయోజనాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాన్ని మరింత మెరుగుపరిచేందుకు రైతులు తమ సూచనలు అందించాలని కోరారు. అనంతరం వ్యవసాయ శాఖ అధికారులు, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్, వ్యవసాయ శాఖ కార్యదర్శి కే. సురేంద్రమోహన్, వ్యవసాయ శాఖ సంచాలకులు బి. గోపి, ఆర్టీసి ఎండి నాగిరెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

మెట్‌పల్లి మండలంలో ఇసుక దందాకు వీడీసీల అండ?

మొదటి పేజీ తరువాయి...

ఇదే రీతిలో మండలంలోని ఆత్మకూరు గ్రామ పంచాయతీ పరిధిలో సైతం అక్టోబర్ 29న ఇసుక వేలం పాట నిర్వహించినట్లు విశ్వసనీయ సమాచారం. ప్రభుత్వ అనుమతులు లేకుండానే గ్రామాల్లో లక్షల రూపాయల చేతులు మారి వేలం పాటలు ఎలా నిర్వహిస్తారనే ప్రశ్నలు స్థానికంగా తలెత్తుతున్నాయి.

అనుమతులపై వీడని అనుమానాలు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం వాగులు, ఒర్రెల నుంచి ఇసుక తరలించాలంటే గనుల శాఖ, రెవెన్యూ శాఖ, భూగర్భ జల వనరుల శాఖల నుంచి పర్యావరణ అనుమతులు (WALTA చట్టం ప్రకారం) తప్పనిసరి. కానీ రామలచ్చక్కపేట, ఆత్మకూరు గ్రామాల్లో జరిగిన వేలం ప్రక్రియకు మైనింగ్, రెవెన్యూ అధికారుల నుంచి ఏవైనా ముందస్తు అనుమతులు ఉన్నాయా? లేక నిబంధనలను తుంగలో తొక్కి వీడీసీలు సొంతంగానే ఈ పాటలు నిర్వహించాయా? అన్నది పెద్ద చర్చనీయాంశంగా మారింది. గ్రామ అభివృద్ధి పేరిట ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా అమ్ముకునే అధికారం ఎవరిచ్చారంటూ స్థానికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ శూన్యం

మండల కేంద్రానికి కూతవేటు దూరంలో లక్షల రూపాయల ఇసుక వేలం పాటలు సాగుతున్నా.. సంబంధిత రెవెన్యూ, మైనింగ్, పోలీసు శాఖల అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో గ్రామ పాలనాధికారులు, రెవెన్యూ సిబ్బందికి ఈ నమాచారం తెలిసినప్పటికీ, ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయకుండా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారా? లేక స్థానిక ఒత్తిళ్లకు తలొగ్గి మౌనం వహిస్తున్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

జిల్లా కలెక్టర్‌కు నేరుగా ప్రశ్నలు..జిల్లాలో ప్రభుత్వ అనుమతులతోనే ఇసుక తవ్వకాలు జరగాలన్న నిబంధన ఉన్నప్పుడు, గ్రామస్థాయిలో వేలం పాటలు నిర్వహిం చే పరిస్థితి ఎలా ఏర్పడింది? ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించి నిజానిజాలు నిగ్గుతేల్చి, అక్రమాలకు పాల్పడిన వారితో పాటు విధుల్లో నిర్లక్ష్యం వహించిన అధికారులపైనా చర్యలు తీసుకుంటారా? లేక ఈ ఇసుక వేలం వ్యవహారం కూడా విచారణలకే పరిమితమవుతుందా?

సర్ పేరుతో శాశ్వతంగా అధికారంలో ఉండాలని బీజేపీ కుట్ర

మొదటి పేజీ తరువాయి...

కేరళ, తమిళనాడు, హర్యానా రాష్ట్రాల్లో బీజేపీకి ప్రజాదరణ లేదని అన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ పేరుతో గంగా, యమునా, సబర్మతి నదుల పరిసర ప్రాంతాలనే అభివృద్ధి చేస్తారా? మిగతా రాష్ట్రాలను పట్టించుకోరా? అని ప్రశ్నించారు. డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉంటేనే నిధులు ఇస్తామనే ఆలోచనను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని హితవుపలికారు. జంతర్ మంతర్ వద్ద లక్షలాది మంది ప్రజలు ఆందోళనకు దిగిన తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి రాలేదని విమర్శించారు. ఈ నెలలో జరగనున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాహుల్ గాంధీ లేవనెత్తిన మూడు ప్రధాన డిమాండ్లను బీజేపీ నెరవేర్చాలి:

1. సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలి.
2. జ్ఞానేశ్ కుమార్‌పై విచారణ జరిపించాలి.
3. తొలగించిన ఓట్లను సరిచేసి తిరిగి ఓటర్ల జాబితాలో చేర్చాలి.

అమిత్ షా మున్నాభాయ్ ఎంబీబీఎస్ తరహాలో కాకుండా వాస్తవాలను ఆధారంగా చేసుకొని మాట్లాడాలని చామల సూచించారు. తెలంగాణ అభివృద్ధి, హైదరాబాద్ విస్తరణకు సంబంధించి కూడా ఆయన పలు అంశాలను ప్రస్తావించారు. రాష్ట్రంలో 50 శాతం పట్టణీకరణ లక్ష్యాన్ని సాధించాలంటే రీజినల్ రింగ్ రోడ్ (RRR) నిర్మాణం అత్యంత కీలకమని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ప్రజలు తమ పనులు ముగించుకొని సకాలంలో ఇళ్లకు చేరుకోవాలంటే మెట్రో రైలు ఫేజ్-2 పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు.

పేదల వైద్యం, విద్యకు రాష్ట్ర ప్రభుత్వ పెద్దపీట

మొదటి పేజీ తరువాయి...

నిర్మాణ వనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఒకటో బ్లాక్ స్లాబ్ సెంట్రింగ్, స్టీల్ ఫ్యాబ్రికేషన్ పనులు జరుపుతున్నట్లు, రెండో బ్లాక్ స్లాబ్ వేసినట్లు అధికారులు తెలిపారు. రెండో బ్లాక్ కాలం కాంక్రీట్ పనులు జరుగుతున్నట్లు మంత్రికి వివరించారు. నాణ్యతతో, నిర్ణీత గడువులోగా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేదవాళ్ల పిల్లలకు కూడా ఉన్నతమైన విద్యను అందించడంతో పాటు, పేదవాడికి రోగమొస్తే నయం చేసుకునే ఆర్థిక స్థోమత లేని పరిస్థితుల్లో రోడ్డున పడకుండా ఉండేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వైద్య రంగానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లో అవసరమైన ప్రతిచోటా 100 పడకల ఆసుపత్రులతో పాటు మౌళిక వసతులను ఏర్పాటు చేస్తూ, ఆసుపత్రుల రిక్వైర్మెంట్ బట్టి డాక్టర్లను కూడా కేటాయిస్తున్నామని తెలిపారు.

గతంలో పేదవాడికి జబ్బు చేస్తే "అయ్యో.. ఇంత పెద్ద జబ్బు చేసింది, వైద్యం చేయించుకోవడానికి నా దగ్గర డబ్బు ఏముంది, నాకు చావే గతి" అనే రోజులు ఉండేవని, కానీ ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత వారికి పూర్తి భద్రత, భరోసా కల్పిస్తున్నామని మంత్రి అన్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో వైద్యం తీసుకునే వారికి కూడా సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ధనికులకు ఏ రకమైన వసతులు అందుబాటులో ఉన్నాయో, అదే విధంగా పేదవాళ్లకు కూడా వైద్య, విద్య పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని అన్నారు. భవిష్యత్తులో రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాల్లోని నియోజకవర్గాల్లో సైతం వైద్య రంగానికి కావలసిన పూర్తి మౌళిక వసతులను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు.

మంత్రి పర్యటన సందర్భంగా డీసీహెచ్ఎస్ డా. రాజశేఖర్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, వైద్య శాఖ ఈఈ టీ. ఉమామహేశ్వర రావు, కూసుమంచి తహసీల్దార్ సైదులు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

ఏదులాపురం మునిసిపాలిటీ 14, 15, 16 వార్డులలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన మంత్రి.



పాలేరు నవంబర్ 03(ప్రజా కలం న్యూస్)

రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైన నాటి నుండి పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా పాలన సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. మంగళవారం ఏదులాపురం మునిసిపాలిటీ 14,15,16 వార్డులు తెల్దార్ పల్లి లో రూ. 312.90 లక్షలతో చేపట్టనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, భారీ వర్షంలోనూ ప్రజలు చూపిన ఆదరాభిమానాలు ఈ ప్రభుత్వంపై వారికున్న ప్రేమను చాటుతున్నాయన్నారు. తెల్లవారుపల్లి లో మూడు డివిజన్ల పరిధిలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల కోసం పనులకు శంకుస్థాపనలు చేసుకున్నామని తెలిపారు. గత 33 నెలల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కేవలం తెల్లవారుపల్లి ప్రాంత పరిధిలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ. 16.86 కోట్లు వెచ్చించి శంకుస్థాపనలు, పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అలాగే, తెల్దారుపల్లి లో మొత్తం 105 ఇందిరమ్మ ఇళ్లను రూ. 5.25 కోట్లతో మంజూరు చేయడం జరిగిందని, పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని తెలిపారు. ఇందిరమ్మ రాజ్యం ద్వారా పేదవాడి గుమ్మానికి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని అన్నారు. పేదింటి ఆడబిడ్డలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీతో పాటు ఎకరానికి రూ. 12,000 రైతు భరోసా ఆర్థిక సహాయం, తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ, ఆసరా పింఛన్లు, నిరుపేదలకు ఇల్లు నిర్మించుకోవడానికి ఇందిరమ్మ ఇళ్ల క్రింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తున్నామన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా గడచిన 33 నెలల్లో రూ. 73 వేల కోట్లు సున్నా వడ్డీకే మహిళలకు అందించామన్నారు. నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన చేస్తున్నామన్నారు.

భూముల సమగ్ర సర్వే, అర్హులైన రైతులందరికీ 'భూధార్' కార్డుల జారీ

రాష్ట్రంలో సుమారు 125 సంవత్సరాల క్రితం భూముల సర్వే జరిగిందని, ఈనాడు రాష్ట్రంలో ఉన్న ప్రతి అంగుళాన్ని సర్వే చేసి భూములున్న ఆసాములకు పూర్తి భరోసా కల్పించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి అన్నారు. పాలేరు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ఈ సర్వేను వెంటనే చేపట్టాలని ఇప్పటికే కలెక్టర్ కు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. తెల్దారుపల్లి లో రాబోయే కొద్ది రోజుల్లోనే గ్రామమంతా సర్వే చేయించి, అర్హులైన వారందరికీ న్యాయబద్ధమైన భూములను కేటాయించనున్నామన్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారునికి క్యూఆర్ కోడ్, మ్యాప్‌తో సహా, ప్రతి మనిషికి ఆధార్ ఏ విధంగా అయితే ఉంటుందో అదేవిధంగా ప్రతి భూమికి భూధార్ ను మ్యాప్‌తో సహా అందిస్తామని మంత్రి తెలిపారు. తెల్దారుపల్లి ప్రాంత ప్రజల కొరకు నాగార్జున సాగర్ కాల్వపై రూ. 5 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి కూడా అనుమతులు మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రజా ప్రభుత్వం పేదల పక్షపాతి అని మంత్రి అన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, గడిచిన ఒక నెల, నెలన్నర రోజుల్లోనే ఎదులాపురం మున్సిపాలిటీ, ఖమ్మం రూరల్‌లో దాదాపు రూ. 35 నుండి 40 కోట్ల వరకు అభివృద్ధి పనులను ప్రారంభించడం జరిగిందని తెలిపారు. యంత్రాంగం తరపున ప్రతి ఒక్క పనిని చాలా త్వరగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ బాబు, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మునిసిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

వచ్చే బోనాల నాటికి ఇందిరమ్మ టవర్స్ పూర్తి

మొదటి పేజీ తరువాయి...

ఇండ్లు టవర్స్ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు.

గోషామహల్, ముషీరాబాద్, ఎల్.బి.నగర్, చంద్రాయణ గుట్ట అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ కేటాయింపు లాటరీని మంగళవారం నాడు శాసనభ్యులు శ్రీ రాజాసింగ్ తో కలిసి ఆయన ప్రారంభించారు. పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటూ ఈ-లాటరీ విధానంలో ఈ నియోజకవర్గాల్లో నిర్మించనున్న 1920 ఇండ్లకు లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ రెడ్డి గారు మాట్లాడుతూ ఈ రోజు లాటరీ తీసిన ప్రాంతాల్లో ఇండ్లనిర్మాణ పనులకు త్వరలోనే భూమి పూజ నిర్వహిస్తామన్నారు. పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేసే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమానికి ఆర్టీసీ భూములను కూడా ఇచ్చామని అలాగే పోలీసు శాఖ కు చెందిన భూములను సైతం వినియోగిస్తున్నామన్నారు. మొత్తం లక్ష ఇండ్ల నిర్మాణాలను చేవట్టేందుకు అనువైన భూములన్నిటినీ కూడా సేకరిస్తున్నామని ఇది ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. వచ్చే బోనాల నాటికల్లా గృహ ప్రవేశాలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

గోషామహల్ శాసనసభ్యులు శ్రీ రాజాసింగ్ గారు మాట్లాడుతూ ఏ నియోజకవర్గంలో నివసిస్తున్న పేదలకు ఆనియోజకవర్గంలోనే సొంత ఇంటి వసతి కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పం చాలా మంచిదన్నారు. నియోజకవర్గంలో ఇంకా అనేక చోట్ల గృహనిర్మాణాలకు అనువైన భూములను గుర్తిస్తున్నామని ఉన్నాయని వాటిలో కూడా ఇందిరమ్మ ఇండ్లు నిర్మించాలని విజ్ఞప్తి చేశారు.


హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ శ్రీ విపి గౌతం మాట్లాడుతూ అర్హులైన ప్రతిఒక్కరికి సొంత ఇంటి వసతిని కల్పించేంతవరకు ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ నిర్మాణాలను నిరంతరం చేపడతామని అన్నారు. అవుటర్ రింగ్ రోడ్ లోవల ఉన్న మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో కూడా త్వరలోనే నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. ఈ ఇండ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులను కూడా భాగస్వాములను చేసి, వారి పర్యవేక్షణలో నిర్మాణపు పనులు పూర్తి కావాలన్న ఉద్దేశ్యంతోనే నామమాత్రంగా ఆరు లక్షల రూపాయల ధరను నిర్ధారించామన్నారు. బహిరంగ మార్కెట్ లో 40-50 లక్షల విలువ చేసే ఇంటిని నామమాత్రపు ధరకే అందించడమే కాకుండా, రిజిస్ట్రేషన్ కూడా ఉచితంగా చేయాలని నిర్ణయించామన్నారు. ఇండ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి పారదర్శకంగా, ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా ఈ-లాటరీ ద్వారా నిర్వహిస్తున్నామన్నారు. ఈ లాటరీ లో ఎంపికైన వారికి వెనువెంటనే ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం చేరే విధంగా చర్యలు తీసుకున్నామని వివరించారు.

నేడు (బుధవారం) మాప్ అప్ లాటరీ

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఇండ్ల కోసం పైలట్ ప్రాజెక్టు లో భాగంగా ఇప్పటికే లాటరీ ద్వారా ఇండ్ల కేటాయింపు పూర్తి అయిన 16 నియోజకవర్గాల్లో, క్షేత్ర స్థాయి పర్యటనల్లోనూ, ఇతర కారణాల్లోనూ రద్దు అయిన ఇండ్లను మాప్ అప్ లాటరీ ద్వారా లబ్ధిదారులకు నవంబర్ నాలుగో తేదీ (బుధవారం) నాడు చేపట్టనున్నారు.

గతంలో 16 నియోజకవర్గాల్లో ఇండ్లను కేటాయించగా, వాటిలో 14 నియోజకవర్గాల్లో వివిధ కారణాలతో సుమారు 1700 ఇండ్లు ప్రస్తుతం అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారి జాబితాలోని పేర్ల తోటే ఈ-లాటరీ నిర్వహిస్తున్నారు. ఈ-లాటరీ ప్రక్రియను https://youtube.com/@tghd.official యూట్యూబ్ ఛానల్ లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా చూడవచ్చు.

కలం కౌంటర్



తెలంగాణ రక్షణ సేనలో నియామకాలు

కోరుట్ల నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రటరీగా సుఖేందర్ గౌడ్..

మహిళా విభాగం అధికార ప్రతినిధిగా మీనా

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 03 (ప్రజాకలం):- తెలంగాణ రక్షణ సేన పార్టీలో కోరుట్ల నియోజకవర్గ స్థాయిలో నూతన నియామకాలు చేపట్టారు. కోరుట్ల





నియోజకవర్గ అసెంబ్లీ జనరల్ సెక్రటరీగా చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, మహిళా విభాగం అధికార ప్రతినిధిగా చెట్లవల్లి మీనాను పార్టీ నియమించింది.ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వారు మాట్లాడుతూ తమపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవితక్కకు, కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రఘుకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తామని వారు పేర్కొన్నారు.

బియ్యం దుకాణాల్లో మెరుపు దాడులు

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు - అక్రమ నిల్వలపై నిఘా

బియ్యం ధరలు, తూకాల్లో తేడాలుంటే కేసులు నమోదు



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 3(ప్రజా కలం):

జిల్లాలో బియ్యం కృత్రిమ కొరత సృష్టించకుండా, అధిక ధరలకు విక్రయించకుండా నిరోధించేందుకు పౌరసరఫరాల శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మంగళవారం జగిత్యాల పట్టణంలోని పలు హోల్‌సేల్, రిటైల్ బియ్యం దుకాణాలు, గోదాముల్లో విస్తృతంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దుకాణాల్లోని బియ్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ధరల పట్టికలు, తూకాలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రతి దుకాణం, మిల్లు ఎదుట రోజువారీ నిల్వలు, ప్రభుత్వం నిర్ణయించిన విక్రయ ధరలు వినియోగదారులకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ అనుమతి పత్రాలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.జిల్లా పౌరసరఫరాల అధికారి ఆదేశాల మేరకు డిప్యూటీ తహశీల్దార్లు, ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు దుకాణాల్లోని బియ్యం నిల్వలను క్షుణ్ణంగా పరిశీలించారు. ధరల పట్టికలు, తూకాలు, స్టాక్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. ప్రతి దుకాణం, మిల్లు ఎదుట రోజువారీ నిల్వలు, ప్రభుత్వం నిర్ణయించిన విక్రయ ధరలు వినియోగదారులకు కనిపించేలా బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యాపారులు రోజువారీ కొనుగోళ్లు, అమ్మకాల వివరాలను స్టాక్ రిజిస్టర్లలో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. 26 కిలోల బస్తా పేరుతో 24 లేదా 25 కిలోలు విక్రయిస్తే మోసపూరిత కొలతల చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.జిల్లా వ్యాప్తంగా తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, అక్రమ నిల్వలు, ధరల మార్పులు, తూకాల్లో మోసాలకు పాల్పడితే నిత్యావసర వస్తువుల చట్టం ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల అధికారి హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు ప్రభుత్వ కో ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాల విద్యార్థిని ఇంధన్ పల్లి శివాన్విత ఎంపిక



బెల్లంపల్లి, అక్టోబర్3, (ప్రజాకలం) ప్రతినిధి. బెల్లంపల్లిలోని ప్రభుత్వ కో-ఎడ్యుకేషన్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని శివాన్విత రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య తెలిపారు. గజ్వేల్‌లో ఈ నెల 4,5,6 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడా పోటీలలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించేందుకు ఎంపిక కావడం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ ,అధ్యాపక బృందం హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆవునూరి అంజయ్య విద్యార్థినిని ప్రత్యేకంగా అభినందిస్తూ, రాష్ట్రస్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని, తద్వారా కళాశాలకు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉన్నత స్థాయికి ఎదగాలని,ఇలాంటి విజయాలు ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సీనియర్ అధ్యాపకులు పి.కృష్ణవేణి,అధ్యాపక బృందం విద్యార్థినిని అభినందించి, రాష్ట్రస్థాయి పోటీలలో విజయం సాధించాలని శుభాకాంక్షలు తెలిపారు...

సంరక్షణ కేంద్రాల్లో మెరుగైన వసతులు కల్పించాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) కేడర్ పాఠశాల,బాలల సంరక్షణ కేంద్రాలు,వృద్ధాశ్రమాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ అక్కడి వారి ఆరోగ్య పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కేడర్ పాఠశాలలు,బాలల సంరక్షణ కేంద్రాలు,వృద్ధాశ్రమాలు,సమీకృత బాలల సంరక్షణ పథకం అమలుపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న వాతావరణం, సీజనల్ వ్యాధుల దృష్ట్యా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.వృద్ధుల ఆరోగ్య పరిస్థితులకు తగిన పౌష్టికాహారం,నిరంతర వైద్య సేవలు అందిస్తూ గౌరవప్రదమైన జీవనం కల్పించాలన్నారు. బాలల కేంద్రాల్లోని చిన్నారుల భద్రత,విద్య,సమగ్ర అభివృద్ధిపై శ్రద్ధ వహించడంతో పాటు వారి వివరాలను పక్కాగా నమోదు చేయాలని ఆదేశించారు. ఐసీపీఎస్ ద్వారా సంరక్షణ అవసరమైన చిన్నారులను గుర్తించి ఆదుకోవాలని, అధికారులు తరచూ కేంద్రాలను తనిఖీ చేస్తూ లోటుపాట్లను సరిదిద్దాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో సుల్తానాబాద్ మున్సిపల్ కమిషనర్,చిల్డ్రన్ హోమ్ సూపరింటెండెంట్ రమేష్,సీడీపీఓలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నకిలీ కస్టమర్ కేర్, పెట్టుబడి మోసాలు, స్క్రీన్ షేరింగ్‌పై జాగ్రత్త

నవంబర్ నెలంతా జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 3 (ప్రజా కలం)

సైబర్ ఆర్థిక మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. డిజిటల్ లావాదేవీలు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.నవంబర్ నెల మొత్తం జగిత్యాల జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ నేరాల నివారణకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఎస్పీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు రోజురోజుకూ కొత్త పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో వస్తువులు, సేవల పేరుతో డబ్బులు వసూలు చేసి మోసగించడం, వ్యక్తిగత వివరాలను దొంగిలించి క్రెడిట్, డెబిట్ కార్డులను దుర్వినియోగం చేయడం, స్టాక్ మార్కెట్‌లో అధిక లాభాలు వస్తాయని నకిలీ పెట్టుబడి పథకాలతో మోసాలకు పాల్పడటం వంటి ఘటనల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. గూగుల్, సోషల్ మీడియాలో కనిపించే ప్రతి కస్టమర్ కేర్ నంబర్‌ను నమ్మవద్దని, అపరిచితుల సూచనలతో స్క్రీన్ షేరింగ్ యాప్‌లను ఇన్‌స్టాల్ చేయవద్దని హెచ్చరించారు. ఓటీపీ, యూపీఐ పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవరికీ వెల్లడించరాదని సూచించారు. అనుమానాస్పద లింకులను క్లిక్ చేయకుండా, ఆన్‌లైన్ చెల్లింపులకు ముందు నగదు స్వీకరించే వ్యక్తి లేదా సంస్థ వివరాలను ధృవీకరించుకోవాలని స్పష్టం చేశారు. సైబర్ ఆర్థిక మోసానికి గురైన వారు ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని లేదా ఎఽఽష.ఎఎవతీఎతీఅఎవ.స్ర్శీజ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సత్వరంగా ఫిర్యాదు చేస్తే మోసపోయిన నగదును నిలువరించే అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ వేణు, సైబర్ క్రైమ్ ఎస్ఐ కృష్ణ, ఫ్రెండ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

టీ.పీ.టీ.ఎఫ్ మల్లాపూర్ మండల నూతన కమిటీ ఎన్నిక..

మల్లాపూర్, నవంబర్ 3 (ప్రజాకలం ప్రతినిధి): మల్లాపూర్ మండలంలో సోమవారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీ.పీ.టీ.ఎఫ్.) మండల కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా బండారికంటి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా లావుడ్య రాజయ్య ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా నల్లపు రాజమల్లేష్ (రాజన్న), జి. సౌజన్య, కార్యదర్శులుగా బి. వెంకటరమణ, బి. పరమేశ్వర్, పి. శృతి ఎన్నికయ్యారు. జిల్లా కౌన్సిలర్లుగా చి.వి. సత్యప్రకాశ్, ఎ. రాజమల్లయ్య, ఎన్. సత్తయ్య ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు బండారికంటి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏ బిల్లులను చెల్లించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మల్లాపూర్ మండలంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.

పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణ శిక్షణ

- శిక్షకుల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం : డీఈవో శారద

పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థినులకు ఆత్మరక్షణ మెళకువలు నేర్పించేందుకు స్వీయ రక్షణ శిక్షకులను ఎంపిక చేయనున్నట్లు



జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో ఎంపిక చేసిన 48 ప్రభుత్వ పాఠశాలల్లో బాలికలకు ఈ శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఈ శిక్షణ ఇచ్చేందుకు అర్హత,ఆసక్తి గల అభ్యర్థులకు నవంబర్ 04 మధ్యాహ్నం 2 గంటలకు పెద్దవల్లిలోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.సీనియర్ అధికారుల సమక్షంలో ఈ ఎంపికలు పారదర్శకంగా జరుగుతాయని,అర్హులైన శిక్షకులు సంబంధిత ధ్రువపత్రాలతో నిర్ణీత సమయానికి కార్యాలయానికి హాజరుకావాలని డీఈవో శారద సూచించారు.

వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత... జువ్వాడి...

మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన జువ్వాడి కృష్ణారావు

నూతన భవనంలో వైద్య సేవలు, మౌలిక వసతులపై పరిశీలన



మెట్‌పల్లి టౌన్ ప్రతినిధి నవంబర్ 3 (ప్రజాకలం):- మెట్‌పల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం (కమ్యూనిటీ హెల్త్ సెంటర్) భవనాన్ని టీపీసీసీ రాష్ట్ర సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని వివిధ వార్డులు, అత్యవసర విభాగం, ల్యాబ్, మందుల నిల్వ గదులు, వైద్య పరికరాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని వెల్లడించారు.

ఏఈఈ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

- నవంబర్ 6, 7 తేదీల్లో పరీక్ష.. అధికారులకు కలెక్టర్ ఆదేశాలు



జగిత్యాల ప్రతినిధి నవంబర్ 3(ప్రజాకలం):

టీజీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్స్ (సివిల్) పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. నవంబర్ 6, 7 తేదీల్లో జగిత్యాల జిల్లాలోని జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, నాచుపల్లి, కొండగట్టు, కొడిమ్యాల మండలంలో పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కంప్యూటర్ ఆధారిత విధానంలో (సీబీటీ) నిర్వహించే ఈ పరీక్ష రెండు షిఫ్టుల్లో జరగనుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారు.పరీక్ష ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని, సామాజిక మాధ్యమాల్లో తప్పుడు సమాచారం వ్యాప్తి కాకుండా సైబర్ పోలీసుల ద్వారా నిఘా ఉంచాలని సూచించారు. నిరంతర విద్యుత్ సరఫరా, ప్రత్యామ్నాయ విద్యుత్ సదుపాయాలు, అత్యవసర వైద్య సేవలు, ప్రథమ చికిత్స అందుబాటులో ఉంచాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ చేపట్టడంతోపాటు అంతరాయం లేని ఇంటర్నెట్ సదుపాయం కల్పించాలని, సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అధికారులు పరీక్ష ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి లోపాలను ముందుగానే సరిచేయాలని ఆదేశించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌లో పేర్కొన్న నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, పరీక్ష ప్రారంభానికి గంట ముందుగానే కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. పరీక్ష నిర్వహణకు అభ్యర్థులు, సంబంధిత శాఖల అధికారులు సహకరించాలని కోరారు.

పిట్టల రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



గొల్లపల్లి నవంబర్ 03 ప్రజాకలం ప్రతినిధి గొల్లవల్లి మండలం చందోలి గ్రామానికి చెందిన పిట్టల రమేశ్ అనారోగ్యంతో మృతి చెందగా వారి మృతి పట్ల రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పిట్టల రమేశ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో చిరుద్యోగిగా పనిచేస్తున్నారు. గత నెల 25వ తేదీన తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ఆయనను జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో కరీంనగర్ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చందోలిలోని రమేశ్ నివాసానికి వెళ్లి ఆయన పార్థివదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, రమేశ్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు.అనంతరం చిల్వకోడూరు గ్రామానికి చెందిన జక్కుల లచ్చయ్య, కవిత దంపతుల కుమార్తె లాస్య అనారోగ్యంతో మృతి చెందగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ లాస్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.ఈ సందర్భంగాబాధిత కుటుంబానికి రూ. 10,000 ఆర్థిక సాయం అందజేశారు.అలాగే ప్రభుత్వం ద్వారా బాధిత కుటుంబానికి అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

సకాలంలో స్పందన.. రక్తదానంతో రోగికి పునర్జన్మ

పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

ఓ నిండు ప్రాణాన్ని కాపాడేందుకు అత్యవసర సమయంలో స్పందించి రక్తదానం చేసిన దాతను పలువురు అభినందించారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా చెందిన ఓ వ్యక్తి గుండె సంబంధిత శస్త్రచికిత్స నిమిత్తం కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చేరారు.చికిత్సలో భాగంగా అతనికి అత్యవసరంగా బి పాజిటివ్ రక్తం అవసరమైంది.ఈ విషయాన్ని విశ్రాంత పోలీస్ ఉద్యోగి దాసరి భూమయ్య పెద్దపల్లికి చెందిన సముద్రాల రాజ్ కుమార్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లగా,రాజ్ కుమార్ సామాజికవేత్త గాలిపెల్లి కుమార్,తుమ్మ రాజ్ కుమార్ లకు సమాచారాన్ని చేరవేశారు.విషయం తెలుసుకున్న ఎలబోతారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బుచ్చల కొమురయ్య వెంటనే స్పందించి ఆసుపత్రికి చేరుకుని రక్తదానం చేశారు.ఈ సందర్భంగా గాలిపెల్లి కుమార్,తుమ్మ రాజ్ కుమార్ మాట్లాడుతూ రక్తం దానం చేస్తే తిరిగి వస్తుంది కానీ,సకాలంలో రక్తం అందకపోతే పోయిన ప్రాణం తిరిగి రాదు.మనం చేసే రక్తదానం ఒక విలువైన ప్రాణాన్ని కాపాడుతుందని పేర్కొన్నారు.యువత మానవతా దృక్పథంతో రక్తదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.సకాలంలో స్పందించి రక్తదానం చేసిన బుచ్చల కొమురయ్యతో పాటు సమన్వయం చేసిన గాలిపెల్లి కుమార్,తుమ్మ రాజ్ కుమార్ లను విశ్రాంత పోలీస్ ఉద్యోగి దాసరి భూమయ్య ప్రత్యేకంగా అభినందించారు.



నిలిచి ఉన్న లారీని ఢీకొన్న బైకు యువకుడు మృతి

- మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్ఐ

ధర్మారం, నవంబర్ 03 : (ప్రజా కలం ప్రతినిధి) నిన్న రాత్రి అందాద 9:30 గంటల ప్రాంతం లో రాగంపేట గ్రామస్తుడు అయిన తమ్మన వేణి శ్రీనాథ్ వయస్సు (27) సంవత్సరాలు అను వ్యక్తి తన బ్యాంకు పని ముగించుకుని తన ఇంటికి వెళ్తుండగా ఎర్రగుంటపల్లి గ్రామ శివారులో ఒక లారీ నెంబర్ సిజి 04 పిబి 9215 అను లారీ యొక్క డ్రైవరు తన లారీని అజాగ్రత్తగా రోడ్డుపై ఎలాంటి సూచికలు లేకుండా నిలిపి ఉంచడం వల్ల శ్రీనాథ్ తను వెళ్తున్న బైక్ తో అట్టి అజాగ్రత్తగా రోడ్డుపైన పెట్ట బడిన లారీని వెనుక నుండి గుద్దుకోగా అతని నుదుటి భాగానికి, రెండు చేతులకి మరియు ఇతర శరీర భాగాలకు తీవ్ర రక్త గాయాలు అయినా వెంటనే చనిపోయినాడు, అని మృతుని యొక్క తండ్రి అయిన మల్లయ్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ అయినా వికీ కుమార్ బీహార్ రాష్ట్రం అను అతనిపై కేసు నమోదు చేసినట్లు ధర్మారం ఎస్సై ఎంబడి శ్రీకాంత్ తెలిపారు.



ప్రజా కలం
బుధవారం, నవంబర్ 4, 2026

చిన్నారులపై ఆగని అకృత్యాలు

అక్టోబర్ 31న అనంతపురం జిల్లా రాప్తాడు ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిపై విద్యుత్ రంపంతో జరిగిన దాడి సభ్యసమాజాన్ని కుదిపేసింది. ఆమెను రక్షించేందుకు ప్రయత్నించిన మరో విద్యార్థిని కూడా గాయపడింది. చదువుల మధ్య తరగతి గదిలోకి చొరబడి బాలికపై దాడి చేయడాన్ని ఎంత తీవ్రంగా ఖండించినా తక్కువే. విద్యాలయం పిల్లలకు భద్రతనిచ్చే ప్రదేశం. అక్కడే ప్రాణభయం ఎదురైతే తల్లిదండ్రులు ఎవరిని నమ్మాలి? దాడి వెనుక ఉద్దేశం ఏమిటన్నది దర్యాప్తులో తేలాలి; కానీ ఏ ఉద్దేశమూ ఈ క్రూరత్వాన్ని సమర్థించలేదు. తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థినులు కోలుకోవడం ఇప్పుడు అత్యంత ముఖ్యం. వారిని కేవలం వార్తల్లోని బాధితులుగా చూడకుండా, చికిత్స అనంతరం చదువును కొనసాగించగల వాతావరణం కల్పించాలి. నిందితుడి ఉద్దేశంపై ఊహాగానాలతో బాలిక వ్యక్తిత్వాన్ని ప్రశ్నించడం మరో రకమైన అన్యాయం. ఇది ఒక్క పాఠశాల సమస్యగా చూడరాదు. మహిళల నిర్ణయాలను తేలికగా తీసుకోవడం, వారి తిరస్కరణను అవమానంగా భావించడం, ఆధిపత్యాన్ని పురుషత్వంగా పొరబడటం వంటి ధోరణులు హింసకు అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తాయి. ప్రేమకు మూలం పరస్పర సమ్మతి; బలవంతానికి ప్రేమ అనే పేరు పెట్టడం దాని అర్థాన్నే అవమానించడం. కుటుంబాల్లో బాలురకు ఆడపిల్లల స్వేచ్ఛను గౌరవించడం, కోపాన్ని అదుపుచేసుకోవడం, తిరస్కరణను హుందాగా స్వీకరించడం నేర్పాలి. 'వద్దు' అనే మాటకు గౌరవం ఇవ్వడం మానవ సంబంధాలకు పునాది. వేధింపులను ప్రేమగా, దౌర్జన్యాన్ని ధైర్యంగా చూపే కథనాలపై కూడా సమాజం విమర్శనాత్మకంగా ఆలోచించాలి. స్త్రీని తన నిర్ణయాలు తీసుకునే స్వతంత్ర వ్యక్తిగా చూడలేని మనస్తత్వం మారకపోతే చట్టాలున్నా భయం తొలగదు. జాతీయ నేర గణాంకాల సంస్థ ప్రకారం 2024లో దేశవ్యాప్తంగా మహిళలపై 4,41,534 నేరాలు నమోదయ్యాయి. అంటే రోజుకు సగటున 1,210 కేసులు. వాటిలో భర్త లేదా బంధువుల క్రూరత్వానికి సంబంధించినవి 1,20,227; అత్యాచార కేసులు 29,536; బాలికలు బాధితులుగా ఉన్న పోక్సో కేసులు 67,809. అత్యాచార కేసుల్లో 96.8 శాతం సందర్భాల్లో నిందితులు బాధితులకు పరిచయస్థులే. 2023తో పోలిస్తే 2024లో నమోదైన మొత్తం కేసులు స్వల్పంగా తగ్గినా, ఈ సంఖ్యలు భద్రతపై నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వవు. ఫిర్యాదుగా నమోదు కాని బాధలు వీటికి అదనం. కేసుల సంఖ్యలో స్వల్ప తగ్గుదల కొంత ఊరటనిచ్చినా, నిజమైన పురోగతిని మహిళలు ఎంత నిర్భయంగా జీవిస్తున్నారన్న ప్రమాణంతోనే కొలవాలి. ప్రతి ఫిర్యాదు వెనుక ఒక మనిషి జీవితం, కుటుంబం, భవిష్యత్తు ఉన్నాయని మరచిపోకూడదు. నేరం జరిగిన తరువాత శిక్ష కోరడం అవసరం; నేరం జరగకుండా చూడటం మరింత అవసరం. పాఠశాలల్లో ప్రవేశ నియంత్రణ, వేధింపులపై సత్వర స్పందన, విద్యార్థులకు గోప్యంగా ఫిర్యాదు చేసే అవకాశం కల్పించాలి. బాధితులకు మెరుగైన వైద్యం, మానసిక సహాయం, న్యాయపరమైన రక్షణ అందించాలి. బాలికలపై ఆంక్షలు పెంచడం భద్రత కాదు; వారిపై హింసకు దారితీసే ప్రవర్తనను అడ్డుకోవడమే నిజమైన రక్షణ. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, స్థానిక అధికారులు సమన్వయంతో పనిచేస్తే వేధింపుల సంకేతాలను ముందుగానే గుర్తించవచ్చు. దర్యాప్తు వేగంగా, నిష్పాక్షికంగా సాగాలి; నేరం రుజువైతే చట్టప్రకారం కఠినశిక్ష పడాలి. బాధితురాలికే జాగ్రత్తలు చెప్పి బాధ్యత నుంచి తప్పించుకోవడం సమాజానికి తగదు. రాప్తాడు ఘటన మరో వార్తగా మిగిలిపోకూడదు. ఒక బాలిక భయపడకుండా పాఠశాలకు వెళ్లి సురక్షితంగా ఇంటికి చేరే హక్కును కాపాడలేని సమాజం తన అభివృద్ధిని ఎలా గొప్పగా చెప్పుకోగలదు? మహిళలను గౌరవించడం ఉపన్యాసాల్లో కాదు, ప్రతి ఇంటి సంస్కారంలోనూ ప్రతి సంస్థ ఆచరణలోనూ కనిపించాలి. మహిళల భద్రత దాతృత్వం కాదు; అది వారి హక్కు, మన నాగరికతకు అసలైన ప్రమాణం

- సి.హెచ్. ప్రతాప్

బండి సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన సురభి



మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 3 (ప్రజా కలం): ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి నివాసంలో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణను కూడా ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కౌన్సిలర్లు బొడ్ల రమేశ్, అరిగెల రాకేశ్, అరిసె మురళి, సురపాక రమేశ్, శ్రీకాంత్, సుంకేటి విజయ్, రణధీర్, రమేశ్, రాహుల్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మద్దతు ధర దక్కేలా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

-జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష -జిల్లాలో 311 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

-సన్నరకానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్



పెద్దపల్లి,నవంబర్ 03(ప్రజాకలం జిల్లాప్రతినిధి):


రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర దక్కేలా జిల్లాలో ప్రతిపాదించిన 311 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్ల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.రైతులు బహిరంగ మార్కెట్లో తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకునే పరిస్థితి రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని,సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందేలా పకడ్బందీగా కొనుగోళ్లు చేపట్టాలని ఆదేశించారు.ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 4.69 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం,26 వేల మెట్రిక్ టన్నుల దొడ్డురకం ధాన్యం దిగుబడి రావచ్చని వ్యవసాయ శాఖ అంచనా వేసిందని,కొనుగోలు కేంద్రాలకు సుమారు 2.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.నవంబర్ రెండో వారం నుంచి కొనుగోలు కేంద్రాలకు ధాన్యం రాక పెరగనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని,జిల్లాలో 1.62 లక్షల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాములు అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు శ్రీమాల,శ్రీనాథ్,శ్రీకాంత్,ప్రవీణ్ రెడ్డి,కాళిందిని తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి,ప్రొఫెసర్ ఆచార్య తిరుణగరి జ్యోత్స్న

ఆరోగ్య ఉద్యోగుల సమ్మెకు టీడీపీ సంపూర్ణ మద్దతు

పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జాతీయ ఆరోగ్య ప్రణాళిక ఉద్యోగులను వెంటనే శాశ్వత ప్రాతిపదికన నియమించి,వారి వేతనాలు పెంచాలని తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి,ప్రొఫెసర్ ఆచార్య తిరుణగరి జ్యోత్స్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెద్దపల్లి కలెక్టరేట్ ఎదుట న్యాయమైన డిమాండ్ల సాధనకై సమ్మె చేస్తున్న ఉద్యోగుల శిబిరాన్ని మంగళవారం టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సంజయ్ కుమార్,జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి లతో కలిసి ఆమె సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా జ్యోత్స్న మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు కేడర్‌తో సంబంధం లేకుండా 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని,విధి నిర్వహణలో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు రూ. 20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఇంట్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని స్పష్టం చేశారు.వైద్యారోగ్య



రంగంలో కీలక సేవలందిస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే టీడీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు తోట వెంకటేష్ పటేల్, ఏదుకొండలు,కోటగిరి పాపయ్య,పెరిక శ్రీనివాస్,పెరక సుధాకర్,కుక్క సుధాకర్,మహిళా నేతలు షరీఫా,అంజలి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు మేలు కోసమే మేడిగడ్డ నిర్వీర్యం

- సీఎం రేవంత్ రెడ్డి తీరుపై మాజీ ఎమ్మెల్యేల ధ్వజం



పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయిందంటూ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నదంతా పచ్చి అబద్ధమని,మొత్తం 85 పిల్లర్లతో బ్యారేజ్ నిటారుగా చెక్కుచెదరకుండా ఉందని మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లా బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్, బిగాల గణేష్,జీవన్ రెడ్డి,గంప గోవర్ధన్,హన్మంత్ షిండే,జాజాల సురేందర్,మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌లతో కలిసి ఆయన మేడిగడ్డ బ్యారేజ్,కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి గోదావరి ప్రవాహాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బ్యారేజీపైకి వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో కాసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది.అనంతరం బీఆర్ఎస్ నేతలు మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం మేడిగడ్డ వద్ద దాదాపు రోజుకు 2 టీఎంసీల నీరు వృథాగా దిగువకు పోతోందని, వెంటనే కన్నెపల్లి పంపులు ఆన్ చేసి నీటిని ఎత్తిపోస్తే ఎస్సారెస్పీ,నిజాంసాగర్,మిడ్ మానేరు వంటి రిజర్వాయర్లను నింపి ఎండిపోతున్న లక్షలాది ఎకరాల పంటలను కాపాడవచ్చని డిమాండ్ చేశారు.నీటిని ఎత్తిపోస్తే కేసీఆర్‌కు మంచి పేరు వస్తుందనే అక్కసుతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లను సముద్రం పాలు చేస్తోందని,చంద్రబాబు నాయుడికి మేలు చేసేందుకే సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రయోజనాలను పణంగా పెడుతున్నారని నేతలు తీవ్రంగా ధ్వజమెత్తారు.కాళేశ్వరంపై దుష్ప్రచారం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల కష్టాలు పట్టడం లేదని, సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా మేడిగడ్డను సందర్శించి వాస్తవాలు తెలుసుకోవాలని హితవు పలికారు.ఇప్పటికైనా ప్రభుత్వం మొండివైఖరి వీడి తక్షణమే మోటార్లు ఆన్ చేసి సాగునీరు విడుదల చేయకపోతే, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున రైతు పోరుబాట ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వారితో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు,ముఖ్య నాయకులు, కార్యకర్తలు,తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలి

ఎన్.హెచ్ తో పాటు అన్ని రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను విశ్లేషించాలి

గత మూడు నెలల ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణతో వచ్చే వారం నివేదిక సమర్పించాలి - రోడ్డు భద్రత పనులకు అవసరమైన నిధుల అంచనాలు సిద్ధం చేయాలి

మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగమే ప్రమాదాలకు ప్రధాన కారణాలు : జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సేవలందించేందుకు ఎన్‌హెచ్‌పఐ ఆధ్వర్యంలో అంబులెన్స్ ప్రారంభం

రోడ్డు భద్రత ప్రమాణాల పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించిన జిల్లా కలెక్టర్







జగిత్యాల ప్రతినిధి నవంబర్ 03(ప్రజా కలం): సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులతో పాటు ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు దారితీస్తున్న కారణాలను విశ్లేషించి వాటి నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా గత సమావేశం లో తీసుకున్న నిర్ణయాల అమలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం చేపట్టాల్సిన చర్యలు, జాతీయ రహదారులపై రోడ్డు భద్రత మెరుగుదల పనుల పురోగతిపై సమీక్షించారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 600 కిలోమీటర్ల మేర రహదారులు ఉన్నాయని, వీటి పై గత నెల రోజుల్లో ఎన్ని ప్రమాదాలు జరిగాయి, ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా ప్రమాదాలు చోటుచేసుకున్నాయి అనే వివరాలతో సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు, ఇతర రహదారులపై ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను విశ్లేషించాలన్నారు.ఇక పై జిల్లాలో ఎక్కడైనా రోడ్డు ప్రమాదం జరిగిన వెంటనే పోలీసు, జాతీయ రహదారుల సంస్థ, ఆర్,బి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయం తో ప్రమాద స్థలాన్ని క్షేత్రస్థాయిలో సందర్శించాలని సూచించారు. ప్రమాదం జరగడానికి గల అసలు కారణాలను గుర్తించి, భవిష్యత్తు లో అదే ప్రాంతంలో మరో ప్రమాదం జరగకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో స్పష్టమైన సూచనలతో నివేదిక రూపొందించాలని ఆదేశించారు.వచ్చే వారం, 10 రోజులలో మరోసారి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహిస్తామని, అప్పటి లోగా ఆర్డబి, పంచాయతీరాజ్ శాఖల అధికారులు గత మూడు నెలల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలపై సమగ్ర విశ్లేషణ నివేదిక సమర్పించాలని తెలిపారు. ప్రమాద ప్రాంతాల్లో చెట్ల కొమ్మలను తొలగించడం, అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు, రంబుల్ స్ట్రిప్స్, వేగ సూచిక బోర్డులు, హెచ్చరిక సూచికలు ఏర్పాటు చేయడం వంటి చర్యలను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.రోడ్డు భద్రత మెరుగుదల పనులకు అవసరమైన నిధుల అంచనాలను వెంటనే రూపొందించి, పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని సూచించారు. జిల్లాలో జరిగే ప్రమాదాల్లో దాదాపు సగం జాతీయ రహదారులపైనే చోటుచేసుకుంటున్న నేపథ్యంలో ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.రోడ్డు ప్రమాదాల నివారణలో నిర్లక్ష్యం వహించకుండా అన్ని శాఖలు బాధ్యతాయుతంగా పనిచేయాలని, జాతీయ రహదారులపై తక్షణ చర్యలు చేపట్టకపోతే ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి,బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకునేలా చూస్తామని కలెక్టర్ హెచ్చరించారు. జాతీయ రహదారుల పై నిర్వహణ, స్వల్పకాలిక మెరుగుదల పనులకు సంబంధించి టెండర్ ముగిసినందున త్వరలోనే నిర్వహణ పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ పనులను వేగవంతంగా చేపట్టి రహదారులపై ప్రయాణం సురక్షితంగా ఉండేలా చూడాలని కలెక్టర్ సూచించారు.ఈ పనుల్లో భాగంగా రహదారులపై రాత్రివేళల్లో కూడా స్పష్టంగా కనిపించేలా రిట్రో రిఫ్లెక్టివ్ హెచ్చరిక, తప్పనిసరి, సమాచార సూచిక బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. మలుపుల వద్ద చెవ్రాన్ మార్కర్లు, అడ్డంకులు, ప్రమాద సూచిక మార్కర్లు, రిఫ్లెక్టివ్ బ్యాండ్లతో కూడిన రోడ్ డెలినేటర్లు ఏర్పాటు చేయనున్నారు.అదేవిధంగా థర్మోప్లాస్టిక్ పెయింటింగ్ తో లేన్ మార్కింగ్‌లు, సెంటర్ లైన్లు, రోడ్డు అంచుల గుర్తులు, ట్రాన్స్‌వర్స్ మార్కింగ్‌లు వేయడంతో పాటు వాహనదారులకు రాత్రి వేళల్లో రహదారి స్పష్టంగా కనిపించేలా రిఫ్లెక్టివ్ రోడ్ స్టడ్స్ ఏర్పాటు చేయనున్నారు.

వేగ నియంత్రణకు ప్రత్యేక చర్యలు

ప్రమాదాలు జరిగే ప్రాంతాలు, బ్లాక్ స్పాట్లు, మలుపుల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. 5, 10, 15 మిల్లీమీటర్ల ప్రొఫైల్ తో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు, గుర్తించిన ప్రాంతాల్లో సోలార్ ఆధారిత ఎల్ఈడీ బ్లింకర్ల ఏర్పాటు చేవట్టనున్నట్లు వివరించారు.ప్రమాద ప్రాంతాల్లో, బ్లాక్ స్పాట్ల వద్ద రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయడంతో పాటు కొండగట్టు వద్ద ప్రమాదకర మలుపుల ప్రాంతాల్లో రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాహనదారులు ముందుగానే అప్రమత్తమయ్యేలా హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు, రవాణా, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్‌బెల్ట్ ధరించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జాతీయ రహదారుల వెంట ఆక్రమణలను తొలగించడం, అనధికార పార్కింగ్‌ను నియంత్రించడం, నిఘా, పెట్రోలింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని తెలిపారు. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, రద్దీ కూడళ్ల వద్ద ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు.

సుప్రీంకోర్టు మార్గదర్శకాల అమలులో భాగంగా చేపట్టిన పనులన్నింటినీ నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని, ప్రతి 15 రోజులకు ఒకసారి రవాణా శాఖ, పోలీసు శాఖ, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు సమావేశమై పురోగతిని సమీక్షించాలని కలెక్టర్ ఆదేశించారు.ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం కారణంగా ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల్లో ఎక్కువగా గాయపడుతున్నారని, తలకు గాయాలు కావడం వల్ల మరణాల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, అతివేగ నియంత్రణ చర్యలను మరింత విస్తృతంగా చేవడుతున్నట్లు తెలిపారు.ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను సమర్థవంతంగా గుర్తించి నియంత్రించేందుకు ఏఐ ఆధారిత కెమెరాల ఏర్పాటు అవసరమని తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఈ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాల రాకపోకలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు నిబంధనలను ఉల్లంఘించే వాహనాలను గుర్తించి ఈ-చలాన్లు జారీ చేసే అవకాశం ఉంటుందని వివరించారు.అదేవిధంగా ట్రాఫిక్ విధులు నిర్వహించే సిబ్బందికి భద్రతా జాకెట్లు, బారికేడ్లు, హైబ్రిడ్ కెమెరాలు, హెల్మెట్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. ఎత్తైన ప్రదేశాల్లో ఏర్పాటు చేసే కెమెరాల ద్వారా రహదారులపై పక్షి దృష్టితో (బర్డ్ ఐ వ్యూ) విస్తృత ప్రాంతాన్ని పర్యవేక్షించి ట్రాఫిక్ ఉల్లంఘనలను మెరుగ్గా గుర్తించవచ్చని తెలిపారు.అనంతరం జాతీయ రహదారులపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించేందుకు ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో అంబులెన్స్ సేవలను ప్రారంభించారు.

ప్రమాదం జరిగిన వెంటనే బాధితులను సమీప ఆసుపత్రులకు తరలించి ప్రాణాలను కాపాడేలా అత్యవసర స్పందన వ్యవస్థను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.జాతీయ రహదారులపై ఏవైనా సమస్యలు, అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ఎన్‌హెచ్‌ఏఐ టోల్ ఫ్రీ నంబర్ 1033కు సమాచారం అందించాలని అధికారులు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్. ప్రసునాంభా, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, రవాణా శాఖ, పోలీసు శాఖ, ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థిపై

ప్రత్యేక శ్రద్ధ ఉంచాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ నవంబర్ 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) ప్రభుత్వ బడుల్లో చదివే ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు నిరంతరం ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ముధోల్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన భవంతిని తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. దాని స్థానంలో నూతన అదనపు తరగతుల నిర్మాణానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పాఠశాలకు సంబంధించి విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐదవ తరగతి విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలన్నారు. వారి స్నేహితులెవరైనా బడికి రానట్లయితే, వారిని కూడా తీసుకొని రావాలన్నారు. వారితో లెక్కలు సులభంగా అర్థమయ్యేలా మెలకువలను నేర్పి, కొన్ని లెక్కలు చేయించారు. ఇంగ్లీష్ పదాలను వ్యతిరేక క్రమంలో చదివిపించారు. విద్యార్థుల ప్రతిభను కలెక్టర్ మెచ్చుకున్నారు. పలువురు విద్యార్థులకు పెన్నులను బహుమతులుగా ఇచ్చారు. వారిని అభినందించారు. ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల ప్రతిభపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇదే స్ఫూర్తిని కొనసాగించాలని పేర్కొన్నారు.ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ శ్రీలత, ఎంపిడివో లవకుమార్, డిఎల్పిఓ లక్ష్మణ్, సర్పంచ్ షబానా బేగం, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుద్ధ్యం,

వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 03:

మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మంగళవారం సందర్శించి, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.



ఈ సందర్భంగా ఆసుపత్రి ప్రాంగణంలోని పారిశుద్ధ్య నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, కిచెన్‌ను తనిఖీ చేశారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యత, పరిశుభ్రత, పోషక విలువలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు కల్పిస్తున్న వైద్య సదుపాయాలు, మౌలిక వసతుల గురించి ఆరా తీశారు. అనంతరం చిన్నపిల్లల ఎన్‌ఐసీయూ కేంద్రాన్ని సందర్శించి, నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవలు, అందుబాటులో ఉన్న వైద్య పరికరాలు, చికిత్సా సదుపాయాలను పరిశీలించారు.ఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని కూడా సందర్శించి, దివ్యాంగులకు చేపడుతున్న వైద్య పరీక్షలు, అంగవైకల్య నిర్ధారణ ప్రక్రియ, శిబిరంలో కల్పించిన సదుపాయాలను పరిశీలించారు. అర్హులైన దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య పరీక్షలు నిర్వహించి, ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం సేవలు అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రోగులకు నాణ్యమైన ఆహారంతో పాటు మెరుగైన వైద్య సేవలు అందేలా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.అదనపు కలెక్టర్ తో పాటు ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.రంగా అజ్మీరా తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు

ఉచిత యూనిఫామ్‌లు, విద్యా సామగ్రి పంపిణీ



పాలేరు నవంబర్ 03(ప్రజా కలం న్యూస్) కూసుమంచి మండల కేంద్రంలోని మంగళవారం ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులపై ఆర్థిక భారం తగ్గించి, నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ, ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేస్తోందని కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు, మండల విద్యాశాఖాధికారి రావెళ్ల వీరస్వామి తెలిపారు. ఈ సందర్భంగా కూసుమంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, షూస్, సాక్సులు, ఐడీ కార్డులు, బెల్టులు, యూనిఫామ్‌లను కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు, మండల విద్యాశాఖాధికారి (ఎంఈఓ) రావెళ్ల వీరస్వామి చేతుల మీదుగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎం ఈ ఓ రావెళ్ల వీరస్వామి మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ బి. వీరభద్రరావు మాట్లాడుతూ, విద్యార్థుల చదువుకు ఆర్థిక పరిస్థితులు అడ్డంకిగా మారకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఉచిత విద్యతో పాటు అవసరమైన విద్యా సామగ్రి, యూనిఫామ్‌లను అందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవంబర్ 6తో ముగియనున్న గడువు.. పొడిగించాలని డిమాండ్

హైదరాబాద్‌కే పరిమితమవుతున్న ఎమ్మెల్సీలు.. క్షేత్రస్థాయి సమస్యలపై నోరు విప్పే గొంతుక కావాలి

ముదిరాజ్ కోఆర్డినేషన్ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా నాయకుల విలేకరుల సమావేశం



మహబూబ్‌నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 13 :

మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గానికి సంబంధించి అర్హులైన ప్రతి పట్టభద్రుడు విధిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ఇది ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని ముదిరాజ్ కోఆర్డినేషన్ సంఘం మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు స్పష్టం చేశారు. స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రముఖ నాయకుడు మెట్టుకాడి శ్రీనివాసులు ముదిరాజ్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటరు నమోదు ప్రాధాన్యతను విస్తృతంగా వివరించారు.?సమర్థులైన ప్రతినిధులను ఎన్నుకుందాం

గతంలో ఎన్నికైన ఎమ్మెల్సీలు అత్యధికులు రాజధాని హైదరాబాద్‌కేపరిమితమవుతున్నారని, క్షేత్రస్థాయిలో పట్టభద్రులు, ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆశించిన స్థాయిలో స్పందించడం లేదని శ్రీనివాసులు ముదిరాజ్ ఆవేదన వ్యక్తం చేశారు. పట్టభద్రుల సమస్యలపై నిరంతరం అధ్యయనం చేస్తూ, నిత్యం ప్రజల మధ్య ఉంటూ శాసనమండలిలో బలమైన గొంతుక వినిపించే ప్రతినిధులు నేడు అత్యవసరమన్నారు. సామాజిక బాధ్యత, ప్రజాసేవ పట్ల నిబద్ధత ఉన్న వ్యక్తులను ఎన్నుకోవాలంటే ముందుగా అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావలసిందేనని పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఓటరు నమోదు గడువు నవంబర్ 6తో ముగియనుండగా, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా చాలామంది నమోదు చేసుకోలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ తక్షణమే స్పందించి నమోదు గడువును మరికొంత కాలంపొడిగించాలని విజ్ఞప్తి చేశారు. అణగారిన వర్గాల గొంతుక మండలిలో వినవడాలి?సమావేశంలో పాల్గొన్న సంఘం నాయకులు ఆది కృష్ణమోహన్ ముదిరాజ్, చి. రాజయ్య, పిట్టల మురళి, ఎం. జగన్, జంగం రవి, ఎం. రమేష్, హరిప్రసాద్, మెట్టుకాడి ప్రభాకర్ తదితరులు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సమస్యలు, ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు మండలిలో పోరాడే నాయకత్వం రావాలన్నారు. న్యాయవాదులు, వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయుల సమస్యలతో పాటు బిసి, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, సబ్బండ వర్గాల ప్రజల సమస్యలను చట్టసభల్లో లేవనెత్తాల్సిన అవసరం ఉందన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 171 ప్రకారం పట్టభద్రులకు శాసనమండలిలో దక్కిన ఈ ప్రత్యేక ప్రాతినిధ్య హక్కును ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా నవంబర్ 6 లోగా ఖీశీతీఎ-18 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవాలని, గ్రామీణ ప్రాంత పట్టభద్రులకు ఈ విషయమై అవగాహన కల్పించాలని ముదిరాజ్ కోఆర్డినేషన్ సంఘం పిలుపునిచ్చింది. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమం లో అది కృష్ణమోహన్ ఎష్ట్ర రాజయ్య మంత్రి శ్రీనివాస్ పిట్టల మురళి మెట్టు కాడి ప్రభాకర్ హరిప్రసాద్ జంగం రవి జనార్దన్ ఏం రమేష్ జగన్ ముదిరాజ్ సత్యనారాయణ రాజశేఖర్ బారు మూర్తి నరేష్ కిషోర్ బాలకిష్టయ్య కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శం

- విద్యుత్ శాఖల లైన్ ఇన్స్పెక్టర్ గడ్డికొప్పుల రాములు ఉద్యోగ విరమణ సభలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పాలేరు నవంబర్ 03(ప్రజా కలం న్యూస్)

ఉద్యోగుల నిస్వార్థ సేవలే సమాజానికి ఆదర్శమని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి, విద్యుత్ శాఖలో లైన్ ఇన్స్పెక్టర్ గా ఉద్యోగ విరమణ చేసిన గడ్డికొప్పుల రాములు ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాములు వారి కుటుంబ సభ్యులను మంత్రి శాలువాతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ విద్యుత్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు ప్రజలకు, రైతులకు విశేష సేవలందించి రాములు ఉద్యోగ విరమణ పొందారన్నారు. ఉద్యోగంలో చేరినప్పుడే విరమణ తేదీ ఖరారవుతుందని, అయితే, సర్వీసులో ఉన్నంత కాలం ప్రజలకు, రైతులకు మనం అందించిన సేవలే ఉద్యోగ విరమణ తర్వాత కూడా ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతాయని అన్నారు. రాములు విద్యుత్ శాఖలో పనిచేసిన కాలంలో అందించిన సేవలు, చేసిన మంచి పనుల వల్లే ఈరోజు వర్షం పడుతున్నప్పటికీ వందలాది మంది రైతులు, ప్రజలు ఆత్మీయంగా తరలివచ్చారన్నారు. ఉద్యోగి సేవా కాలం ముగిసిన తర్వాత కూడా ప్రజలు వారిని గుర్తుపెట్టుకోవడమే అసలైన విజయమని మంత్రి తెలిపారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులకైనా, ప్రభుత్వ ఉద్యోగులకైనా భగవంతుడు ప్రజలకు సేవ చేసే ఒక గొప్ప అవకాశాన్ని ఇస్తాడని, ఆ అవకాశాన్ని సొంత లాభం కోసం కాకుండా, ప్రజా సంక్షేమం కోసం ఉపయోగించినప్పుడే జన్మకు సార్థకత లభిస్తుందని మంత్రి అన్నారు. లిరాములు ఉద్యోగానికి మాత్రమే రిటైర్మెంట్ ఇచ్చారు కానీ, సమాజ సేవకు కాదని, ఇప్పటివరకు పొందిన అనుభవంతో ప్రజలకు నిరంతరం సేవలు అందిస్తూ, ఆరోగ్యంగా, సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, ఏదులాపురం మునిసిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, విద్యుత్ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలి

- ఉద్యోగ భద్రత కల్పించి, న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి:



నాగర్ కర్నూల్ నవంబర్ 03 (ప్రజాకలం) : ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న ఆశా వర్కర్లు మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంబంధిత సూపర్వైజర్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా అంతటి కాశన్న మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆశా వర్కర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. గర్భిణులు, బాలింతల సంరక్షణ, చిన్నపిల్లల ఆరోగ్య పరిరక్షణ, టీకాల కార్యక్రమాలు, కుటుంబ నియంత్రణతో పాటు ప్రభుత్వ ఆరోగ్య పథకాల అమలులో నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు.ఇంతటి కీలకమైన సేవలు అందిస్తున్న ఆశా వర్కర్లకు కనీస వేతనాలు లేకపోవడం, ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు. చాలీచాలనిపారితోషికాల తో కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల కనీస వేతనం చెల్లించాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా రూ.50 లక్షల ప్రమాద బీమా, రూ.50 వేల ప్రసూతి ప్రయోజనం, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.5 లక్షలు చెల్లించాలని కోరారు. ప్రమాదవశాత్తు మరణించిన ఆశా వర్కర్ల కుటుంబాలకు తగిన పరిహారం అందించాలని, ప్రతి సంవత్సరం 20 రోజుల క్యాజువల్ సెలవులు, ఆరు నెలల ప్రసూతి సెలవులు, పెన్షన్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రభుత్వం వెంటనే స్పందించి ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనిపక్షంలో వారు చేపట్టే సమ్మెకు సంపూర్ణ మద్దతు అందిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు సుజాత, రాఘవేణి, సాధిక, అంబరాణి, భాగ్య, పుష్ప, జంగమ్మ, నిర్మల తదితర ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలి

- రైతుల పంటలను పరిశీలించి సీపీఎం జిల్లా నాయకులు నాగపూర్ మధు



నాగర్ కర్నూల్ నవంబర్ 03 (ప్రజా కలం): నాగర్ కర్నూల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా నాయకులు నాగపూర్ మధు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో పత్తి, మిర్చి పంటలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా నాగపూర్ మధు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సరైన వర్షాలు కురవక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం ఎకరాకు 18 నుంచి 20 క్వింటాళ్ల పత్తి దిగుబడి రాగా, ఈ ఏడాది కేవలం 6 నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వస్తోందని తెలిపారు.

మిర్చి పంట సాగు చేసి 90 రోజులు గడుస్తున్నా ఇప్పటికీ ఆశించిన స్థాయిలో కాపు రాలేదని పేర్కొన్నారు. మిర్చి సాగుకు ఎకరాకు సుమారు రూ.1.50 లక్షల పెట్టుబడి ఖర్చు అవుతుండగా, కనీసం పెట్టుబడి కూడా తిరిగి వచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇంతటి దారుణమైన పరిస్థితులు ఉన్నప్పటికీ జిల్లా అధికారులు నాగర్ కర్నూల్ జిల్లాలోని 13 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, నాగర్ కర్నూల్ మండలాన్ని విస్మరించడం అన్యాయమని విమర్శించారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ స్పందించి నాగర్ కర్నూల్ మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని, పంట నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు, పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల నాయకులు నాగరాజ్ గౌడ్, రైతులు తిరుపతయ్య, మల్లయ్య, బాలచంద్రయ్య, యాదగిరి, లింగం తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవి మాదిగలకు కేటాయించాలి

డాక్టర్ పిడమర్తి రవికి అవకాశం కల్పించాలని డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ విజ్ఞప్తి



ఖమ్మం, నవంబర్ 03(ప్రజా కలం న్యూస్)

గవర్నర్ కోటాలో ఖాళీ కానున్న మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఒక స్థానాన్ని మాదిగ సామాజిక వర్గానికి కేటాయించాలని తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టి యం హెచ్ డి) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ కోరారు. మాజీ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్, మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవికి ఎమ్మెల్సీ అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించడంతో పాటు ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం కృషి చేసిన పిడమర్తి రవికి అవకాశం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎంహెచ్డీ నాయకులు మునగలేటి వీరస్వామి, బహుజన నాయకులు రాయల శ్రీనివాస్, మంద కుమార్, మాదిగ రాములు, మధు తదితరులు పాల్గొన్నారు.

తానూర్‌లో వర్షం... రైతన్నల హర్షం



తానూర్,నవంబర్ 03 (ప్రజా కలం): మండల కేంద్రమైన తానూర్ గ్రామంలో కురిసిన అకాల వర్షంతో రైతన్నల ముఖాల్లో చిరునవ్వులు విరిశాయి, చాలా కాలంగా వానలు లేక ఎండిపోతున్న పత్తి, సోయా, కంది పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు, తీవ్రమైన ఎండలు, ఉక్కబోతతో అల్లాడుతున్న స్థానిక ప్రజలకు సాయంత్రం కురిసిన వానతో ఉపశమనం లభించింది.

బేల్తరోడలో మధ్యాహ్న భోజనం


ఇంకుడు గుంతల పరిశీలన



తానూర్, నవంబర్ 03(ప్రజా కలం): మండలంలోని బేల్తరోడ గ్రామ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజన ఏర్పాట్లను మంగళవారం ఎంపీడీఓ శ్రీధర్ పరిశీలించారు, గ్రామంలో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పురోగతిని తనిఖీ చేసి, డ్రైన్-ఎండ్ గుంతకు మార్క్-అవుట్ అందించారు,ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గోప సాయినాథ్ , పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఏల్వి లో పొలంబాట రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేసిన సర్పంచ్

తానూర్, నవంబర్ 03 (ప్రజా కలం): మండలంలోని ఏల్వి గ్రామంలో మంగళవారం వివిజీ రామ్ జీ పథకంలో భాగంగా పొలంబాట రోడ్డు నిర్మాణానికి గ్రామ సర్పంచ్ ఈర్వంత్ పటేల్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు, గ్రామీణ ప్రాంతాల్లో రైతుల రవాణా కష్టాలను తీర్చడానికి రోడ్ల అభివృద్ధి ఎంతగానో తోడ్పడుతుందని ఈ సందర్భంగా సర్పంచ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎపీఓ శివలింగయ్య, ఈసి జీతేందర్, టీఏ పోశెట్టి, ఏఫ్ఏ నరేష్, నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, డీలర్ నగేష్, గ్రామపంచాయతీ కార్యదర్శి , రైతులు పాల్గొన్నారు.



ఖైదీలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

నాగర్ కర్నూల్ సబ్ జైలును సందర్శించి వసతులు, ఆహార నాణ్యతను పరిశీలించిన న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నిహారిక



నాగర్ కర్నూల్ నవంబర్ 3 (ప్రజా కలం): రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శ్రీమతి నిహారిక మంగళవారం నాగర్ కర్నూల్ పట్టణంలోని సబ్ జైలును సందర్శించారు. ఈ సందర్భంగా జైలులో ఉన్న ఖైదీలతో మాట్లాడి వారికి కల్పిస్తున్న వసతులు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని నియమించుకునే ఆర్థిక స్థోమత లేని ఖైదీలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ తరఫున ప్రభుత్వ న్యాయవాదిని ఉచితంగా నియమించి న్యాయ సహాయం అందిస్తామని నిహారిక తెలిపారు. ప్రతి ఒక్కరికీ న్యాయం పొందే హక్కు ఉందని, ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఎవరూ న్యాయ సహాయానికి దూరం కాకూడదని పేర్కొన్నారు.అనంతరం జైలులోని వంటశాలను, వంటకు ఉపయోగిస్తున్న సరుకులను, ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆహారాన్ని రుచి చూసి, ఖైదీలకు నిర్ణీత మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. జైలు పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతను నిరంతరం పాటించాలని సిబ్బందికి సూచించారు.
ఈ కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ గుణశేఖర్ నాయుడు, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పవన శేష సాయి, జైలు సిబ్బంది పాల్గొన్నారు.

మల్లారం, బాలపేటలో అవగాహన సదస్సులు..

హాజరైన అధికారులు, శాస్త్రవేత్తలు..



తల్లాడ, నవంబర్ 3 (ప్రజా కలం న్యూస్):
తల్లాడ మండల పరిధిలోని బాలపేట సర్పంచ్ కోసూరి ధనలక్ష్మీ, మల్లారం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్ అధ్యక్షతన మంగళవారం ఎల్ఈనోపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీధర్ రాజు, మండల వ్యవసాయ అధికారి తాజుద్దీన్, ఇరిగేషన్ ఇంజనీర్ నవ్య, ఏఈఓ హసీనా బేగం హాజరయ్యారు.కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డా. పావని, ఫణిశ్రీ పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. వారు జీవన ఎరువుల ప్రాధాన్యత, భూసార పరీక్షల ఆవశ్యకత, జీవన ఎరువుల వినియోగ విధానం, ఆరుతడి పంటల సాగుపై వివరంగా వివరించారు. అనంతరం సర్పంచ్ లు, అధికారులు శాస్త్రవేత్తలను సత్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.

మెరిసిన బాల భారతి విద్యాలయం విద్యార్థులు..

తల్లాడ, నవంబర్ 3 (ప్రజా కలం న్యూస్): భారతదేశవ్యాప్తంగా జరిగిన రీడ్ ఇండియా సెలబ్రేషన్ లో బాలభారతి విద్యాలయం విద్యార్థులు 10మంది



అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా సుమారు 20 రాష్ట్రాల నుండి విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనగా 142 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. అందులో తెలంగాణ నుండి 13 మంది విద్యార్థులు ఎంపిక కాగా, వారిలో బాలభారతి విద్యార్థిని విద్యార్థులు 10 మంది ఉండడం గమనార్హం. అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన విద్యార్థులు షేక్ సమీహ, బి లోహిత, ఎస్ శ్రీ సంధ్య ,ఆర్ శైలజ, కె కమల , కె హితేష్ శ్రీరంగ, ఈ జస్వంత్, కె ఉమాంజలి, ఆర్ రేష్మిత,ఐ టీనా తన్విక లను మండల విద్యాశాఖ అధికారి ఎన్ .దామోదర్ ప్రసాద్, విద్యాసంస్థల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్ ,డైరెక్టర్ కోటగిరి .శ్రావణి, ప్రిన్సిపల్ తాళ్లూరి రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

తల్లిలేని కవలలకు కందాళ ఆపన్నహస్తం

రూ.20 వేల ఆర్థిక సాయం!

- 'పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి



పాలేరు నవంబర్ 03(ప్రజా కలం న్యూస్) తల్లిని కోల్పోయిన ఆడ కవలల పోషణకు పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి అండగ నిలిచారు. తిరుమలాయపాలెం మండలం రఘునాథపాలెం గ్రామానికి చెందిన కొండ్రు ప్రసాద్ భార్య భవాని, కవలలకు జన్మనిచ్చిన ఎనిమిది రోజులకే మృతి చెందింది. దీంతో ఇద్దరు చిన్నారుల పోషణ తండ్రికి భారంగా మారింది.ఈ కుటుంబం దీనస్థితికి స్పందించిన కందాళ రూ.20 వేల ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం స్థానిక నాయకులు ప్రసాద్ ఇంటికి వెళ్లి ఆర్థిక సాయాన్ని అందజేశారు. కుటుంబానికి ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని కందాళ భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కందాళ ఉపేందర్ రెడ్డికి, తమ కష్టాలను వెలుగులోకి తెచ్చినవారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నాగర్ కర్నూల్ జిల్లాకు రూ.1,778.51 కోట్ల

వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణ

- కరువు ప్రభావిత రైతులకు 12 నెలల రుణ మారటోరియం.. రుణ చెల్లింపు గడువు 60 నెలలకు పొడిగింపు

- అర్హులైన రైతులకు బ్యాంకులు పూర్తి సహకారం అందించాలి కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్



నాగర్ కర్నూల్ నవంబర్ 03 (ప్రజాకలం) :
జిల్లాలో కరువు పరిస్థితుల నేపథ్యంలో రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.1,778.51 కోట్ల వ్యవసాయ రుణాల పునర్వ్యవస్థీకరణకు చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తెలిపారు. మంగళవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రత్యేక జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశంలో బ్యాంకు అధికారులతో ఆయన సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కరువు ప్రభావిత మండలాల వారీగా పంట నష్టాల తీవ్రతను గుర్తించి, గ్రామాల వారీగా రుణ పునర్వ్యవస్థీకరణకు అర్హులైన రైతులను గుర్తించాలని వ్యవసాయ శాఖ, బ్యాంకు అధికారులను ఆదేశించారు. అర్హులైన రైతులందరికీ రుణ పునర్వ్యవస్థీకరణ ప్రయోజనాలు అందేలా బ్యాంకులు పూర్తి సహకారం అందించాలని సూచించారు.
తీవ్ర కరువు ప్రభావిత మండలాల్లో అర్హులైన రైతులకు 12 నెలల రుణ మారటోరియం కల్పించడంతో పాటు, రుణ చెల్లింపు గడువును గరిష్ఠంగా 60 నెలలకు పొడిగించే అవకాశం ఉందన్నారు. పాక్షిక కరువు ప్రభావిత మండలాల్లో రుణ చెల్లింపు గడువును 36 నెలల వరకు పొడిగించనున్నట్లు తెలిపారు. స్వల్పకాలిక పంట రుణాలను వడ్డీతో సహా మధ్యకాలిక రుణాలుగా మార్చుకునే వెసులుబాటు కల్పించనున్నట్లు వివరించారు.
జిల్లాలో ఇప్పటివరకు 65,893 మంది రైతులకు రూ.1,125.10 కోట్ల పంట రుణాలు, మరో 27,297 మంది రైతులకు రూ.653.41 కోట్ల వ్యవసాయ కాలపరిమితి రుణాలు మంజూరైనట్లు వెల్లడించారు. మొత్తం రూ.1,778.51 కోట్ల రుణాల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియలో అర్హులైన రైతులందరికీ న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.అలాగే తదుపరి పంటల సాగుకు రైతులకు అవసరమైన కొత్త పంట రుణాలు, వర్కింగ్ క్యాపిటల్ రుణాలను సకాలంలో మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. కరువు ప్రభావిత రైతులపై రుణ వసూళ్ల ఒత్తిడి తీసుకురావడం, బెదిరింపులకు పాల్పడటం, బలవంతపు వసూళ్లు చేపట్టడం చేయరాదని స్పష్టం చేశారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా రుణ పునర్వ్యవస్థీకరణపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని, వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకు ప్రతినిధులు సమన్వయంతో గ్రామాల వారీగా అర్హులైన రైతులను గుర్తించాలని సూచించారు. వచ్చే వారం రోజుల్లో మండల స్థాయిలో బ్యాంకుల సమన్వయ సమావేశాలు నిర్వహించి, రుణ పునర్వ్యవస్థీకరణ అమలుపై పురోగతి నివేదికలను సమర్పించాలని అధికారులను ఆదేశించారు.కరువు పరిస్థితుల్లో రైతులకు ఆర్థిక ఇబ్బందులు కలగకుండా, తదుపరి పంటల సాగుకు ఇబ్బందులు ఎదురుకాకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ స్పష్టం చేశారు.

ఎటపాక జెడ్పీటీసీ పోరు.. హోరాహోరీ!

- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అభ్యర్థుల ఇంటింటి ప్రచారం

- టీడీపీ, వైసీపీ, స్వతంత్ర అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ

- సామాజిక మాధ్యమాల్లోనూ హోరెత్తుతున్న ఎన్నికల ప్రచారం

- నేడు సాయంత్రం 5 గంటలకు ముగియనున్న ప్రచార పర్వం



ప్రజాకలం ప్రతినిధి ప్రతినిధి ఎటపాక నవంబర్ 03
పోలవరం జిల్లా ఎటపాక మండలంలో జెడ్పీటీసీ ఎన్నికల పోరు ఆసక్తికరంగా మారింది. ప్రధానంగా తెలుగుదేశం, బీజేపీ మద్దతుతో జనసేన కూటమి అభ్యర్థి ఉబ్బా సుష్మిత, సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో బరిలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కాకా కామేశ్వరి, టీడీపీ రెబల్ అభ్యర్థి పాయం దేవి మధ్య జెడ్పీటీసీ స్థానానికి పోటీ నెలకొంది. పోలింగ్ తేదీ సమీపిస్తుండటంతో అభ్యర్థులు ప్రచారాన్ని మరింత ముమ్మరం చేశారు. మంగళవారం ప్రచారానికి చివరి రోజు కావడంతో వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అభ్యర్థులు, వారి అనుచరులు గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలుస్తున్నారు. తమకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థిస్తూ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. స్థానిక సమస్యలు, గ్రామాల అభివృద్ధి, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరోవైపు పార్టీ నాయకులు, కార్యకర్తలు కూడా తమ తమ అభ్యర్థుల తరఫున ప్రచారంలో చురుగ్గా పాల్గొంటున్నారు.
సామాజిక మాధ్యమాల్లోనూ ప్రచార హోరు
మరోవైపు సామాజిక మాధ్యమాలు ఎన్నికల ప్రచారానికి ప్రధాన వేదికగా మారాయి. వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర మాధ్యమాల ద్వారా అభ్యర్థులకు మద్దతుగా పోస్టులు, ప్రచార సందేశాలు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. దీంతో గ్రామాల్లోనే కాకుండా సామాజిక మాధ్యమాల్లోనూ ఎన్నికల సందడి నెలకొంది.
చివరి రోజు ప్రచారంపై అందరి దృష్టి
నవంబర్ 5న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మంగళవారం సాయంత్రం 5 గంటలకు ఎన్నికల ప్రచార పర్వం ముగియనుంది. దీంతో చివరి రోజు ప్రచారంలో అభ్యర్థులు ఓటర్లను కలిసేందుకు విస్తృతంగా ప్రయత్నిస్తున్నారు. ఎటపాక జెడ్పీటీసీ స్థానాన్ని దక్కించుకునేందుకు కూటమి అభ్యర్థి, వైసీపీ అభ్యర్థి, టీడీపీ రెబల్ అభ్యర్థి తమ తమ మద్దతుదారులతో ప్రచారం నిర్వహిస్తున్నారు. చివరి రోజు ప్రచారంలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, ఓటర్ల స్పందనపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

కాషాయ జనసందోహం... జనసంద్రంగా నిర్మల్!

- ప్రజాస్వామ్య పరిరక్షణకు కాషాయ దళం కదం తొక్కింది!



నిర్మల్ నవంబర్ 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)
నిర్మల్ పట్టణంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పాదయాత్రకు ప్రజలు, బీజేపీ శ్రేణులు వేలాదిగా తరలివచ్చారు. కాషాయ జెండాలతో నిర్మల్ పట్టణం జనసంద్రంగా మారింది. ఎస్ ఐ ఆర్(ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ)పై కాంగ్రెస్, ఇండీ కూటమి చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణకు మద్దతుగా ప్రజలు భారీ సంఖ్యలో ఈ పాదయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ... మన తెలంగాణలో మీ అందరి ఓట్లు దండుకొని రేవంత్ రెడ్డి మూటలు మోస్తున్నాడు. ఆయన పదవి కాపాడుకునేటందుకు ప్రతివారం ఢిల్లీకి మూటలు పంపి, ఢిల్లీలో రెన్యువల్ చేసుకుంటూ... ఈరోజు రాహుల్ గాంధీ చుట్టూ ప్రదక్షిణలు చేస్తా ఉన్నావు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను పూర్తిగా విస్మరించింది 4,000 పెన్షన్, యువతకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతులకు రైతు భరోసా పథకాలను అమలు చేయకుండా మోసం చేశారు. కేవలం తన పదవిని కాపాడుకోవడానికే ఢిల్లీకి మూటలు మోస్తూ, గాంధీ కుటుంబం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. నరేంద్ర మోదీ కోట్లాది మంది ప్రజల గుండెల నుంచి పుట్టిన వ్యక్తి. ఈ కోట్ల ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న వ్యక్తి. ప్రజల చేత మూడోసారి ఎన్నుకోబడ్డ ఒక మహానాయకుడిని ఈరోజు 10 మంది కాక్రోచ్‌లు ఏం చేస్తారు? మంగళవారం అశేషంగా తరలివచ్చిన నా యువత, నా మహిళలు, నా ఆడపడుచులు, నా విద్యార్థులు, నా రైతన్నలారా... ఇంత దూరం నా వెంట నడిచి, మా అందరినీ ఆశీర్వదించి, వర్షాన్ని కూడా లెక్కచేయకుండా మీరు మాకు ఆశీర్వదించినటువంటి మీ అందరికీ మనస్ఫూర్తిగా రెండు చేతులు జోడించి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ మహా పాదయాత్ర ద్వారా ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రజలు తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా: బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్.సునీల్ బన్సల్ బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు,రామచందర్ రావు తెలంగాణ ఇన్‌చార్జి, కేంద్ర మంత్రి,బండి సంజయ్ కుమార్, బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జి,అభయ్ పాటిల్ బీజేపీ తెలంగాణ రాష్ట్ర సహ ఇన్‌చార్జిరేఖా శర్మ,మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు,ఈటల రాజేందర్ ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు,గోడం నగేష్ మల్కా కొమరయ్య శాసన మండలి సభ్యులు ఎమ్మెల్సీ అంజిరెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే,రామారావు పటేల్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే,పాయల్ శంకర్ రాకేష్ రెడ్డి ఆర్మూర్ ఎమ్మెల్యే, ధన్‌పాల్ సూర్యనారాయణ నిజామాబాద్ ఎమ్మెల్యే,పాల్వాయి హరీష్ బాబు సిర్పూర్ ఎమ్మెల్యే బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షులు రితేష్ రాథోడ్ ,తదితర బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజాకలం కథనానికి స్పందన:

ముధోల్ ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ భవేష్ మిశ్రా







తానూర్, నవంబర్ 03(ప్రజా కలం): ముధోల్ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో సమస్యలపై 'ప్రజా కలం' దినపత్రికలో వచ్చిన ప్రత్యేక కథనానికి అధికారులు వెంటనే స్పందించారు, మంగళవారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్వయంగా ఆసుపత్రిని సందర్శించి వైద్య విభాగాలు, ల్యాబ్, మందుల పంపిణీ కేంద్రాన్ని పరిశీలించారు, పాత భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టి, మార్చురీ ఏర్పాటుతో పాటు నూతన భవన నిర్మాణం కోసం ఉన్నతాధికారులతో చర్చిస్తామని తెలిపారు, పేద రోగులకు నాణ్యమైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు, పత్రిక ద్వారా సమస్య వెలుగులోకి వచ్చి పరిష్కార మార్గం సుగమమైందని స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు,ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ కాశీనాథ్, తహసీల్దార్ శ్రీలత, సర్పంచ్ షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాల ప్రకటనకే పరిమితమైనవి

- రైతుల సమస్యలను పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

- ధాన్యం, పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి..

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



తల్లాడ, నవంబర్ 3: ప్రజా కలం న్యూస్
తల్లాడ పట్టణం లోని నారాయణపురం గ్రామంలో స్థానిక బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి నివాసం వద్ద ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కరువు మండలాలను ప్రభుత్వం పేరుకే ప్రకటించిందని, క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి స్పష్టత, భరోసా కల్పించడం లేదని అన్నారు. వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటిస్తూ పంట విరామం పాటించాలని రైతులకు సూచించడం, ఎరువుల దుకాణాలకు నోటీసులు ఇవ్వడం మినహా రైతులకు జరుగుతున్న మేలు ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంట తడిసి రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అయినప్పటికీ ఇప్పటివరకు ఒక్కచోట కూడా పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు సైతం ప్రారంభించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.పది రోజుల క్రితం క్వింటాల్ ధాన్యాన్ని రూ.4,200 చొప్పున కొనుగోలు చేసిన వ్యాపారులు, ప్రస్తుతం ఒక్కసారిగా ధర తగ్గించి రూ.2,800కే విక్రయించాలని రైతులపై ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు. వేంసూరు మండల రెవెన్యూ పరిధిలోని కందుకూరు, మర్లపాడు, లింగపాలెం గ్రామాల్లో విద్యుత్, సాగునీటి సౌకర్యాలు లేక వందలాది ఎకరాల్లో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. పంటలు ఎండిపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు.అదేవిధంగా తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పత్తి, వరి పంటలను వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంట నష్టపోయిన రైతులను గుర్తించాలని సూచించారు. పంట నష్టంపై సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందజేసి అర్హులైన రైతులకు తగిన నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు పెంచాలి
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు గడువు ఈ నెల 6వ తేదీతో ముగియనుండగా, వెబ్‌సైట్‌లో సాంకేతిక సమస్యల కారణంగా గత మూడు రోజులుగా దరఖాస్తుల ప్రక్రియకు అంతరాయం ఏర్పడుతోందని సండ్ర తెలిపారు. దీంతో అర్హులైన పట్టభద్రులు ఓటరు నమోదుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఓటరు నమోదు గడువును పొడిగించాలని కోరారు.
బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని సండ్ర వెంకట వీరయ్య పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని గుర్తించి ఓటరుగా నమోదు చేయించాలని, ఒక్క ఓటు కూడా చేజారకుండా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రెడ్డెం వీరమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, మండల ప్రధాన కార్యదర్శి దుగ్గిదేవర వెంకట్ లాల్, పట్టణ అధ్యక్షుడు జి.వి.ఆర్., ఉపసర్పంచ్ కేతినేని చలపతిరావు, నాయకులు దిరిశాల దాసురావు, కోడూరు వీరకృష్ణ, మాజీ సర్పంచ్ కోసూరి వెంకట నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వి.బి.జి. రామ్ జీ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను

వేగవంతం చేయాలి

– జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి నవంబర్ 03:

వి.బి.జి. రామ్ జీ పథకం కింద చేపట్టిన విలేజ్ ఆర్గనైజేషన్ (వి.ఓ.) భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగులు, మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమావేశంలో మండలాల వారీగా వివో భవనాలు, అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగులు, మరుగుదొడ్ల నిర్మాణ పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు, డివిజన్ స్థాయి అధికారులతో పనుల ప్రస్తుత స్థితి, నిధుల వినియోగం, బిల్లుల చెల్లింపులు, పెండింగ్ పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వి.బి.జి. రామ్ జీ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులకు నిధుల కొరత లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుంచి అందిన అడ్వాన్స్ నిధులను సద్వినియోగం చేసుకుంటూ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. గతంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను కూడా త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పనులు పూర్తయిన వెంటనే కొలతల పుస్తకాల్లో (ఎం.బి.) నమోదు చేసి, బిల్లులను సంబంధిత అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఏఈలు, డీఈలు, ఇతర ఇంజినీరింగ్ అధికారులు తమ కార్యాలయాల్లో బిల్లులను పెండింగ్‌లో ఉంచకుండా తక్షణమే తదుపరి ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. బిల్లుల పరిశీలన, ధ్రువీకరణ, ఎఫ్‌టీఓల జనరేషన్‌లో ఎలాంటి జాప్యం చేయకూడదన్నారు.నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ కొన్ని మండలాల్లో నిర్మాణ పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కొన్ని మండలాల్లో అధికారులు నిరంతరం బిల్లులు సమర్పిస్తూ పనులను వేగంగా పూర్తి చేస్తుండగా, మరికొన్ని మండలాల్లో పనుల పురోగతి మందకొడిగా ఉండటాన్ని ప్రశ్నించారు. పనులు పూర్తి చేసిన వెంటనే బిల్లులు సమర్పిస్తే త్వరితగతిన చెల్లింపులు జరిగే అవకాశం ఉందని, ఈ విషయాన్ని కాంట్రాక్టర్లు, సర్పంచులకు వివరించి నిర్మాణాలను వేగవంతం చేయాలని సూచించారు.

గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణాలపై సమీక్షిస్తూ, కొన్ని చోట్ల పనులు ఇంకా ప్రారంభం కాకపోవడం, మరికొన్ని చోట్ల పునాది స్థాయిలోనే నిలిచిపోవడంపై కలెక్టర్ ఆరా తీశారు. మంజూరైన భవనాలన్నింటినీ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటికే పునాది, గోడల నిర్మాణం, స్లాబ్ స్థాయికి చేరుకున్న పనులను తదుపరి దశకు తీసుకెళ్లాలని సూచించారు. నిర్మాణాలకు అవసరమైన స్థల సమస్యలు, స్థానిక అభ్యంతరాలు, ఇతర అడ్డంకులను వెంటనే పరిష్కరించుకోవాలని తెలిపారు.పాత పనులు పూర్తిచేయకుండా కొత్త పనుల కోసం ప్రతిపాదనలు పంపడం సరికాదని, ఇప్పటికే మంజూరైన పనులను ముందుగా పూర్తి చేయడంపై దృష్టి సారించాలని సూచించారువి.ఓ. భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగుల నిర్మాణాల పురోగతిని కూడా కలెక్టర్ సమీక్షించారు. పనులు ప్రారంభించడానికి స్థల సమస్యలు, స్థానిక అభ్యంతరాలు, ఇతర ఇబ్బందులు ఉంటే సంబంధిత ఎంపీడీఓలు, తహసీల్దార్లు, సర్పంచులతో సమన్వయం చేసుకుని పరిష్కరించాలని ఆదేశించారు. నిర్మాణాలకు అనుకూలమైన స్థలాలు అందుబాటులో ఉన్నప్పటికీ పనులుప్రారంభించకపోవడాన్ని సహించేది లేదని హెచ్చరించారు.చాలాకాలంగా పనులు ప్రారంభించని నిర్మాణాల విషయంలో చర్యలు తీసుకుంటామని, అవసరమైతే మంజూరును రద్దు చేసి పనులు చేపట్టేందుకు ఆసక్తి చూపే ఇతర గ్రామాలకు కేటాయిస్తామని తెలిపారు. మంజూరైన పనులను నిర్దిష్ట గడువులోగా ప్రారంభించి పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలినిర్మాణ పనుల పురోగతిని కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి అధికారి వారానికి ఒకరోజు నిర్మాణ ప్రదేశాలను సందర్శించి పనుల నాణ్యత, పురోగతి, కార్మికుల హాజరు, ఎదురవుతున్న సమస్యలను పరిశీలించాలని సూచించారు. పనులు ఎందుకు ఆలస్యమవుతున్నాయో గుర్తించి, అక్కడికక్కడే పరిష్కార చర్యలు తీసుకోవాలన్నారు.ఎంపీడీఓలు నిర్వహించే సమీక్షా సమావేశాల్లోనూ నిర్మాణ పనుల పురోగతిని తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని తెలిపారు.

పనులు పూర్తయిన వెంటనే ఎం.బి.లు నమోదు చేసి, సంబంధిత బిల్లులను ఆలస్యం చేయకుండా పై అధికారులకు పంపించాలని కలెక్టర్ ఆదేశించారు. ఏఈలు, డీఈలు తమ వద్ద బిల్లులను నిలిపివేయకుండా తక్షణమే పంపించాలని, నిర్మాణ పనులన్నీ వేగంగా పూర్తయ్యేలా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. సమావేశంలో డీఆర్‌డీఓ నరసింహులు, పంచాయతీరాజ్ ఈఈ, డీఈలు, ఏఈలు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

రాయనపేట పంచాయతీలో కూటమి

జనసేన ఎంపీటీసీ అభ్యర్థి భారీ బైక్ ర్యాలీ..!

- వర్షాన్ని సైతం లెక్కచేయకుండా కదిలివచ్చిన జనసైనికులు, వీర మహిళలు, టీడీపీ, కూటమి నాయకులు
- కురినాల సత్యవతికి మద్దతుగా భారీ ర్యాలీ – గ్రామగ్రామాన హోరెత్తిన ఎన్నికల ప్రచారం
- విజయం సాధిస్తామంటున్న జనసేన నాయకులు



ప్రజాకలంప్రతినిధి ఎటపాక, నవంబర్ 03:

పోలవరం జిల్లా ఎటపాక మండల పరిధిలోని రాయనపేట పంచాయతీలో జనసేన ఎంపీటీసీ అభ్యర్థి కురినాల సత్యవతి ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ బైక్ ర్యాలీ రాజకీయంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా అధిక సంఖ్యలో జనసైనికులు, వీర మహిళలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. ముందుగా వెంకటరెడ్డిపేటలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జనసేన మండల అధ్యక్షుడు మారాను గంగాధర్, కొమ్ము వెంకట్, కుమారస్వామి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జనసేన నాయకులు జెండా ఊపి బైక్ ర్యాలీని ప్రారంభించారు. వెంకటరెడ్డిపేట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పాటిమాలగూడెం, మంగువాయి, తాటాకులగూడెం, రాయనపేట, దూగుట్ట, పాత కొండిపల్లి, కొత్త కొండిపల్లి, కొత్తూరు నారాయణపురం, ఎర్రబోరు, తుమ్మల నగర్ మీదుగా కోలాహలంగా సాగింది. దారిపొడవునా జనసైనికులు నినాదాలు చేస్తూ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు పూనెం గోపాల్, గోలి శ్రీనివాస్, మోరంపల్లి పెదబాబు, కురినాల శ్రీకాంత్ తదితరులు ప్రచార కార్యక్రమానికి నాయకత్వం వహించారు. అభ్యర్థి కురినాల సత్యవతి విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తున్నారని తెలిపారు. భారీ సంఖ్యలో ద్విచక్ర వాహనాలతో సాగిన ఈ ర్యాలీ రాయనపేట పంచాయతీలో ఎన్నికల సందడిని మరింత పెంచింది. ర్యాలీకి లభించిన స్పందనతో జనసేన శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. రాయనపేట ఎంపీటీసీ ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం నందు పారామెడికల్ కోర్సుల ప్రవేశ గడువు పొడిగింపు

- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ శంకర్

ఖమ్మం, నవంబర్ 03(ప్రజా కలం న్యూస్)

ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం నందు డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో (2 సంవత్సరాల వ్యవధి) ప్రవేశాలకు సంబంధించి గడువును నవంబర్ 13 వరకు పొడిగించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. టి. శంకర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.హొ

రెండు కోర్సుల్లోనూ చెరో 30 సీట్ల చొప్పున (మొత్తం 60 సీట్లు) అందుబాటులో ఉన్నాయని, అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు.డిప్లొమా ఇన్ అనస్థీషియా టెక్నీషియన్, డిప్లొమా ఇన్ మెడికల్ ఇమేజింగ్ టెక్నీషియన్ కోర్సుల్లో 30 చొప్పున మొత్తం 60 సీట్లు ఉన్నట్లు, కోర్సు వ్యవధి 2 సంవత్సరాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులలో మొదట బైపిసి విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇస్తారని, ఆ తర్వాత ఎంపిసి, ఇతర అర్హత కలిగిన విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ప్రిన్సిపాల్ అన్నారు. ముందుగా https://www.tgpmd.telangana.gov.inవెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని, ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్‌ను ప్రింట్ తీసి, అవసరమైన అన్ని ధ్రువపత్రాల (సర్టిఫికెట్ల) నకళ్లను జతచేసి 'ప్రభుత్వ వైద్య కళాశాల, ఖమ్మం' కార్యాలయంలో నేరుగా సమర్పించాలని అన్నారు. దరఖాస్తుల సమర్పణకు పూర్వం అక్టోబర్ 31, 2026 చివరి తేదీగా నిర్ణయించగా, విద్యార్థుల సౌకర్యార్థం ఆ గడువును 13 నవంబర్ 2026 సాయంత్రం 5:00 గంటల వరకు పొడిగించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ఆసక్తిగల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

తల్లాడలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాగమయి దయానంద్



తల్లాడ.నవంబర్.3 ప్రజా కలం న్యూస్ : సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాఘమయి దయానంద్ మంగళవారం తల్లాడ లో పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా 15,75,000/- (15 లక్షల 75 వేల రూపాయల) 61 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు ఈ సందర్భంగా గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడైనా పేద ప్రజల పక్షాన నిలబడే ప్రభుత్వం అన్నారు. సీఎంఆర్ఎఫ్ గాని షాదీ ముబారక్ గాని కళ్యాణ లక్ష్మి గాని పార్టీలకతీతంగా మంజూరు చేస్తున్నామని ఈ సందర్భంగా గుర్తు చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న మరిన్ని సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేకూర్చే విధంగా కృషి చేస్తానన్నారు. తల్లాడ మండలంలో ఎల్ఓసిలు కూడా పెద్ద మొత్తంలో మంజూరు చేశామన్నారు

వీలైనంత త్వరగా పట్టబద్రులు

ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి ఎమ్మెల్యే రాగమయి

గడువు సమీపిస్తున్నందున పట్టభద్రులు వీలైనంత త్వరగా ఓటు నమోదు చేసుకోవాలని సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్ట రాఘమయి దయానంద్ సూచించారు. ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల పట్టభద్రులు ఎమ్మెల్సీ అభ్యర్థి రామిరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని భారీ మెజార్టీ తో గెలిపించడంలో సత్తుపల్లి నియోజకవర్గం ముందంజలో ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో తల్లాడ తహసిల్దార్ కరుణాకర్ రెడ్డి, తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గొడుగునూరు లక్ష్మారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు దుండేటి వీరారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోవిందు శ్రీనివాసరావు, తల్లాడ మండలం ఉపాధ్యక్షుడు తాళ్ల జోసెఫ్, మండల కాంగ్రెస్ కమిటీ నాయకులు, వేమిరెడ్డి కృష్ణారెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు కోడూరు రాము, మాజీ జెడ్పిటిసి ప్రసాదు,, శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీపురం సర్పంచ్ ఓబుల సీతారాం రెడ్డి, మల్లవరం సర్పంచ్ కటికి కిరణ్ కుమార్, గోపాలపేట సర్పంచ్ తాళ్ల వెంకటి, కొత్త వెంకటగిరి సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, మంగాపురం సర్పంచ్ నరసింహారావు, మిట్టపల్లి సర్పంచ్ శరత్, మాజీ సర్పంచ్ బొడ్డు, మాజీ జెడ్పిటిసి కంచ పోగు వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ బండి బాలసోరి, తల్లాడ మండలం సర్పంచులు ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భారీ ర్యాలీ

- సీపీఐ, వైసిపి అభ్యర్థులను గెలిపించాలని నేతల పిలుపు!



ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, నవంబర్ 03:

వైసీపీ, సీపీఐ, కాంగ్రెస్ పార్టీల మద్దతుతో బరిలో నిలిచిన కృష్ణవరం ఎంపీటీసీ సీపీఐ అభ్యర్థి సున్నం పున్నమ్మ, జెడ్పీటీసీ వైసీపీ అభ్యర్థి కాక కామేశ్వరి విజయాన్ని కాంక్షిస్తూ ఎటపాక మండలంలో భారీ ర్యాలీ నిర్వహించారు. మండలంలోని అచ్యుతపురం (కొత్తూరు) నుంచి గన్నవరం వరకు సాగిన ఈ ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు, వైసీపీ, సీపీఐ, సీపీఐఎం అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఏమాత్రం వెనక్కి తగ్గకుండా నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొని అభ్యర్థులకు మద్దతుగా నినాదాలు చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా సాగిన ఈ ర్యాలీతో ఎన్నికల ప్రచారంలో రాజకీయ సందడి నెలకొంది. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కందుకూరి స్వర్ణ మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతూ, ప్రజల పక్షాన నిలిచే వామపక్ష, ప్రజాస్వామ్య పార్టీల అభ్యర్థులను ప్రజలు ఆదరించి గెలిపించాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసే సున్నం పున్నమ్మ, కాక కామేశ్వరి అభ్యర్థిత్వాలకు ప్రజలు తమ ఓటు ద్వారా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ ర్యాలీలో వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, వైసిపి మండల అధ్యక్షులు ఆకుల రామారావు (పెద్దోడు) , మండల కార్యదర్శి దయాకర్, సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ, ఎస్టీ సెల్ కార్యదర్శి చిచ్చుడీ రామారావు, మాజీ సర్పంచ్ కృష్ణ, పసుపులేటి లక్ష్మణ్ రావు, వైసీపీ నాయకులు చింటూ, కుర్రిల వెంకటేశ్వర్లు(బుజ్జి), నాయకులు , పాల్గొన్నారు.

జిల్లాలో త్రాగునీటి సరఫరాపై ప్రత్యేక డ్రైవ్

జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య



మంచిర్యాల జిల్లా//ప్రజాకలం జిల్లా ప్రతినిధి నవంబర్ 3:

వేసవి కాలంలో ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పటిష్ట చర్యలు చేపట్టడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో గ్రామీణ నీటి సరఫరా ఈ.ఈ. వెంకటేష్, మిషన్ భగీరథ ఈ.ఈ. మధుసూదన్ లతో కలిసి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, డి.ఈ.లు, ఎ.ఈ.లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులు, రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు నిరంతరాయంగా సురక్షిత త్రాగునీరు అందించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుండి నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా త్రాగునీటి సరఫరా, మౌలిక సదుపాయాల పనితీరును మెరుగుపరచడంతో పాటు, అందుబాటులో ఉన్న నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రిడ్, బల్క్ వాటర్ సప్లై పథకాల ద్వారా మున్సిపాలిటీలు, పట్టణ స్థానిక సంస్థలకు శుద్ధి చేసిన నీరు సక్రమంగా చేరేలా పర్యవేక్షించాలని, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికీ సురక్షిత త్రాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మండల స్థాయి సమావేశాలు నిర్వహించి, క్షేత్రస్థాయి తనిఖీల కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, తనిఖీ కార్యాచరణ ప్రకారం మండల స్థాయి బృందాలు అన్ని ఆవాసాలను సందర్శించి త్రాగునీటి సరఫరా పరిస్థితి, పైప్‌లైన్లలో లీకేజీలు, వాల్వ్‌ల పనితీరు, నీటి సరఫరా వ్యవస్థలోని లోపాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారని తెలిపారు. ఓవర్ హెడ్ సర్వీస్ రిజర్వాయర్లు, గ్రౌండ్ లెవల్ సర్వీస్ రిజర్వాయర్లు, మ్యాన్‌హోల్స్‌ను క్రమం తప్పకుండా శుభ్రపరచడంతో పాటు, నీటి ట్యాంకులకు క్లోరినేషన్ నిర్వహించాలని, అవసరమైన మేరకు బ్లీచింగ్ పౌడర్ వినియోగించి త్రాగునీటి నాణ్యతను నిర్ధారించాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వేసవిలో నీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉన్న ప్రాంతాలను ముందుగానే గుర్తించి, ఆయా ప్రాంతాలలో ప్రత్యామ్నాయ నీటి వనరులు, సరఫరా మార్గాలను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి సరఫరాలో అంతరాయాలు ఏర్పడకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రజలు తమ ప్రాంతాలలో త్రాగునీటి సమస్యలు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు 1916 టోల్ ఫ్రీ నంబర్ గురించి విస్తృతంగా ప్రచారం కల్పించాలని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌ను సమర్థవంతంగా అమలు చేసి, రానున్న వేసవి కాలంలో ప్రజలందరికీ సురక్షితమైన, నాణ్యమైన త్రాగునీటిని నిరంతరాయంగా అందించేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు.

ఎగ్ కార్డ్స్ పంపిణీ చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి



(వరంగల్/ పర్వతగిరి) నవంబర్ 03, ప్రజాకలం ప్రతినిధి:

ఎన్ఇసిసి ఆధ్వర్యంలో పర్వతగిరి మండలానికి చెందిన సుమారు 30 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డుల పంపిణీ చేసారు. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో వర్ధన్నపేట నియోజకవర్గంలోని పర్వతగిరి మండలానికి చెందిన సుమారు 30 మంది లబ్ధిదారులకు ఎగ్ కార్డులను పంపిణీ చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎన్ఇసిసి జోనల్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు. పర్వతగిరిలోని ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారి నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఎర్రబెల్లి ప్రేమ్ కుమార్, ఎర్రబెల్లి వినీత్ రావు పాల్గొని లబ్ధిదారులకు ఎగ్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కోడిగుడ్డు శరీరానికి అవసరమైన నాణ్యమైన ప్రోటీన్‌తో పాటు విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా లభిస్తాయని తెలిపారు. ముఖ్యంగా పిల్లల ఎదుగుదలకు, కండరాల అభివృద్ధికి, శరీరానికి అవసరమైన శక్తిని అందించడంలో కోడిగుడ్డు కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. తక్కువ ధరలో అధిక పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించే కోడిగుడ్డును ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచించారు. ప్రజల ఆరోగ్యం, పౌష్టికాహారం పట్ల అవగాహన కల్పిస్తూ లబ్ధిదారులకు ఉపయోగపడే విధంగా ఎగ్ కార్డుల పంపిణీ చేపట్టడం అభినందనీయమని వారు పేర్కొన్నారు.

రోడ్లు వేయమంటే అరెస్టులా..?

ప్రశ్నించే యువకుల అరెస్ట్ ప్రజాస్వామికమా??

- వారి ఆవేదనలో ఆవేశం కనిపించింది కానీ ఆ ఆవేశానికి కారణమైన అసంపూర్తి రహదారి కనిపించలేదా.?

- వాట్సాప్ లో వివాదాస్పద వ్యాఖ్యలు యువకుల బాధ్యతరాహిత్యం అయితే

- ప్రజలకు కనీస సౌకర్యాలు కల్పించలేని నాయకులది అధికార ధర్పమా?? - యువకుల ప్రశ్న వ్యక్తిగత ప్రయోజనంకై కాదు ?

- హామీలిచ్చి గాలికి వదిలిన నాయకుల కనువిప్పు కోసం - వేగంగా కదిలిన చ(చు)ట్టం ఆయన మెప్పు కోసమేనా??

అయినవోలు అక్టోబర్ 3:- (ప్రజా కలం ప్రత్యేక కథనం)

కాజీపేట నుంచి కొండపర్తి, ముల్కలగూడెం మీదుగా గుంటూరుపల్లి–ఐనవోలు వరకు వెళ్లే రహదారి దుస్థితి మూడేళ్లుగా స్థానిక ప్రజలకు నిత్య నరకంగా మారింది. కొండపర్తి రహదారి సమస్య ఇప్పుడు కేవలం రోడ్డు నిర్మాణానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. ప్రజల సమస్యను ప్రశ్నించిన యువకుల అరెస్టు, ప్రజాప్రతినిధుల బాధ్యత, అధికారుల పనితీరు, పోలీసుల వ్యవహారశైలిపై అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. గత ప్రభుత్వ హయాంలోనే రహదారి పనులకు అనుమతులు మంజూరై, తవ్వకాలు చేపట్టి కంకర పోసినప్పటికీ నేటికీ పనులు పూర్తికాకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. ఈ రోడ్డుపై ప్రయాణించే వాహనదారులు ప్రమాదాలకు గురవుతుండగా, నిత్యం కూలి పనుల కోసం ఇదే మార్గంలో రాకపోకలు సాగించే కొండపర్తి యువకులు మూడేళ్లుగా పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం.

ప్రశ్నిస్తే అరెస్టులు.. పాలకులను ప్రశ్నించేదెవరు??

రోడ్డు ఎప్పుడు వేస్తారు? మా కష్టాలు ఎప్పుడు తీరుతాయి? అంటూ గ్రామ వాట్సాప్ గ్రూపులో కొంత ఆవేశంతో సందేశాలు పెట్టిన ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు తీవ్ర చర్చకు దారితీసింది. కట్కూరి నెల్సన్, కట్కూరి శ్రావణ్ కుమార్, అల్లందాస్ తరుణ్ అనే యువకులు ఏదో వ్యక్తిగత ప్రయోజనం కోసం కాకుండా తమ గ్రామ రహదారి సమస్యను ప్రస్తావించారనే వాదనలు వినిపిస్తున్నాయి. మూడేళ్లుగా ప్రతిరోజూ అదే రోడ్డుపై ప్రయాణిస్తూ కూలి పనులకు వెళ్లే యువకులకు ఎదురవుతున్న ఇబ్బందులు ఎవరికీ కనిపించలేదా? వారి ఆవేదనలో ఆవేశం కనిపించిందా? కానీ ఆ ఆవేశానికి కారణమైన అసంపూర్తి రహదారి కనిపించలేదా?

షాడో ఎమ్మెల్యే ఆరోపణలు.. తెరపైకి కమిషన్ వ్యవహారం!

స్థానిక నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే అన్నీ తానై వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. కొండపర్తి రహదారి నిర్మాణ పనులు చేపడుతున్న కాంట్రాక్టర్‌ను అధిక మొత్తంలో కమీషన్ డిమాండ్ చేసినట్లు కూడా ఆరోపణలు ప్రచారంలో ఉన్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి స్వతంత్రంగా నిర్ధారణ కావాల్సిన అంశాలు అనేకం ఉన్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్ స్పందించి వాస్తవాలను వెల్లడించాల్సిన అవసరం ఉంది.ఆయన మెప్పు కోసమే చట్టం ఇంత వేగంగా స్పందించిందని ఈ నేపథ్యంలో యువకుల అరెస్టు వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పోలీసుల చర్యలు చట్టపరిధిలో, ఎలాంటి రాజకీయ ప్రభావాలకు తావులేకుండా సాగుతున్నాయా అనే ప్రశ్నలకు అధికారులు సమాధానం చెప్పాలి.

ఎమ్మెల్యేకు సన్నిహితులైన నాయకులు ఏం చేస్తున్నట్లు??

కొండపర్తి గ్రామంలో ఎమ్మెల్యేతో సన్నిహిత సంబంధాలు కలిగిన నాయకులు చాలామంది ఉన్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ఇంతటి ప్రధాన సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లలేకపోతున్నారా? లేక తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదా? ప్రజాప్రతినిధులకు దగ్గరగా ఉండటం పదవులు, రాజకీయ ప్రయోజనాల కోసమేనా? ప్రజల సమస్యలు పరిష్కరించడానికి



కాదా? అనే ప్రశ్నలు గ్రామస్తుల నుంచి వినిపిస్తున్నాయి.

మూడు సంవత్సరాల నిర్లక్ష్యానికి బాధ్యులెవరు??

ఒక వాట్సాప్ సందేశం పెట్టిన యువకుల విషయంలో చట్టం ఇంత వేగంగా స్పందించినప్పుడు, మూడేళ్లుగా అసంపూర్తిగా ఉన్న రహదారి విషయంలో అదే చట్టబద్ధ వ్యవస్థ ఎందుకు స్పందించడం లేదు? పనులు ఎందుకు నిలిచిపోయాయి? నిధులు ఎక్కడ ఆగిపోయాయి? కాంట్రాక్టర్ పనులు ఎందుకు పూర్తి చేయలేదు? సంబంధిత అధికారులు ఎందుకు పర్యవేక్షించలేదు? ప్రజాప్రతినిధులు ఎందుకు పట్టించుకోలేదు? ఇవి సమాధానం లేని ప్రశ్నలు కావు. సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉన్నవారు మౌనం వహిస్తే ప్రజల్లో అనుమానాలు మరింత పెరుగుతాయి.

యువకులపై చర్యలు.. అధికారులపై బాధ్యత లేదా?

ప్రజాస్వామ్యంలో ప్రజలకు తమ సమస్యలను ప్రశ్నించే హక్కు ఉంది. ఆ ప్రశ్నలు చట్టపరిధిలో ఉండాలి. అదే సమయంలో ప్రశ్నించిన వారిపై చర్యలు తీసుకునే అధికారులు, ప్రజల సమస్యలను పరిష్కరించడంలోనూ అంతే చిత్తశుద్ధి చూపాలి.వాట్సాప్‌లో ప్రశ్నించినందుకుయువకులనుఅరెస్టు చేస్తే..మూడేళ్లుగా రోడ్డు వేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న వ్యవస్థను ఏం చేయాలి? ప్రజల ఆవేదనను అర్థం చేసుకోవాల్సిన పాలకులు, అధికార యంత్రాంగం ప్రశ్నించే గొంతులను అణచివేయడం కంటే సమస్యకు పరిష్కారం చూపడంపై దృష్టి పెట్టాలి.

ప్రజలకు కావాల్సింది అరెస్టులు కాదు.. రోడ్లు! హెచ్చరికలు కాదు.. అభివృద్ధి! హామీలు కాదు.. పనులు!

అరెస్టయిన ముగ్గురు యువకుల విషయంలో చట్టప్రకారం న్యాయబద్ధమైన చర్యలు తీసుకోవడంతో పాటు, కొండపర్తి రహదారి నిర్మాణ పనులను తక్షణమే ప్రారంభించాలి. కాంట్రాక్టర్‌పై వచ్చిన కమిషన్ ఆరోపణలపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి. పోలీసుల వ్యవహారశైలిపైనా ఉన్నతాధికారులు సమీక్షించాలి. చివరగా ఒక్కటే ప్రశ్న.. ప్రజలు రోడ్లు అడిగితే అరెస్టులు చేసే పాలన కావాలా? లేక ప్రజల కష్టాలను గుర్తించి రోడ్లు నిర్మించే పాలన కావాలా? తెల్చు కోవాల్సింది ప్రజలేనేమో???

ప్రారంభానికి నోచుకోని బాలికల వసతి గృహం

- నిరుపయోగంగా ప్రభుత్వ భవనం అందుబాటులోకి ఎప్పుడూ వస్తుంది

ప్రజాకలం ప్రతినిధి మరిపెడ నవంబర్ 3

మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో విద్యార్థినుల సౌకర్యార్థం లక్షలాది రూపాయల ప్రభుత్వ నిధులతో నిర్మించిన మోడల్ స్కూల్ బాలికల వసతి గృహ భవనం పనులన్నీ పూర్తయినప్పటికీ ప్రారంభానికి నోచుకోకపోవడం చర్చనీయాంశంగా మారింది. భవనం నిర్మాణం పూర్తయి ప్రారంభానికి సిద్ధంగా కనిపిస్తున్నా, ఇప్పటివరకు విద్యార్థినులకు అందుబాటులోకి రాకపోవడంపై స్థానికంగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ప్రభుత్వం విద్యార్థినుల విద్యాభివృద్ధి, వసతి సౌకర్యాల కల్పన కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి భవనాలను నిర్మిస్తున్నప్పటికీ, నిర్మాణాలు పూర్తయిన తర్వాత వాటిని వినియోగంలోకి తీసుకురావడంలో ఎందుకు జాప్యం జరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి చదువుకునే పేద, మధ్యతరగతి కుటుంబాల విద్యార్థినులకు ఇలాంటి వసతి గృహాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. వసతి గృహం అందుబాటులోకి వస్తే దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థినులకు నివాస సౌకర్యం కలగడంతో పాటు చదువుపై మరింత దృష్టి సారించే అవకాశం ఉంటుంది. కానీ భవనం సిద్ధంగా ఉన్నప్పటికీ ప్రారంభం కాకపోవడంతో పిల్లలు చాలా ఇబ్బంది పడుతున్నారు ఇప్పటికే చలికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో రాకపోకలకి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన



పరిస్థితి వస్తుంది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్న పరిస్థితి

తక్షణమే అధికారులు స్పందించాలి

సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి వసతి గృహం ప్రారంభానికి అడ్డంకులేమిటో స్పష్టం చేయాలని స్థానికులు పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు. అవసరమైన సిబ్బంది నియామకం, మౌలిక సదుపాయాల కల్పన వంటి ప్రక్రియలు ఏమైనా పెండింగ్‌లో ఉంటే వాటిని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థినులకు వసతి గృహాన్ని అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేస్తున్నారు.ప్రభుత్వ నిధులతో నిర్మించిన భవనాలు కేవలం ప్రారంభోత్సవాల కోసం కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని, విద్యార్థినుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎల్నినో ఎఫెక్ట్.. యాసంగిలో వద్దు 'వరి'.. వేద్దాం 'ఆరుతడి'

- ప్రభుత్వ విప్ విజయరమణా రావు

- మండలంలో విస్తృతంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రాష్ట్రంలో సూపర్ ఎల్నినో ప్రభావం వల్ల భూగర్భ జలాలు అడుగంటుతున్న తరుణంలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. మంగళవారం పెద్దపల్లి మండలం పెద్దబొంకూరు, కొత్తపల్లి, మూలసాల, బోజన్నపేట,హనుమంతునిపేట, మారేడుగొండ, గుర్రాంపల్లి, చీకురాయి గ్రామాలలో పాటు పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు,చందపల్లిలలో ఐకేపీ, సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల ఏర్పడుతున్న కరువు ప్రభావంపై రైతన్నలు తీవ్రంగా ఆలోచించాలని కోరారు. యాసంగి సీజన్‌లో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున ఎక్కువ నీరు అవసరమయ్యే వరి పంటకు బదులుగా తక్కువ నీటితో సమృద్ధిగా దిగుబడినిచ్చే మొక్కజొన్న,శెనగ వంటి ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలని సూచించారు.రైతులు దళారుల బారినపడి మోసపోవద్దనే ఉద్దేశంతోనే గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలను విస్తృతంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ప్రభుత్వం సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా క్వింటాకు రూ. 500 బోనస్ అందిస్తోందని గుర్తుచేశారు.కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రెండు రోజుల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయని స్పష్టం చేశారు.ప్రతిపక్షాల అసత్య ఆరోపణలను నమ్మవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల శ్రేయస్సు పట్ల పూర్తి చిత్తశుద్ధితో పనిచేస్తోందని పేర్కొన్నారు.ధాన్యం సేకరణ ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా అత్యంత పారదర్శకంగా వ్యవహరించాలని,కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను,నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షుడు ముత్యాల నరేష్,జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రవీణ్ రెడ్డి,పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్ నూగిళ్ల మల్లయ్య,సింగిల్ విండో చైర్మన్,డైరెక్టర్లు,మున్సిపల్ కౌన్సిలర్లు,వివిధ గ్రామాల నర్పంచులు,ప్రజాప్రతినిధులు,రైతులు,కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖనిలో రాజకీయ దౌర్జన్యం

- మాజీ ఎమ్మెల్యే వీరంగం..క్రేన్ డ్రైవర్‌పై దాడి..సీఐ విధులకు ఆటంకం



పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా గోదావరిఖని కోర్టు చౌరస్తాలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చేపట్టిన అధికారిక చర్యలను అడ్డుకుంటూ రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్,ఆయన అనుచరులు తీవ్ర ఉద్రిక్తత సృష్టించారు.కోర్టు చౌరస్తా ప్రధాన రహదారి మధ్యలో ఉండటం వల్ల వాహనదారులకు తీవ్ర ఇబ్బందిగా మారి,నిత్యం ప్రమాదాలకు కారణమవుతోందన్న ఉద్దేశంతో అధికారులు ఫ్లైఓవర్ గ్లోబల్' విగ్రహాన్ని తొలగించే ప్రక్రియను ప్రారంభించారు.ఈ క్రమంలో మున్సిపల్ అధికారుల ఆదేశాలతో నిరుపేద కార్మికుడు క్రేన్ సహాయంతో తొలగింపు పనులు చేపడుతుండగా,విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తన అనుచర గణంతో కలిసి అక్కడికి చేరుకున్నారు.కనీస విచక్షణ లేకుండా,కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకునే ఉద్దేశంతో పనులను అడ్డుకోవడమే కాకుండా,విధుల్లో ఉన్న ఆ క్రేన్ డ్రైవర్‌పైకి ఏకపక్షంగా దూసుకెళ్లారు. కేవలం ఆదేశాలను పాటిస్తూ జీవనోపాధి కోసం పనిచేస్తున్న ఆ డ్రైవర్ ప్రాణాలు కాపాడుకునేందుకు ఎంతగా వేడుకుంటున్నా కనికరం చూపకుండా పిడిగుద్దులతో విరుచుకుపడి అమానుషంగా దాడి చేశారు. ఈ గందరగోళాన్ని అడ్డుకుని,శాంతిభద్రతలను అదుపులోకి తెచ్చేందుకు తక్షణమే అక్కడికి చేరుకున్న సీఐ ఇంద్రసేనారెడ్డి పట్ల కూడా వారు అత్యంత నిర్లక్ష్యంగా,దూకుడుగా వ్యవహరించారు. పోలీసుల విధులకు ఆటంకం కలిగిస్తూ,ఏకంగా సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మీదికే దౌర్జన్యంగా దూసుకెళ్లి బెదిరింపులకు దిగడంతో కోర్టు చౌరస్తా పరిసరాల్లో ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది.చట్టాన్ని గౌరవించి ఆదర్శంగా నిలవాల్సిన మాజీ ప్రజాప్రతినిధి, ఆయన అనుచరులు స్వయంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పోలీసుల ముందే ఇంతటి రౌడీయిజానికి పాల్పడటం తీవ్ర విమర్శలకు దారితీసింది.ప్రజల ప్రాణాలను రక్షించేందుకు అధికారులు చేస్తున్న పనులను సైతం రాజకీయం చేస్తూ, రక్షకభటులను సైతం లెక్కచేయకుండా చేసిన ఈ అరాచక ఘటనపై రామగుండం ప్రజలు,వివిధ వర్గాల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.ప్రజా శాంతికి విఘాతం కలిగించి,పేద కార్మికుడిపై దాడికి దిగిన బాధ్యులందరిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సర్వత్రా డిమాండ్ వినిపిస్తోంది.

ప్రాచీన కళల పరిరక్షణ ప్రశంసనీయం

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష - జానపద కళాకారులకు ప్రభుత్వ గుర్తింపు -కలెక్టర్ చేతుల మీదుగా ఐడీ కార్డుల అందజేత

పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) గ్రామీణ ప్రాచీన జానపద కళారూపాలను పరిరక్షిస్తూ మూడు దశాబ్దాలుగా కళాసేవ చేస్తున్న కళాకారులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి సముచిత గుర్తింపు దక్కింది.పెద్దపల్లి మండలం హన్మంతునిపేట గ్రామానికి చెందిన శ్రీ రామకృష్ణ కళా బృందం సేవా ట్రస్టు కళాకారులు గత ముప్పై ఏళ్లుగా చిరుతల రామాయణం,చిరుతల మహాభారతం వంటి అరుదైన పౌరాణిక కళారూపాలను నిరంతరం ప్రదర్శిస్తూ జానపద సంస్కృతిని కాపాడుతున్నారు.దీంతోపాటు గత పదేళ్లుగా భజన సంకీర్తనలు,వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.వీరి కళా సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ట్రస్టుకు చెందిన 20 మంది కళాకారులకు అధికారిక గుర్తింపు కార్డులను మంజూరు చేయగా,ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష చేతుల మీదుగా కళాకారులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాచీన జానపద కళారూపాలను భావితరాలకు అందిస్తూ,నిస్వార్థంగా సేవలందిస్తున్న కళాకారులను అభినందించారు.ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణ కళా బృందం సేవా ట్రస్టు ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొలిపాక సత్యం(సత్తి బాబు) మాట్లాడుతూ ప్రభుత్వం తమ సేవలను గుర్తించి గుర్తింపు కార్డులు అందించడంపై హర్షం వ్యక్తం చేశారు.ఈ ప్రక్రియకు సహకరించిన రాజబాబు,బయ్య కొమరయ్యలతో పాటు నిరంతరం



శ్రమిస్తున్న సీనియర్ కళాకారుడు కారుపాకల కనకయ్యకు బృందం తరపున కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్టు గౌరవ అధ్యక్షులు బయ్య కొమురయ్య, గౌరవ ఉపాధ్యక్షులు కారుపాకల కనకయ్య,అధ్యక్షులు నాగులమల్యాల వెంకటేశం,ఉపాధ్యక్షులు కందుల సదయ్య,ఆర్గనైజర్ గుర్రాల శంకర్,కోశాధికారి యాదగిరి రమేష్,కార్యదర్శి ఆరెపల్లి రాయలింగుతో పాటు కార్యవర్గ సభ్యులు కంది చంద్రయ్య, సురభి నందరావు, కందుల శ్రీనివాస్,గడ్డం అనిల్,ఎర్రం కుమార్,అడప సతీష్,కోమల్ల చేరాలు,బాలసాని శంకర్,తీగల గట్టేశం,దాసరి రాజేందర్,తీగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో కన్నీటి మొర

ఖాదీ కార్యాలయం వద్ద పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం!

పది రోజుల క్రితమే కుటుంబంతో కలిసి కలెక్టర్‌కు ఆత్మహత్యకు అనుమతి

కోరిన బాధితుడు.. షాపు ఖాళీ చేయించుకోలేక యజమాని ఆవేదన..

మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి నవంబర్ 3(ప్రజా కలం) మెట్‌పల్లిలో కలకలం షాపు ఖాళీ చేయించుకునే విషయంలో నెలకొన్న వివాదం చివరకు ఆత్మహత్యాయత్నానికి దారితీసింది. తన సొంత షావును ఖాళీ చేయించుకోలేకపోతున్నానని, అధికారుల చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ షాపు యజమాని పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మెట్‌పల్లి పట్టణంలో కలకలం రేపింది.మెట్‌పల్లిలోని ఖాదీ కార్యాలయంలో ఉన్న 26వ నంబర్ షాపు యజమాని గోవర్ధన్‌కు, ఆ షాపులో కొనసాగుతున్న కిరాయిదారుడికి మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతోంది. షాపును ఖాళీ చేయాలని కిరాయిదారుడిని కోరుతున్నా స్పందించడం లేదని గోవర్ధన్ వాపోతున్నారు. తాను స్వయంగా షావు నిర్వహించుకోవాలనుకుంటున్నప్పటికీ అవకాశం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనకు పది రోజుల క్రితం చోటుచేసుకున్న పరిణామం మరింత ప్రాధాన్యత సంతరించుకుంది.జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణికి కుటుంబసభ్యులతో కలిసి వెళ్లిన గోవర్ధన్ తమ సమస్యను పరిష్కరించలేకపోతే కుటుంబంతో సహా ఆత్మహత్య చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కలెక్టర్‌ను వేడుకున్నట్లు తెలిసింది. అప్పుడే తన సమస్య తీవ్రతను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పరిష్కారం లభించలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ప్రజావాణిలో కుటుంబంతో కలిసి మొరపెట్టుకున్నప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడం, తాజాగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంఅధికారుల స్పందనపై ప్రశ్నలు రేకెత్తిస్తోంది.

పోలీస్ స్టేషన్‌కు ఇరువర్గాలు

సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. గోవర్ధన్‌తో పాటు ఖాదీ కార్యాలయ సిబ్బంది, కమిటీ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి





విచారించారు. ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు. ఒక షాపు విషయంలో మొదలైన వివాదం ఆత్మహత్యాయత్నం వరకు చేరడం పట్టణంలో చర్చనీయాంశంగా మారింది. షాపు యాజమాన్య హక్కులు, కిరాయిదారుడి వ్యవహారం, సంబంధిత అధికారుల స్పందనపై సమగ్ర విచారణ జరిపి బాధితుడి సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

చిన్నారులకు అన్నప్రాశన..

పోషకాహారంపై అవగాహన



గద్వాల ప్రతినిధి, నవంబర్ 3 (ప్రజా కలం): గద్వాల పట్టణంలోని మున్సిపాలిటీ పరిధి 36వ వార్డు వడ్డేవీధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాన్ని వార్డు కౌన్సిలర్ కమ్మరి సునీత రాము మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాశన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 7 నెలల నుంచి 3 సంవత్సరాల వయస్సు గల చిన్నారులకు బాలామృతం, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు గుడ్లు, పాలు పంపిణీ చేశారు. చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సకాలంలో అందించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ కమ్మరి సునీత రాము మాట్లాడుతూ బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, తల్లి ఆరోగ్యంగా ఉంటే పుట్టే బిడ్డ కూడా ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ద్వారా ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు పునాది వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ షామిమా, ఆయా, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులపై పోలీసుల ఉక్కుపాదం



గద్వాల ప్రతినిధి, నవంబర్ 3 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం పెద్దపల్లి గ్రామంలో బెల్ట్ షాపులు, సిట్టింగ్‌లపై ఎస్సై కొండా శ్రీహరి ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఉలవ తిమ్మప్ప, బండి శీను వద్ద నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకుని రెండు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కొండా శ్రీహరి మాట్లాడుతూ గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అక్రమ మద్యం విక్రయాలకు పాల్పడవద్దని, ప్రజలు కూడా ఇలాంటి కార్యకలాపాలపై పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

అభివృద్ధి పైలాన్ కూల్చివేత దుర్మార్గం

- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

రామగుండం నియోజకవర్గంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే నియంతృత్వ పాలన సాగిస్తున్నారని,బీఆర్ఎస్ అభివృద్ధి ఆనవాళ్లను చెరిపేయాలని చూస్తే ఊరుకునేది లేదని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హెచ్చరించారు.గోదావరిఖని గాంధీనగర్‌లో బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన అభివృద్ధి పైలాన్ ను మున్సిపల్ అధికారులు దొంగచాటుగా కూల్చివేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేటీఆర్ నేతృత్వంలో రామగుండంలో చేపట్టిన కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు గుర్తుగాఆ పైలాన్ నిర్మించామని తెలిపారు.కాంగ్రెస్ ఎమ్మెల్యే రాజకీయ కక్షసాధిం పులో భాగంగానే అధికారులపై ఒత్తిడి తెచ్చి కూల్చివేయించారని,మున్సిపల్ అధికారులు ఎమ్మెల్యేకు తొత్తులుగా మారడం సిగ్గుచేటని మండిపడ్డారు. కట్టడాలు కూల్చినంత మాత్రాన ప్రజల గుండెల్లో ఉన్న కేసీఆర్ అభివృద్ధిని తుడిచిపెట్టలేరని స్పష్టం చేశారు.అక్రమ కూల్చివేతను అడ్డుకున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో పాటు నాయకులు మూల విజయ రెడ్డి,కౌశిక్ హరి, వ్యాళ్ళ హరీష్ రెడ్డి,మురళీధర్ రావులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తప్పుబట్టారు.అరెస్టు చేసిన వారందరినీ తక్షణమే,బేషరతుగా విడుదల చేయాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు.

లాంగ్ మెమో కోసం తల్లిదండ్రుల ఆవేదన

గద్వాల ప్రతినిధి, నవంబర్ 3 (ప్రజా కలం):గద్వాల పట్టణంలోని అబ్రహం స్కూల్‌లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థినికి లాంగ్ మెమో(స్టడీ సర్టిఫికెట్)అందించడం లేదనిఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.పాఠశాలకు చెల్లించాల్సిన ఫీజులన్నీ చెల్లించి నప్పటికీ ధ్రువపత్రం ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. లాంగ్ మెమో అందకపోవడంతో తమ కుమార్తె ఉన్నత చదువులకు ఆటంకం కలుగుతుందని, భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్నామని తల్లిదండ్రులు పేర్కొన్నారు.

కలెక్టర్, విద్యాశాఖ అధికారులు స్పందించాలి!

విద్యార్థిని భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి, ఈ వ్యవహారంపై విచారణ చేపట్టి న్యాయం చేయాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఆటంకం కలగకుండా సంబంధిత పాఠశాల యాజమాన్యాలకు తగిన సూచనలు జారీ చేయాలని కోరుతున్నారు. విద్యార్థుల విద్యా హక్కులకు భంగం కలగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు విజ్ఞప్తి చేస్తున్నారు.



గ్రామాల ఆరోగ్య పరిరక్షణలో
ఆశా కార్యకర్తల పాత్ర కీలకం

నవజాత శిశు సంరక్షణ, గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
ఆశా డే సమావేశంలో మండల వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి

ప్రజాకలం ప్రతినిధి । మరిపెడ । నవంబర్ 3

మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజారోగ్య పరిరక్షణ, నవజాత శిశువుల సంరక్షణ, గర్భిణుల ఆరోగ్యం, వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. ముఖ్యంగా నవజాత శిశువుల ఆరోగ్యం, సంరక్షణపై ఆశా కార్యకర్తలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని, తల్లులకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని తెలిపారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారికి క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు జరిగేలా చూడాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని చిన్నారులందరికీ వందశాతం రోగనిరోధక టీకాలు అందించేలా కృషి చేయాలని



పిలుపునిచ్చారు. అంటువ్యాధులు కాని దీర్ఘకాలిక వ్యాధుల (చీజన) గుర్తింపుతో పాటు క్షయ (టీబీ) వ్యాధిగ్రస్తులకు సకాలంలో మందులు అందేలా పర్యవేక్షించాలని తెలిపారు. అలాగే ఎల్‌నినో ప్రభావంతో చోటుచేసుకునే వాతావరణ మార్పులు, వాటి నేపథ్యంలో వచ్చే అవకాశం ఉన్న కాలానుగుణ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని, ముందస్తు నివారణ చర్యలపై గ్రామస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు లక్ష్మి కుమారి, మాధవి, ఏఎన్ఎంలు శ్రీదేవి, లలిత కుమారి, స్వప్న, హరిశ, కీర్తి, అశ్విని, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆశా ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదల సేవే లక్ష్యంగా ముందుకు సాగాలి: బహుజన నాయకులు



నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 3: నిరుపేదల సేవే లక్ష్యంగా 'చేయూత' స్వచ్ఛంద సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలతో ముందుకు సాగాలని బాల్కొండ నియోజకవర్గ బహుజన నాయకులు ఆకాంక్షించారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ మధు శేఖర్ జన్మదినాన్ని పురస్కరించుకుని బహుజన నాయకులు ఆయనకు ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. సమాజంలో వెనుకబడిన, నిరుపేద వర్గాలకు చేయూత సంస్థ అందిస్తున్న సేవలు అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో డాక్టర్ మధు శేఖర్ ఆధ్వర్యంలో ఈ సంస్థ మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి, పేద ప్రజల గుండె ల్లో నిలవాలని వారు ఆకాంక్షించారు. అనంతరం డాక్టర్ మధు శేఖర్ను నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు డి.ఎల్. మాల, మోర్తాడ్ డీఎస్పీ మండల అధ్యక్షుడు ఉమేష్ మహరాజ్, వీజీఓ మండల అధ్యక్షుడు పాలెపు రాము, మండల అధ్యక్షుడు అంగుళి మాలాజీ తదితర బహుజన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బాలుడి హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు
: నిజామాబాద్ పోక్సో కోర్టు సంచలన తీర్పు



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 03:

బాలలపై అఘాయిత్యాలు, నేరాలకు పాల్పడే వారికి చట్టం ముందు క్షమాపణ ఉండదని నిజామాబాద్‌లోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం మరోసారి నిరూపించింది. బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన 12 ఏళ్ల బాలుడి అదృశ్యం, హత్య కేసులో నిందితుడికి గౌరవనీయ న్యాయస్థానం జీవిత ఖైదు విధిస్తూ ఈరోజు (03-11-2026) చారిత్రాత్మక తీర్పు వెలువరించింది.కేసు వివరాలు:2024 సెప్టెంబర్ 11న బాల్కొండ మండలం చిట్వాపూర్ గ్రామానికి చెందిన బండి నరేందర్ అలియాస్ నరేందర్ (24), గణేష్ విగ్రహాలు చూపిస్తానని నమ్మించి అదే గ్రామానికి చెందిన 12 సంవత్సరాల బాలుడిని తన ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లాడు. రాత్రి అయినా బాలుడు ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు నిందితుడిని సంప్రదించగా, తాను కుమ్మరి సంఘం గణేష్ విగ్రహం వద్దే వదిలేశానని అబద్ధం చెప్పాడు. చుట్టుపక్కల వెతికినా బాలుడి ఆచూకీ లభించకపోవడంతో, సెప్టెంబర్ 12న బాలుడి తల్లి బాల్కొండ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు క్రైమ్ నంబర్ 108/2024గా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, నిందితుడు నరేందర్ బాలుడిని దారుణంగా హత్య చేసినట్లు పక్కా సాక్ష్యాధారాలతో నిరూపితమైంది.

న్యాయస్థానం విధించిన శిక్షలు:

ఈ కేసును (సెషన్స్ కేసు నంబర్ 86/2024) సుదీర్ఘంగా విచారించిన నిజామాబాద్ పోక్సో ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి శ్రీ డి. దుర్గాప్రసాద్ గారు నిందితుడు బండి నరేంద్రపై నేరం రుజువు కావడంతో బహిరంగ న్యాయస్థానంలో కింది విధంగా శిక్షలు ఖరారు చేశారు: 1. దీమీ సెక్షన్ 103(1) (హత్య) ప్రకారం: జీవిత ఖైదు మరియు రూ. 10,000 జరిమానా. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష. 2. దీమీ సెక్షన్ 238 (సాక్ష్యాధారాల నిరోధం) ప్రకారం: ఏడు సంవత్సరాల కఠిన జైలు శిక్ష మరియు రూ. 10,000 జరిమానా. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఆరు నెలల సాధారణ జైలు శిక్ష.

పోలీస్ యంత్రాంగానికి అభినందనలు:

ప్రభుత్వం తరఫున పోక్సో కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీ జి. నరసింహారెడ్డి గారు బలమైన వాదనలు వినిపించారు. నాటి బాల్కొండ ఎస్ఐ బి. నరేష్ ఖీ×= నమోదు చేయగా, అప్పటి ఆర్మూర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీధర్ రెడ్డి గారు అత్యంత సమర్థవంతంగా దర్యాప్తు జరిపి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ప్రస్తుత ఆర్మూర్ రూరల్ సీఐ జాన్ రెడ్డి, కోర్టు లైజన్ అధికారి టి. గోవింద్, కానిస్టేబుల్ ఆర్. సాయికుమార్, సీఎంఎస్ కానిస్టేబుళ్లు కేసు విచారణలో చురుగ్గా వ్యవహరించి సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా శ్రమించిన పోలీస్ అధికారులను, సిబ్బందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. బాలలపై నేరాలకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా సీపీ స్పష్టం చేశారు.

విద్యుత్ షాక్‌కు కార్మికుడి బలి..

- మృతుడి కుటుంబానికి గూడెం మధుసూదన్ రెడ్డి, యాదగిరి యాదవ్ భరోసా..
- పరిశ్రమ యాజమాన్యం, విద్యుత్ శాఖ నుంచి నష్టపరిహారానికి విజ్ఞప్తి..

పటాన్‌చేరు, నవంబర్ 3 (ప్రజా కలం) ప్రతినిధి

విద్యుత్ తీగలు తాకి 19 ఏళ్ల వలస కార్మికుడు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన పటాన్‌చేరు ప్రాంతంలో కలకలం రేపింది. మృతుడి కుటుంబాన్ని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గూడెం మధుసూదన్ రెడ్డి పరామర్శించి అండగా నిలిచారు. బీహార్‌కు చెందిన వినయ్ కుమార్ స్థానిక పారగాన్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తూ బండ్లగూడలో నివాసం ఉంటున్నాడు.మంగళవారం ఉదయం ఇంటిపై ఉన్న విద్యుత్ తీగలు తాకడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న గూడెం మధుసూదన్ రెడ్డి,మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్‌తో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతుడు పనిచేస్తున్న పారగాన్ పరిశ్రమ యాజమాన్యంతో చర్చించి



మానవతా దృక్పథంతో ఆర్థిక సహాయం అందించాలని కోరారు. అదేవిధంగా విద్యుత్ శాఖ తరఫున నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.మృతుడి అంత్యక్రియల ఖర్చుల కోసం ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు..

లక్ష్యం నిర్దేశించి పనులు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష




పెద్దపల్లి,నవంబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో విద్యా రంగానికి సంబంధించి చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో,త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు.మంగళవారం కలెక్టరేట్‌లో టీజీ ఇడబ్ల్యుఐడిసి ఆధ్వర్యం లో జరుగుతున్న పనుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేసి పనులను వేగవంతం చేయాలన్నారు.జిల్లా కేంద్రంలోని స్విమ్మింగ్ పూల్,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ తో పాటు విద్యాశాఖ చేపట్టిన నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షించాలని స్పష్టం చేశారు.అనంతరం పెద్దపల్లి ఐటీఐ ప్రాంగణంలో నిర్మిస్తున్న స్విమ్మింగ్ పూల్ పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించి,మిగిలిన పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో టీజీఇడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఈఈ రామకృష్ణ,ఇతర అధికారులు పాల్గొన్నారు.

బావిలో ఈత కొడుతూ ప్రమాదశావత్తు యువకుడు మృతి



గొల్లపల్లి నవంబర్ 03 ప్రజాకలం ప్రతినిధి :గొల్లపల్లి మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన ఆడెపు మధు (28) అనే యువకుడు బావిలో ఈత కొడుతూ ప్రమాదశావత్తు మృతి చెందాడు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాఘవపట్నం గ్రామానికి చెందిన ఆడెపు మధు వాకింగ్ కు వెళ్తున్నానని కుటుంబ సభ్యులకు తెలియజేసి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. వాకింగ్ అనంతరం గంగదేవిపల్లి గ్రామ శివారులో గల వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు బావిలోని రాళ్లు అతని తలకు, ముఖానికి బలంగా తగలడంతో తీవ్ర గాయాలై, ఊపిరాడక నీటిలో మునిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జమ్ములమ్మ ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తాం: దేవాదాయ శాఖ కమిషనర్



గద్వాల ప్రతినిధి, నవంబర్ 3 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం జమ్మిచేడు గ్రామంలోని స్వయంభువుగా వెలసిన శ్రీ జమ్ములమ్మ అమ్మవారిని దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు దంపతులు మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి ఈ. పురేందర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది కమిషనర్ దంపతులకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికి, శాలువాలతో సత్కరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకున్న కమిషనర్ దంపతులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.అనంతరం ఈఓ పురేందర్ కుమార్ అమ్మవారి చరిత్ర, ఆలయ విశిష్టత, భక్తుల విశ్వాసాలు, ఆలయ ప్రాముఖ్యతను కమిషనర్‌కు వివరించారు. ప్రతి మంగళ, శుక్రవారాల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుంటారని తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాలని కమిషనర్ సూచించారు. ప్రతిపాదనలను పరిశీలించి, ఆలయ అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ ఈ. పురేందర్ కుమార్, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికల భద్రతపై పోలీసుల అవగాహన

గద్వాల ప్రతినిధి, నవంబర్ 3 (ప్రజా కలం): జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికల భద్రత, సాధికారతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికా, శిశు సాధికారత మరియు భద్రత క్లబ్ ఏర్పాటులో భాగంగా ఉపాధ్యాయులు మణెమ్మ, గీత ఆధ్వర్యంలో ఎస్సై శ్రీహరి సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా కానిస్టేబుల్ మౌనిక, కానిస్టేబుళ్లు ఇస్మాయిల్, తిప్పారెడ్డి, సుధాకర్ పాల్గొని విద్యార్థులకు అవగాహన కల్పించారు.



ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ మౌనిక గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మహిళల అక్రమ రవాణా, బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాలపై వివరించారు. మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించేందుకు విద్యే ప్రధాన ఆయుధమని పేర్కొన్నారు. విద్యార్థినులు చదువును నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ మాట్లాడుతూ ప్రభుత్వం బాలికల విద్య కోసం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజేశ్వర్ రెడ్డి, సుజాత, భాస్కర్, శుభ, వరలక్ష్మి, రమణమ్మ, సుహాసిని తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు రక్షణ కోసం ఉద్యమంలో చేరాలి- ఎడిటర్ గంగాధర్

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) నవంబర్ 3:

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ సమాధి ఐన చైత్యభూమికి హైదరాబాద్ నుంచి సీనియర్ జర్నలిస్ట్, మాజీ సాక్షి మహారాష్ట్ర ఎడిటర్ సిర్పా గంగాధర్ ముంబై చేరుకొని అంబేద్కర్ కు నివాళి అర్పించారు. ముంబై తెలంగాణ జాయింట్ యాక్షన్ కమిటీ (ఎంటిజెఏసి) కి కోఆర్డినేటర్ గా కూడా వ్యవహరిస్తున్నారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ బాబాసాహెబ్ అంబేద్కర్ గారు అనేక దేశాల రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి, యావత్ దేశ నాగరికుల కోసం ఓ బ్రహ్మాండమైన "భారత రాజ్యాంగం" రూపొందించారు. అందులో ప్రతి భారత పౌరుడికి అమూల్యమైన ఓటు హక్కు కల్పించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఎన్నికల్లో నేడు స్పెషల్ రివిజన్ ఇంటెన్సివ్ (ఎస్.ఆర్.ఐ) పేరిట కేంద్ర ప్రభుత్వం పదముడున్నర కోట్ల మంది ఓటు హక్కును కాలరశారని ఆవేదన వెలిబుచ్చారు. అయితే ఓటు ను దొంగలించడం క్రూర అన్యాయమని ఆయన అన్నారు. అయితే దేశ ప్రజలు ఈ అన్యాయానికి విరుద్ధంగా పోరాట చేస్తున్న వారికి సెల్యూట్ చెప్పారు. ఈ ఉద్యమంలో ప్రతి దేశ పౌరుడు పాల్గొనాలని, ఎస్.ఆర్.ఐ రద్దు కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం అందరూ ఉద్యమంలో చేరాలని గంగాధర్ పిలుపునిచ్చారు.



ఇంద్రన్న కాలనీలో ఇందిరమ్మ మహిళా భవనం నిర్మించాలి: సీపీఐ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) ఇంద్రన్న కాలనీలో ఇందిరమ్మ మహిళా భవనం నిర్మించాలని సీపీఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం బాచుపల్లి మండలం, నిజాంపేట్ సర్కిల్ పరిధి ఇంద్రన్న కాలనీ వాసుల అవసరానికి ఇందిరమ్మ మహిళా భవన్ కమిటీ హాల్ కావాలని బాచుపల్లి మండల కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... గత పదిహేను సంవత్సరాల నుండి స్థానిక ప్రజలతో ఇంద్రన్న కాలనీ కల్చరల్ ఉ వెల్ఫేర్ అసోసియేషన్ తో కలిసి ఆ కాలనీ వాసిగా, కాలనీ అధ్యక్షునిగా అనేక సార్లు కలెక్టర్ కి, ఆర్డీఓకి, మండల తహసీల్దార్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. వాణిరెడ్డి బాచుపల్లి మండల తహసీల్దార్ గా ఉన్నపుడు కలెక్టర్ నుండి సర్వే చేయమని ఆర్డర్ పంపారు. సర్వేయర్ గా ఉన్న సింధుకి సర్వే చేయమని మెమో ఇచ్చారు. సింధు కాలయాపన చేసింది కానీ ఇప్పటి వరకు సర్వే చేయలేదన్నారు. కొత్త ఓటు నమోదు కార్యక్రమం వల్ల ఆలస్యమైందని గుర్తు చేశారు. ఇప్పుడైనా ఇందిరమ్మ మహిళా భవన్ నిర్మాణం చేసే విధంగా సర్వే చేసి నిర్మాణం పనులు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సీపీఐ నాయకులు పొన్నకంటి దస్తగిరి, నర్సింహా, తిరుపతిలు పాల్గొన్నారు.



విద్యుత్ సమస్యలు పరిష్కరించండి: శేషచారీ

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) షాపూర్ నగర్ సెక్షన్ సబ్ స్టేషన్ జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియా మంగళవారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా గాలి లేదా వర్షం వచ్చినప్పుడు విద్యుత్ సరఫరా తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ప్రస్తుతం ఉన్న పాత మెటల్ వైర్లు చెట్లు కొమ్మలకు తగలడం తరచూ విద్యుత్ గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. దీంతో కాలనీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు.

ఈ లైన్లు 40సంవత్సరాల క్రితం వేశారు. కాబట్టి కొత్త లైన్లు వేయాలని కోరారు. గతంలో ఉన్న S Eకి, డిఇ ADE ఈసమస్యపై వినతిపత్రం అందజేసిన్నట్లు ఉన్నతాధికారులు ఇవ్వడం జరిగింది. దీనిపై దృష్టి సారించి AB కేబుల్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ట్రాన్స్ఫార్మర్ల దగ్గర తరచూ మెయింటినెన్స్ అయ్యేవిధంగా చూడాలని కోరుచున్నాము. కరెంటు వర్షం వచ్చినప్పుడల్లా ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి స్పందించిన జజు చీఫ్ ఇంజనీర్ రమేష్, మేడ్చల్ రాజు సూపర్డెంట్ ఇంజనీర్ జ్ఞానేశ్వర్, డివిజనల్ ఇంజనీర్ శ్రీనివాస్ అసిస్టెంట్ డిప్యూటీ ఇంజనీర్ వీరేశం, రాజు కృష్ణ సమక్షంలో ఎస్ఆర్ నాయక్ నగర్ కు ప్రత్యేకంగా లైన్ ఏర్పాటు చేస్తామని రానున్న రోజుల్లో కరెంటు ప్రాబ్లం రాకుండా చూస్తామని తాత్కాలికంగా మెయింటెనెన్స్ చర్యలు చేపడతామని చీఫ్ ఇంజనీర్ రమేష్ హామీ ఇచ్చారు. ఎస్సార్ నాయక్ నగర్ మాజీ ప్రెసిడెంట్ ఆలూరీ వెంకట శేషచారి, సీనియర్ బిఆర్ఎస్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, ఎస్ఆర్ నాయక్ నగర్ మాజీ జనరల్ సెక్రెటరీ వెంకటశ్యామ్, కామేశ్వర శర్మ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదు చేసుకోవాలి--మండల తహసిల్దార్ పి.రాధ

ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా హెల్ప్ డెస్క్ మండల తాసిల్దార్ కార్యాలయంలో ఏర్పాటు

బొమ్మలరామారం,నవంబర్ 03 (ప్రజా కలం)

తహశీల్దార్ బొమ్మలరామారం మండల కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ఓటర్ నమోదు (Form 18) కొరకు మంగళవారం రోజున మండల తాహసిల్దార్ పి.రాధ ఆధ్వర్యంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ ఖమ్మం-వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి జిల్లాలోని అర్హులైన పట్టభద్రులు తమ ఓటును నమోదు చేసుకోవాలని బొమ్మలరామారం మండల తాహసిల్దార్ రాధ కోరారు. 2023 నవంబర్ 1వ తేదీ నాటికి గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా డిప్లొమా పూర్తి చేసి, కనీసం మూడేళ్లు పూర్తయిన వారు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు నమోదుకు అర్హులని తెలిపారు.అర్హత కలిగిన పట్టభద్రులు అవసరమైన ధ్రువపత్రాలతో ఫారం-18 ద్వారా నవంబర్ 6వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఓటరు నమోదు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన వివరాలు, ధ్రువపత్రాలను సమర్పించాలని కోరారు. పట్టభద్రుల సమస్యలను శాసన మండలిలో ప్రస్తావిస్తూ వారి హక్కుల కోసం పోరాడే ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం ఎమ్మెల్సీ ఎన్నికల ద్వారా లభిస్తుందని పేర్కొన్నారు.

ప్రతి అర్హత కలిగిన పట్టభద్రుడు ఓటరు జాబితాలో తన పేరును నమోదు చేసుకుని ప్రజాస్వామ్య హక్కు అయిన ఓటును వినియోగించుకోవాలని తాహసిల్దార్ రాధ పిలుపునిచ్చారు.పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఓటరు నమోదు ప్రక్రియలో పాల్గొని ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల డిప్యూటీ తాహసిల్దారు సునీల్ కుమార్,సీనియర్ అసిస్టెంట్ శోభ రాణి,మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్లు కొండం వెంకట్ రెడ్డి, నరేష్ నాయక్, ప్యారారం గ్రామ సర్పంచ్ మచ్చ పద్మ, సోలిపేట గ్రామ సర్పంచ్ చిలువేరు పావని,రామస్వామి తండ సర్పంచ్ దిరావత్ సునీత, జిపిఓ,తదితరులు పాల్గొన్నారు

బాల్యవివాహాలతో జీవితాలు చిన్నాభిన్నం.

- ఆడపిల్లల చదువుకు పెళ్లి అడ్డుకాకూడదు.
- బాలల హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: బేగంపేట ఎస్ఐ టి.రేణుక.



దుబ్బాక ప్రజాకలం నవంబర్ 03.

బాల్యవివాహాలతో చిన్నారుల భవిష్యత్తు అంధకారంలోకి నెట్టబడుతుందని, ఆడపిల్లల చదువుకు పెళ్లి అడ్డుకాకూడదని బేగంపేట ఎస్ఐ టి.రేణుక, బాలల సంరక్షణ అధికారి బి.రాజు, ఆశ్రిత స్వచ్ఛంద సంస్థ సిద్దిపేట జిల్లా కో-ఆర్డినేటర్ బండకాడి గణేష్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్, డీసీపీవో ఆదేశాల మేరకు రాయపోల్ మండలం బేగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలన చట్టం--2006పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్లు నిండని బాలికలకు, 21 ఏళ్లు నిండని బాలురకు వివాహం చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు. బాల్యవివాహాలు జరిపించే వారితో పాటు సహకరించే వారు, తెలిసి కూడా అధికారులకు సమాచారం ఇవ్వని వారు సైతం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. చిన్న వయసులో వివాహాలు జరగడం వల్ల బాలబాలికలు మానసికంగా, శారీరకంగా ఇబ్బందులు ఎదుర్కొంటారని వివరించారు. సోషల్ మీడియా ద్వారా అపరిచితులతో పరిచయాలు పెంచుకొని ప్రేమ, పెళ్లి పేరుతో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని పట్టుదలతో చదివి జీవితంలో స్థిరపడాలని పిలుపునిచ్చారు. ఎక్కడైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే చైల్డ్‌లైన్ 1098కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం 'చైల్డ్ మ్యారేజ్ ఫ్రీ భారత్' గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయు రాలు ప్రమీల, గ్రామ సర్పంచ్ మద్ద గీతా ప్రవీణ్, సీఆర్పీ యాదగిరి, ఉపాధ్యాయ సిబ్బంది, కమ్యూనిటీ సోషల్ వర్కర్ వీణ తదితరులు పాల్గొన్నారు.

అనాజీపూర్ విద్యార్థుల బస్సు సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుల వినతి.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేత.



దుబ్బాక ప్రజాకలం నవంబర్ 03.

అనాజీపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థులతో కలిసి గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి పాఠశా లలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ప్రతిరోజూ ఇబ్బం దులు ఎదుర్కొంటున్న విషయాన్ని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజకొండ యాదగిరి, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ జాఫర్ పాషా డిపో మేనే జర్ దృష్టికి తీసుకె ళ్లారు. అదేవిధంగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఈ సమస్య పై స్పందించి డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేం దుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో డిపో మేనేజర్ సంబంధిత అధికా రులను అదే రోజు అనాజిపూర్ గ్రామా నికి పంపించి బస్సు రాకపోక లకు అనువైన మార్గం, రూట్‌ను పరిశీలిం చాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ నాయకులు నీలా కిష్ట య్య, వార్డు సభ్యులు యాదగిరి, మల్లేశం, సర్పంచ్ అభ్యర్థి కర్రోని యాద గిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నారుల విద్యకు ప్రీ ప్రైమరీ పాఠశాలలు పునాది.

దౌల్తాబాద్ మండల విద్యాధికారి గజ్జల కనకరాజు.



దుబ్బాక ప్రజాకలం నవంబర్ 03.

చిన్నారుల్లో చిన్నతనం నుంచే విద్యపై ఆసక్తి, నేర్చుకునే నైపుణ్యాలు, సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రీ ప్రైమరీ విద్య ఎంతో దోహదపడుతుందని మండల విద్యాధికారి గజ్జల కనకరాజు అన్నారు. గొడుగుపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రీ ప్రైమరీ పాఠశాలను గ్రామ సర్పంచ్ మద్దెల వనజ స్వామితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ దశలో పిల్లలకు ఆటపాటలు, కథలు, పాటలు, చిత్రలేఖనం వంటి సరదా కార్యక్రమాల ద్వారా బోధించడం వల్ల పిల్లల్లో భాషా పరిజ్ఞానం, ఆలోచనా శక్తి, సామాజిక నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. చిన్నారులు పాఠశాల వాతావరణానికి అలవాటు పడటంతో పాటు ప్రాథమిక విద్యకు అవసరమైన పునాది ఏర్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మద్దెల స్వామి, ఉపసర్పంచ్ దుర్గని దీపిక, మధుసూదన్, ఉపాధ్యాయులు మనోజ్, శ్రీనివాస్ రెడ్డి, వార్డు సభ్యులు నట్ట లింగం, నల్ల అంజనేయులు, యూత్ కాంగ్రెస్ కార్యదర్శి భాను శేఖర్ రెడ్డి, నల్ల మల్లేష్, మైపాల్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు రేఖ, నాగరాణి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రూ.50 లక్షల జాక్‌పాట్..

- గీతం జాతీయ ఆవిష్కరణల పోటీ..
యువతకు భారీ బహుమతులు..
- ఈ నెల 7లోగా దరఖాస్తులు..
డిసెంబర్ 11న జాతీయ తుది పోటీలు..

పటాన్‌చేరు, నవంబర్ 3 (ప్రజా కలం) ప్రతినిధి

యువతలోని సృజనాత్మక ఆలోచనలను ప్రోత్సహించి, వాటిని విజయవంతమైన వ్యాపార ఆవిష్కరణలుగా తీర్చిదిద్దేందుకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం జాతీయ స్థాయిలో ఆరవ ఆవిష్కరణల సవాలు--2026ను నిర్వహిస్తోంది. ఇందులో యువ ఆవిష్కర్తలకు రూ. 50 లక్షల వరకు నగదు పురస్కారాలు అందించనుంది. గీతం వెంచర్ అభివృద్ధి కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలో 10 నుంచి 12వ తరగతి విద్యార్థులు,డిగ్రీ విద్యార్థులు, 2025 నుంచి పట్టభద్రులైన యువత పాల్గొనవచ్చు. జూనియర్, సీనియర్ విభాగాల్లో జరిగే పోటీల్లో వ్యవసాయం, వైద్యం, పర్యావరణం, ఆధునిక సాంకేతికత, క్రీడలు తదితర రంగాల్లో వినూత్న ఆలోచనలను ఆహ్వానిస్తున్నారు ఎంపికైన వారికి నగదు బహుమతులతో పాటు నిపుణుల మార్గదర్శకత్వం,వ్యాపార శిక్షణ, కొత్త సంస్థల స్థాపనకు సహకారం,ఆరు నెలల పాటు ఇంక్యుబేషన్ అవకాశం కల్పిస్తారు. ఈ నెల 20, 21 తేదీల్లో అర్ధ తుది పోటీలు ఆన్‌లైన్‌లో నిర్వహించి, డిసెంబర్ 11న గీతం హైదరాబాద్ ప్రాంగణంలో జాతీయ తుది పోటీలు జరపనున్నారు. ఆసక్తి గల యువత ఈ నెల 7వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 90630 65811, 83283 34930 నంబర్లను సంప్రదించవచ్చు. gic@gitam.eduకు ఈ-మెయిల్ చేయవచ్చు..

చిన్నకంజర్లలో ధాన్యం కొనుగోళ్లు షురూ

- తుఫాన్ వేళ రైతులకు ఇబ్బందులు రాకుండా టార్పాలిన్ల ఏర్పాటు..
-బోనస్ బకాయిలపై ప్రభుత్వానికి ఎమ్మెల్యే జీఎంఆర్ డిమాండ్..

పటాన్‌చెరు, నవంబర్ 3 (ప్రజా కలం) ప్రతినిధి

వరి రైతులకు మద్దతు ధర అందించడంతో పాటు, దళారుల బారిన పడకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారానే ధాన్యం విక్రయించాలని పటాన్‌చెరు



ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సూచించారు. ఇంద్రేశం మున్సిపల్ పరిధిలోని చిన్నకంజర్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వర్షాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ నేపథ్యంలో ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేయాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే గోదాములకు తరలించాలని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారికి ఫోన్ ద్వారా సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి ప్రభుత్వం నిర్ణీత గడువులోగా డబ్బులు చెల్లించాలని కోరారు. రైతులకు రావాల్సిన బోనస్ బకాయిల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ప్రమీల, డీసీసీబీ డైరెక్టర్ రాఘవేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు వెంకట్ రెడ్డి, అంతిరెడ్డి, శ్రీనివాస్, రామచందర్, వెంకటేష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు..

క్యాన్సర్ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం

-మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ఎల్ఓసీ అందజేత

మల్కాజిగిరి, నవంబరు 3 (ప్రజా కలం ప్రతినిధి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద కుటుంబానికి చెందిన ఉస్మాన్ అలీకి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేశారు.మౌలాలి ఆర్టీసీ కాలనీ పరిధిలోని శివానంద్ నగర్‌కు చెందిన ఉస్మాన్ అలీకి నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించేందుకు సుమారు రూ.లక్ష ఖర్చవుతుందని వైద్యులు తెలియజేశారు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం మంజూరుకు సంబంధించిన ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందేలా తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మౌలాలి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, ప్రధాన కార్యదర్శి సలీం, సీనియర్ నాయకుడు ఫారూఖ్, జిల్లా కార్యదర్శి మందా భాస్కర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రేమ్ కుమార్, చంద్రకాంత్, మల్కాజిగిరి యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, మౌలాలి మైనారిటీ అధ్యక్షుడు షకీల్, పాండురంగాచారి, బాబా ప్రవీణ్ తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



గొట్టెలగడ్డ తండాలో ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

గ్రామ సర్పంచ్ విస్లావత్ శ్రీనివాస్ నాయక్

కందుకూరు, నవంబర్ 4, (ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం గొట్టెలగడ్డ తండా గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీశ్రీశ్రీ ఆంజనేయ స్వామి దేవాలయ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం ఘనంగా జరిగింది.గ్రామ సర్పంచ్ విస్లావత్ శ్రీనివాస్ నాయక్ చేతుల మీదుగా, మంగళవారం రోజున యజ్ఞ హోమాలు, ప్రత్యేక పూజల నడుమ స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.



15 ఏళ్ల కల సాకారం:

గత 15 సంవత్సరాలుగా గొట్టెలగడ్డ తండా గ్రామంలో ఆంజనేయ స్వామి గుడిని నిర్మించుకోవాలనేది గ్రామస్తుల చిరకాల లక్ష్యం. గ్రామస్తులందరి సహకారంతో, విరాళాలతో ఎట్టకేలకు ఆ కల నెరవేరి ఆలయ నిర్మాణం పూర్తయింది. ఈ ప్రతిష్టాపన కార్యక్రమం మాజీ సర్పంచ్ ఇంజమూరి రామచంద్రారెడ్డి గారి పర్యవేక్షణలో జరగగా, చైర్మన్ కొర్ర రాజు, అధ్యక్షుడు జర్పుల రవి, ఉపాధ్యక్షుడు కేతావత్ కిరణ్, ప్రధాన కార్యదర్శి కొర్ర హరిలాల్, కార్యదర్శి మూడావత్ గోవర్ధన్, కోశాధికారి కొర్ర రమేష్, సలహాదారుడు జర్పుల రమేష్ తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీబీజీ--రామ్ జీ పనితీరుపై సమీక్ష

పీఎంపవై పథకం అమలుపై పరిశీలన

బీబీనగర్, నవంబర్ 03 (ప్రజాకలం): జిల్లా జెడ్పీ డిప్యూటీ సీఈఓ సీహెచ్. శ్రీనివాస్ మంగళవారం బీబీనగర్ మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలో వీబీజీ--రామ్ జీ పథకం అమలుకు




సంబంధించి సిబ్బంది నిర్వహిస్తున్న విధులు, పనితీరుపై సంబంధిత అధికారి వై. శ్రీనివాసరెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పథకం కింద చేపడుతున్న పనుల పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఆరా తీశారు.అదేవిధంగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన (పీఎంఏవై) పథకం అమలు తీరును పరిశీలించారు. లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు, నిర్మాణాల ప్రస్తుత స్థితిగతులు, పథకం పురోగతికి సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో సిబ్బంది పనితీరును సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఈసీ, టీఏలు పాల్గొన్నారు.

అనారోగ్యంతో బాధపడుతున్న బీజేపీ సీనియర్ నాయకుడు లింగారెడ్డికి పరామర్శ

పార్టీ అండగా ఉంటుంది.. అవసరమైన సహాయం అందిస్తా: ఈసం రాకేష్

మల్కాజిగిరి, నవంబరు 3 (ప్రజా కలం ప్రతినిధి): గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న భారతీయ జనతా పార్టీ గౌతమ్ నగర్ డివిజన్ సీనియర్ నాయకుడు లింగారెడ్డిని, ఆయన కుమారుడు మధుకర్ రెడ్డిని బీజేపీ గౌతమ్ నగర్ డివిజన్



అధ్యక్షుడు ఈసం రాకేష్ మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈసం రాకేష్ మాట్లాడుతూ, అనారోగ్యంతో బాధపడుతున్న లింగారెడ్డికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైన సమయంలో పార్టీ తరపున, తన వంతుగా అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. పార్టీ కోసం సేవలందించిన సీనియర్ నాయకులకు అండగా నిలవడం తమ బాధ్యత అని పేర్కొన్నారు. ఈ పరామర్శ కార్యక్రమంలో పెంటన్న, మనోజ్ పాల్గొన్నారు.

అనాజీపూర్ విద్యార్థుల బస్సు సమస్య పరిష్కారానికి కాంగ్రెస్ నాయకుల వినతి.

ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేత.

దుబ్బాక ప్రజాకలం నవంబర్ 03. అనాజీపూర్ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు విద్యార్థులతో కలిసి గజ్వేల్--ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. గ్రామం నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సు సౌకర్యం లేక ప్రతిరోజూ ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు రాజకొండ యాదగిరి, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ జాఫర్ పాషా డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఈ సమస్యపై స్పందించి డిపో మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో డిపో మేనేజర్ సంబంధిత అధికారులను అదే రోజు అనాజీపూర్ గ్రామానికి పంపించి బస్సు రాకపోకలకు అనువైన మార్గం, రూట్‌ను పరిశీలించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నీలా కిష్టయ్య, వార్డు సభ్యులు యాదగిరి, మల్లేశం, సర్పంచ్ అభ్యర్థి కర్రోని యాదగిరి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.





క్యాన్సర్ బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.లక్ష ఆర్థిక సాయం

మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ఎల్ఓసీ అందజేత

మల్కాజిగిరి, నవంబరు 3 (ప్రజా కలం ప్రతినిధి): క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద కుటుంబానికి చెందిన ఉస్మాన్ అలీకి వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించేందుకు కాంగ్రెస్ నాయకులు కృషి చేశారు.మౌలాలి ఆర్టీసీ కాలనీ పరిధిలోని శివానంద్ నగర్‌కు చెందిన ఉస్మాన్ అలీకి నిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స చేయించేందుకు సుమారు రూ.లక్ష ఖర్చవుతుందని వైద్యులు తెలియజేశారు.

ఈ నేపథ్యంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.లక్ష ఆర్థిక సాయం మంజూరుకు సంబంధించిన ఎల్ఓసీని అందజేశారు. ఈ సందర్భంగా బాధితుడిని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్సకు అవసరమైన ఆర్థిక సహాయం అందేలా తమ వంతు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో మౌలాలి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకన్న, ప్రధాన కార్యదర్శి సలీం, సీనియర్ నాయకుడు ఫారూఖ్, జిల్లా కార్యదర్శి మందా భాస్కర్, జిల్లా సంయుక్త కార్యదర్శి ప్రేమ్ కుమార్, చంద్రకాంత్, మల్కాజిగిరి యువజన కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ అజయ్, మౌలాలి మైనారిటీ అధ్యక్షుడు షకీల్, పాండురంగాచారి, బాబా ప్రవీణ్ తదితరులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మహా సైకిల్ యాత్ర బృందానికి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఘన స్వాగతం

- కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మేడిగడ్డ నుంచి 400 కిలోమీటర్ల సైకిల్ యాత్ర

- కాంగ్రెస్ పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు: వంటేరు



గజ్వేల్ నియోజకవర్గం, నవంబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి):

తెలంగాణలో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ గోదావరిఖనికి చెందిన మాజీ కార్పొరేటర్ బొడ్డు రవీందర్ ఆధ్వర్యంలో చేపట్టిన మహా సైకిల్ యాత్ర బృందానికి గజ్వేల్‌లో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఘన స్వాగతం పలికారు.మేడిగడ్డ నుంచి ప్రారంభమైన ఈ సైకిల్ యాత్రలో బొడ్డు రవీందర్‌తో పాటు మొత్తం 15 మంది పాల్గొంటున్నారు.

సుమారు 380 కిలోమీటర్లు ప్రయాణించి సోమవారం గజ్వేల్‌కు చేరుకున్న బృందానికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వంటేరు ప్రతాప్‌రెడ్డి స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణలో రైతులు, వ్యాపారులు, నిరుద్యోగులు,ఉద్యోగులు, మహిళలు, విద్యార్థులు సహా అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యుత్, సాగునీటి సమస్యల కారణంగా వ్యవసాయం దెబ్బతింటోం దని, పెట్టుబడులు కూడా తిరిగి రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించడం లేదని ఆరోపించారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలకే ప్రాధాన్యత ఇస్తున్నారని విమర్శించారు.కేసీఆర్ పదేళ్ల పాలనలో కాళేశ్వరం, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయకసాగర్ వంటి ప్రాజెక్టులను నిర్మించి సాగునీటి సౌకర్యాలను విస్తరించారని గుర్తుచేశారు. 24 గంటల విద్యుత్ సరఫరా,రైతుబంధు, రైతుబీమా,కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాల ద్వారా ప్రజలకు సంక్షేమ ఫలాలు అందించారని పేర్కొన్నారు. తెలంగాణలో మళ్లీ కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని ఆయన అన్నారు.మేడిగడ్డ వద్ద కన్నెపల్లి పంప్‌హౌస్‌ను ప్రారంభించి, మల్లన్నసాగర్, కొండపోచమ్మసాగర్,రంగనాయకసాగర్ వంటి ప్రాజెక్టులను నింపి రైతులకు సాగునీరు అందించాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. రైతులు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని పేర్కొన్నారు.కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించకుండా అధికార పార్టీ నాయకులు పరస్పర విమర్శలకు దిగుతున్నారని ఆరోపించారు.మేడిగడ్డ నుంచి ప్రారంభమైన ఈ మహా సైకిల్ యాత్ర మరుసటి రోజు మధ్యాహ్నం 12 గంట లకు కేసీఆర్ నివాసానికి చేరుకోనుందని తెలిపారు. సుమారు 400 కిలోమీటర్ల ప్రయాణంలో ప్రజలు, విద్యార్థులు, యువకులు, వ్యాపారులు, రైతులు ఎదుర్కొం టున్న సమస్యలు,తమ అనుభవాలను కేసీఆర్‌కు వివరించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్‌పర్సన్ పద్మాబాయి నర్సింగరావు,పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు బొగ్గుల స్వప్న సురేష్,మన్నె రూపా వెంకటేష్, మరికంటి భాగ్యలక్ష్మి కనకసేన,నాయకులు అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ నగర్ ఫేజ్-1 వెస్ట్ పార్ట్ డ్రైనేజీ సమస్యకు వారంలో పరిష్కారం

- ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి



మహేశ్వరం, నవంబర్ 03,(ప్రజా కలం)

మహేశ్వరం నియోజకవర్గం, బడంగ్‌పేట్ సర్కిల్-16, నాదర్‌గుల్ డివిజన్-57 పరిధిలోని విశాఖ నగర్ ఫేజ్-1 వెస్ట్ పార్ట్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, పార్క్ ఫినిషింగ్, రోడ్ల సమస్యలపై ఏఐసీసీ విచార్ విభాగ్ కోఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి గారు పర్యటించారు.కాలనీ వాసుల ఆహ్వానం మేరకు కాలనీని సందర్శించిన ఆయన, స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఈ సమస్యలు ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయని, పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైనేజీ సమస్యను తామే స్వయంగా పరిష్కరించుకునేందుకు ప్రయత్నించినా, ఈ ప్రాంతం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ అధికారులు అడ్డుకుంటున్నారని రాఘవేందర్ రెడ్డి గారికి వివరించారు.ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ "బడంగ్‌పేట్ సర్కిల్-16 పరిధిలో కొందరు అధికారులు ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తున్నారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పరిష్కారం కాకపోవడం బాధాకరం. అధికారులు బాధ్యతగా స్పందించాలి" అని అన్నారు.కాలనీ వాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ సమస్యను మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లి, ఎస్ఈ కృష్ణప్ప గారితో మరియు సంబంధిత అధికారులతో మాట్లాడి వారం రోజుల్లో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సుఖ్ జీవన్ రెడ్డి, శాంతి కుమార్, మల్లికార్జున, డి. కృష్ణా, శ్రీకాంత్ గౌడ్, భూపాల్ రెడ్డి, సతీష్, ప్రభాకర్ రెడ్డి, దినేష్, సంతోష్, శ్రీకాంత్ చారి, అనంత చారి, తిరుమలరెడ్డి, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.







ఎల్‌నినోను సాకుగా చూపి హామీల నుంచి తప్పించుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- రైతులను, ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ మైండ్‌గేమ్ ఆడుతోంది

తెలంగాణ రక్షణ సేన నేత కొట్టాల యాదగిరి

గజ్వేల్ నియోజకవర్గం, నవంబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి):

ఎల్‌నినో ప్రభావాన్ని సాకుగా చూపుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం తప్పించుకునే ప్రయత్నం చేస్తోందని తెలంగాణ రక్షణ సేన గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ఆరోపించారు.రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందంటూ పంటలు సాగు చేయవద్దని,నీటి కొరత ఏర్పడుతుందని ప్రజలను ఆందోళనకు గురిచేయడం సరికాదన్నారు.నిజంగా ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉంటే గజ్వేల్ నియోజకవర్గంలోని మండలాలను కరువు మండలాలుగా ఎందుకు ప్రకటించలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.ప్రజలకు భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం పరిస్థితులకు అనుగుణంగా ముందస్తు ప్రణాళికలు రూపొందించడంలో విఫలమైందని విమర్శించారు. మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు రోజురోజుకూ పెరుగుతుండటంతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజలకు భరోసా కల్పించి, పేద,మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలని కోరారు.నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు తక్షణమే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.ధరల నియంత్రణలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజల పక్షాన తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎడ్ల నరసింహులు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగని రాజు,కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

- పెద్ద షాపూర్, నర్కూడ పీహెచ్‌సీలలో వినతిపత్రాల అందజేసిన

- సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నీరటి మల్లేష్

శంషాబాద్, నవంబర్ 03, (ప్రజా కలం)

శంషాబాద్ మండలం నర్కూడ సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద షాపూర్ నర్కూడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీ) లో ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం వినతి పత్రాలు అందజేయడం జరిగింది. డిసెంబర్ నెలలో తలపెట్టిన రాష్ట్రవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిస్తూ ఈ



కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు నీరటి మల్లేష్ గారు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ. 18,000/- ఇవ్వాలి ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలి రూ. 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం వెంటనే దిగివచ్చి చర్చలు జరిపి ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు సిద్ధమవుతామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్ల సంఘం జిల్లా కార్యదర్శి సునీత, మండల అధ్యక్షులు అనిత, మంజుల, సుమలత, శారద, అనిత, నవనీత తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలి

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఆవుల యాదయ్య

మహేశ్వరం, నవంబర్ 03, (ప్రజా కలం)

మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదుకు చివరి తేదీ నవంబర్ 6 అని మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఆవుల యాదయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం, మహేశ్వరం మండలంలోని ప్రతి గ్రామంలో ఉన్న అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటును నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.నవంబర్ 1, 2026 నాటికి డిగ్రీ పూర్తి చేసి మూడేళ్లు పూర్తయిన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకునేందుకు అర్హులు. ఆన్ లైన్‌లో తెలంగాణ ఎన్నికల సంఘం అధికారిక వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు అని ఆఫ్ లైన్ లో డీఈవో, ఈఆర్వో ఏఈఆర్వో కార్యాలయాల్లో ఫారం-18 అందుబాటులో ఉంటుందని కావున అర్హత ఉన్న ప్రతి ఒక్క పట్టభద్రుడు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



నేత్రదానం మహాదానం

-మరణానంతరం మరో ఇద్దరికి చూపునిచ్చే అవకాశం.. నంగునూరి సత్యనారాయణ

సిద్దిపేట జిల్లా, నవంబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి)

సిద్దిపేట జిల్లా ఎలకంటి గ్రామానికి చెందిన వాడకట్టు నాగమణి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న లయన్స్ క్లబ్ సభ్యులు, కొమరవెల్లి ఆలయ మాజీ డైరెక్టర్



నంగునూరి సత్యనారాయణ మృతు రాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు.అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో,మేఘా హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ మేఘన పర్యవేక్షణలో కుటుంబ సభ్యుల అంగీకారంతో నాగమణి నేత్రాలను సేకరించారు. ఈ సందర్భంగా నంగునూరి సత్యనారాయణ మాట్లాడుతూ.. నేత్రదానం మహాదానమని,మరణించిన వ్యక్తి నేత్రాల ద్వారా చూపు కోల్పోయిన మరో ఇద్దరికి వెలుగును ప్రసాదించే అవకాశం ఉంటుందని అన్నారు.ప్రతి ఒక్కరూ నేత్రదానం,అవయవదానంపై అవగాహన పెంచుకోవాలని, మరణానంతరం కూడా ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

ధాన్యం కొనుగోళ్లు వెంటనే చేపట్టాలి

- జిల్లాలో అన్ని కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

-రైతుల ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

- ధరావత్ చంద్ర భాను నాయక్



బీబీనగర్, నవంబర్ 03 (ప్రజాకలం): జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలని జాతీయ రైతు పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ధరావత్ చంద్ర భాను నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఆరుగాలం శ్రమించి, ఎన్నో వ్యయప్రయాసలకోర్చి ధాన్యాన్ని పండించి కల్లాలకు చేర్చారని తెలిపారు. అరకొర విద్యుత్ సరఫరా కారణంగా వ్యవసాయ మోటార్లు కాలిపోయి రైతులు ఇప్పటికే ఆర్థికంగా నష్టపోయారని పేర్కొన్నారు. దీనికి తోడు అధికారులు పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇంకా ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్లలో జాప్యం కారణంగా రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు ధాన్యాన్ని విక్రయిస్తూ నష్టపోతున్నారని తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించడంతో పాటు కల్లాల్లో నిల్వ ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేయాలని కోరారు. తూకం సమయంలో తాలు పేరుతో అనవసర కోతలు విధించకుండా, నాణ్యతా ప్రమాణాల ప్రకారం కొనుగోళ్లు చేపట్టాలని సూచించారు. రైతులను నిబంధనల పేరుతో ఇబ్బందులకు గురిచేయకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతుల సమస్యలను ప్రభుత్వం, అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే జాతీయ రైతు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ధరావత్ చంద్ర భాను నాయక్ హెచ్చరించారు.

గిరిజన ప్రాంతాలకు మెరుగైన వైద్యం అందించాలి

- ఎయిమ్స్ ఆసుపత్రిని సందర్శించిన మంత్రి సీతక్క

- ములుగులో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలి..



బీబీనగర్, నవంబర్ 03 (ప్రజాకలం): మారుమూల గిరిజన ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అన్నారు. ములుగు జిల్లాలో గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఎయిమ్స్ ఆధ్వర్యంలో మరిన్ని వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. మంగళవారం బీబీనగర్‌లోని ఎయిమ్స్‌ను సందర్శించిన ఆమెకు సంస్థ కార్యనిర్వాహక సంచాలకురాలు ప్రొఫెసర్ డాక్టర్ అమిత అగర్వాల్, డీన్లు, సీనియర్ అధ్యాపకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ములుగు జిల్లాలో గిరిజనుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణ కోసం ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాలను అధికారులు వివరించారు. గిరిజన ఆరోగ్య కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ మీలీ పాండా మాట్లాడుతూ.. వైద్య శిబిరాలు, పరిశోధనలు, టెలీ వైద్య సేవలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, విద్యా ప్రణాళికలు, వృత్తి మార్గదర్శక కార్యక్రమాల గురించి వివరించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. మారుమూల గిరిజన ప్రాంతాల్లో ప్రజలకు వైద్య సేవలు పొందడం కష్టంగా మారుతోందన్నారు. ముఖ్యంగా గిరిజన మహిళలు అనేక ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వారికి సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. టెలీ వైద్య సేవలను విస్తరించి మారుమూల ప్రాంతాల ప్రజలకు వైద్య సలహాలు అందించాలని కోరారు. ములుగు జిల్లాలో నిర్వహించిన సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని అభినందిస్తూ, సేవలందించిన వైద్యులు, స్వచ్ఛంద సేవకులను సత్కరించారు. తన జీవిత ప్రయాణాన్ని ప్రస్తావించి గిరిజన మహిళగా ఎదుర్కొన్న సవాళ్లను అధిగమించి న్యాయవాదిగా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఎదిగిన తీరును వివరించారు. అనంతరం 'అడ్వాన్స్‌డ్ హెల్త్‌కేర్ సిస్టమ్ ఇన్ ములుగు' పత్రికతో పాటు సమగ్ర గిరిజన ఆరోగ్య కార్యాచరణ ప్రణాళిక, ప్రాజెక్టు నివేదికను విడుదల చేశారు. ములుగు జిల్లాతో పాటు ఇతర వెనుకబడిన ప్రాంతాల్లోనూ వైద్య సేవలను మరింత విస్తరించాలని ఎయిమ్స్ అధికారులను కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌సీటీయూ ఉపకులపతి ప్రొఫెసర్ వై.ఎల్. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ములుగు జిల్లాలో ఎయిమ్స్ సహకారంతో ఉప వైద్య కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రొఫెసర్ డాక్టర్ రాహుల్ నారంగ్ మాట్లాడుతూ.. సకాలంలో వైద్యం అందక ఏ మహిళా, చిన్నారి ప్రాణాలు కోల్పోకూడదని, వైద్య సంస్థలు, ప్రభుత్వ శాఖలు, ప్రజల సమన్వయంతో మారుమూల గ్రామాలకు నాణ్యమైన వైద్యం చేరేలా కృషి చేయాలని అన్నారు.

హైదరాబాద్‌లో బీజేపీ మహా గర్జన..

- అమిత్ షా సమక్షంలో మహా పాదయాత్ర..

- భారతి నగర్ నుంచి భారీగా తరలివచ్చిన బీజేపీ శ్రేణులు..

పటాన్‌చేరు, నవంబర్ 3 (ప్రజా కలం) ప్రతినిధి ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన మహా పాదయాత్రలో



సంగారెడ్డి జిల్లా క్రీడా విభాగం కన్వీనర్ కంజర్ల కృష్ణమూర్తి, సునంద కృష్ణమూర్తి పాల్గొన్నారు. నవంబర్ 2న నిర్వహించిన ఈ కార్యక్రమానికి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. లోకతంత్రాన్ని కాపాడుదాం. అరాచకత్వాన్ని అంతం చేద్దాం అనే నినాదంతో చేపట్టిన ఈ మహా పాదయాత్ర ఎల్బీ స్టేడియం నుంచి ప్రారంభమై ఎంజే మార్కెట్ వరకు కొనసాగింది. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో అమిత్ షా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంతో పాటు విపక్ష కూటమిపై తీవ్ర విమర్శలు చేశారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ,ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై చర్చకు సిద్ధమని విపక్షాలకు సవాల్ విసిరారు.సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి ఆధ్వర్యంలో భారతి నగర్ డివిజన్ నుంచి కంజర్ల కృష్ణమూర్తి నేతృత్వంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు,ప్రజలు ఈ కార్యక్రమానికి తరలివచ్చారు తొలుత బస్సులో మియాపూర్ మెట్రో స్టేషన్‌కు చేరుకుని,అక్కడి నుంచి మెట్రో రైలులో ప్రయాణించి మహా పాదయాత్రలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో భారతి నగర్ డివిజన్ నుంచి సునంద కృష్ణమూర్తి,అనిత,ఊర్మిళ, అంజలి తదితర బీజేపీ కార్యకర్తలు,ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సంఘీభావం ప్రకటించారు..


ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం బాధ్యతగా పనిచేయాలి - శంబిపూర్ రాజు

కూకట్ పల్లి, నవంబర్ 03, ప్రజా కలం ప్రతినిధి:

శేరిలింగంపల్లి నియోజకవర్గ పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంపై బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులతో హైదర్ నగర్ డివిజన్, సమతానగర్ పార్టీ ఆఫీస్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఓటరు నమోదు ప్రక్రియపై నాయకులతో చర్చించి, అర్హులైన పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గత పట్ట భద్రుల ఓట్ల జాబితా ఆధారంగా పూర్తి వివరాలు సేకరించి అర్హులైన ప్రతి ఒక్కరు ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. నవంబర్ 6 చివరి తేదీ కావడంతో ఓటర్ నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి విజయం కోసం నాయకులు అభిమానులు కార్యకర్తలు బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, ఉమ్మడి హైదర్ నగర్ డివిజన్ నాయకులు సుబ్బరాజు, సంజీవ రెడ్డి, నక్క శ్రీనివాస్, శివ రావు, సత్యనారాయణ రాజు, ఖదీర్, రామలింగేశ్వర రావు మరియు నాయకులు పాల్గొన్నారు.



అక్రమ వెంచర్లకు అధికారుల పవర్ సపోర్ట్?



- అక్రమ లేఅవుట్లలో వెలుగుతున్న ప్రశ్నలు!..

- పటేల్‌గూడలో అనుమతుల్లేని వెంచర్లకు విద్యుత్ లైన్లు..

- సృజనలక్ష్మి, రాజరాజేశ్వరి లేఅవుట్లకు అనుమతులు లేవని ఆరోపణ..

- ఆర్టీఐకి విద్యుత్ అధికారుల నుంచి సమాధానం కరువు..

- ఏ ప్రాతిపదికన వేశారో చెప్పాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి..

పటాన్‌చేరు, నవంబర్ 3 (ప్రజా కలం) ప్రతినిధి

బీరంగూడ డివిజన్ పరిధిలోని పటేల్‌గూడలో అక్రమ లేఅవుట్ల వ్యవహారం మరోసారి తీవ్ర వివాదాస్పదంగా మారింది. ప్రభుత్వ అనుమతులు లేకుండా వెలసిన వెంచర్లకు టీజీఎస్పీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ లైన్లు వేస్తున్నారని, ఇది ఏ నిబంధనల ప్రకా రమో చెప్పాలని స్థానికుడు ఈర్ల వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన విద్యుత్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు..

ఏయే లేఅవుట్లపై ఆరోపణలు?..

పటేల్‌గూడ పరిధిలోని సృజనలక్ష్మి లేఅవుట్ ఫేజ్-1, 2, 3, 4, రాజరాజేశ్వరి లేఅవుట్ ఫేజ్-1, 2తో పాటు ఇటీవల పుట్టుకొచ్చిన మరికొన్ని వెంచర్లకు ప్రభుత్వ అనుమతులు లేవని వెంకటేష్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎనిమిదేళ్లుగా ఈ అక్రమ వెంచర్ల నిర్మాణాలపై తాను న్యాయపోరాటం చేస్తున్నానని ఆయన తెలిపారు..

అనుమతుల్లేకున్నా విద్యుత్ సరఫరా ఎలా?..

అనుమతులు లేని వెంచర్లలో టీజీఎస్పీడీసీఎల్ సిబ్బంది విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తుండటంపై వెంకటేష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ వెంచర్లకు విద్యుత్ సదుపాయం కల్పిస్తే, నిబంధనలు ఉల్లంఘించిన వారికి పరోక్షంగా అండగా నిలిచినట్లేనన్న చర్చ స్థానికంగా సాగుతోంది..

ఆర్టీఐకి దక్కని సమాధానం..


ఈ అంశంపై గత ఆగస్టు 25న కిష్టారెడ్డిపేట సహాయ ఇంజినీర్‌కు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద దరఖాస్తు చేసినా పూర్తి సమాచారం ఇవ్వలేదని వెంకటేష్ ఆరోపించారు. పైగా ఉన్నతాధికారులను సంప్రదించండి అంటూ బాధ్యత నుంచి తప్పించుకున్నారని ఆయన పేర్కొన్నారు..

కలెక్టర్ జోక్యం కోరిన బాధితుడు..

ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్, టీజీఎస్పీడీసీఎల్ సంగారెడ్డి సహాయ డివిజనల్ ఇంజినీర్, డివిజనల్ ఇంజినీర్ జోక్యం చేసుకోవాలని వెంకటేష్ విజ్ఞప్తి చేశారు. ఆయా లేఅవుట్లలో విద్యుత్ లైన్ల ఏర్పాటుకు ఎవరు అనుమతి ఇచ్చారు, ఏ నిబంధనలు అనుసరించారు, ఏ ప్రాతిపదికన పనులు చేపట్టారో పూర్తి వివరాలు బయటపెట్టాలని కోరారు..

ఇప్పుడు అధికారులే సమాధానం చెప్పాలి!..

అక్రమ లేఅవుట్లలో విద్యుత్ సదుపాయాల వెనుక అధికారిక అనుమతులు ఉన్నాయా? పనులన్నీ నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయా? ఈ ప్రశ్నలపై అధికారులు వెంటనే స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన డిమాండ్ చేశారు..



ఉద్యోగ దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్ జిల్లా లోని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్.ఎ) యూనిట్-I, నిర్మల్ ఆఫీస్ నందు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగాలు భర్తీ చేయుటకు ఈ ప్రకటన ద్వారా అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కొరబడుతున్నాయి.

ఉద్యోగ వివరాలు & అట్టి ఉద్యోగమునకు అర్హతలు ఈ క్రింద వివరించబడినవి :

క్ర.సం.	ఆఫీస్ యొక్క పేరు	పోస్ట్ యొక్క పేరు	కావాల్సిన అర్హత
1	స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్.ఎ) యూనిట్-I, నిర్మల్	చైన్ మన్ (01)	7వ తరగతి నుంచి ఆపై చదువుకున్న, పాస్ లేదా ఫెయిల్ అయిన వారు
		డేటా ఎంట్రీ ఆపరేటర్ (03)	ఏదైనా డిగ్రీ ఉండి, PGDCA లో ఉత్తీర్ణులై ఉండాలి మరియు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి
		సర్వేయర్ (02)	10వ తరగతి (S.S.C) + ITI సర్వేయర్ ట్రేడ్, లేదా సివిల్ ఇంజనీరింగ్ లో డిప్లొమా/డిగ్రీ
		సెక్యూరిటీ గార్డ్ (01)	7వ తరగతి నుంచి ఆపై చదువుకున్న, పాస్ లేదా ఫెయిల్ అయిన వారు
		స్వీపర్ (01)	7వ తరగతి నుంచి ఆపై చదువుకున్న, పాస్ లేదా ఫెయిల్ అయిన వారు (స్త్రీలకు ప్రధాన్యత)
వయోపరిమితి: 18 నుంచి 44 సంవత్సరంలోపు ఉండవలెను. బిసి, ఎస్సీ, ఎస్టీ, అభ్యర్థులకు 49 సంవత్సరాల్లోపు ఉండాలి. దివ్యంగా అభ్యర్థులు 54 సంవత్సరంలోపు ఉండాలి			
నోట్: కేవలం నిర్మల్ జిల్లా కి చెందిన అభ్యర్థులకు మాత్రమే			

కావున అర్హత కలిగిన నిర్మల్ జిల్లా అభ్యర్థులు తమ సర్టిఫికెట్ జిరాక్స్ సెట్ తోపాటు ఒక passport సైజ్ ఫోటోని తేదీ: 04.11.2026 ఉదయం 10 గంటల నుండి 06.11.2026 సాయంత్రం 5 గంటల వరకు వ్యక్తిగతంగా విచ్చేసి దరఖాస్తు చేసుకోగలరు.

గమనిక: ఇట్టి ఉద్యోగ ప్రకటనలో సవరణలు లేదా రద్దు పర్చుటకై ప్రెసిడెంట్, శ్రీ సాయి యూత్ అసోసియషన్ గారికి సంపూర్ణ అధికారం కలదు. మరిన్ని వివరాలకు సంప్రదించవలసిన చిరునామా: శ్రీ సాయి యూత్ అసోసియేషన్ బ్రాంచ్ ఆఫీస్ : C/o బి. అనిల్, పంజేషగల్లీ నిర్మల్, జిల్లా: నిర్మల్, ఫోన్:7075750751, 9849068124

విఘ్నోపాసన

(మనకు ఎదురుపడ్డ ఆటంకాలను అధిగమిస్తూ...
మతలబుతో బతకాలి)

విందుకు మందుకు పొందుకు ముందుకొచ్చే రోజులొచ్చాయి
మంచికి మానవత్వానికి మానవీయతకు విలువనిచ్చే రోజులెళ్ళాయి
నీతికి నిజాయితీకి న్యాయానికి కళ్లెం వేసే అబద్ధాల రోజులే మన ముందుంటాయి
ఈ లోకం పోకడ చూడు బ్రదర్
ఈ మనిషి మతలబు ఎరుగుమ సిస్టర్
చేతి నిండా డబ్బులుంటే ఇంటినిండా బంధువులే
వట్టి చేతున్నాయని తెలిసితే ఆత్మీయులు కూడా పరాయి వారే
మన జేబు గరముంటే చాలు తప్పుడు పనికైనా జై కొడుతారు
మన జేబు ఖాళీయితే చెత్త బుట్టవంటారు
లోకం పోకడ చూడుము బ్రదర్
ఈ జనం నడక ఎరుగుము సిస్టర్
మన అవసరమైతే తెనాలొలికిస్తారు
లేదంటే కనీసం కనుచూపైనా కరువే
వెన్నంటే ఉంటారు వెన్నుపోటు పొడుస్తారు
తిన్నింటి వాసాలు లెక్కెట్టి బజారు పాలు జేస్తారు
అందుకే..
ఎవరెంత తప్పు తోవ పట్టించిన
అలోచించి అడుగులేయాలే...
ఎవరెన్ని అన్నా ఓపికతో నడవాలే...
మనం సక్రమ తోవలుంటే
అంకర తోవదీసే జనం
మన నాశనాన్ని కోరుతారు
అంబురాన్ని అంటే సంబురాలు చేస్తారు
మనమెట్లెట్ల పతనమైతే
వారట్లట్ల ఎగిరి గంతులేస్తారు
ఇది
ఎరిగి మసలుకో మంటాను బ్రదర్
మతలబుతో బతకాలంటాను సిస్టర్

విజ్ఞాన కళా నేత్రం
కవి రాజా



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,Telangana -503001
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com